
Deccan Land




JULY | 2026

Deccan

JULY

జులై - 2026
DECCAN LAND, HYDERABAD
167
JULY - 2026

PRGI Regn. No. TELTEL/2012/46784
₹30
సంపుటి : 14
సంచిక : 11


# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక


UNESCO, India Tentative List (TL) Site - 2014: MONUMENTS AND FORTS OF THE DECCAN SULTANATE INDIA



VOL 14వ వసంతంలో
167 ISSUES నూట అరవై ఏడవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్




- న్యాయవ్యవస్థ నైతికతలను ప్రశ్నించే కవితలు
- తెలంగాణకు సోమపానం తెలుసా?
- బీసీ చైతన్యం ఎందుకు విఫలమవుతోంది?
- పర్యాటకం - ప్రకృతికి సంక్షోభం!





బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

## తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు

18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లల్లో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ


**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ** (Regd. 720/1982)
హైదరాబాద్

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com




UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2014
Serial Nomination for
MONUMENTS AND FORTS OF THE DECCAN SULTANATE INDIA
Karnataka & Andra Pradesh District Province or Region India.
Category: Cultural

## దక్కన్ సుల్తానేట్ కట్టడాలు, కోటలు


'దక్కన్ సుల్తానేట్ స్మారక చిహ్నాలు' అనేది ఒక సీరియల్ ప్రాపర్టీ. ఇందులో భారతదేశంలోని దక్కన్ సుల్తానేట్ స్మారక చిహ్నాలకు అత్యంత ప్రాతినిధ్యం వహించే, అత్యంత ప్రామాణికమైన, ఉత్తమంగా సంరక్షించ బడిన నాలుగు భాగాలు ఉన్నాయి. ఈ శ్రేణి, ఇస్లామిక్ వాస్తుశిల్పంలోని జాతీయ, అంతర్జాతీయ శైలుల అద్భుత సమ్మేళనాన్ని, అలాగే ప్రస్తుత కర్ణాటక, తెలంగాణలోని దక్షిణ భారతదేశంలో ఆ కాలంలో ప్రబలంగా ఉన్న హిందూ వాస్తుశిల్పంతో వాటి సంబంధాలను ప్రదర్శిస్తుంది. గుల్బర్గా, బీదర్, బీజాపూర్, హైదరాబాద్‌లలో నిర్మించిన ఐకానిక్ ఇండో ఇస్లామిక్ స్మారక కట్టడాలతో భారత దేశ కళలు, వాస్తుశిల్పానికి దక్కన్ సుల్తానేట్ చేసిన కృషి ఆకట్టుకుంటుంది.

*ప్రత్యేక వ్యాసం : 29వ పేజీలో*

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com    website : www.deccanland.com




## నాగరిక జీవనంలో తెలంగాణ

తెలంగాణ అస్థిత్వం కాపాడేందుకు ఎప్పటికప్పుడు పౌర సమాజం అప్రమత్తంగా ఉంటుంది. అందుకే రచయిత శివనాగిరెడ్డి చెప్పినట్లు నాగరిక జీవనంలో తెలంగాణ ముందుంటుంది. రెండు వేల సంవత్సరాల నాడే విదేశీ వస్తువులు, మద్యంపై మోజు వుండేదని, విలాస పురుసులు, నాగరికం తెలిసిన వారు అని చరిత్ర తెలుపుతుంది. దీనికి సాక్ష్యం స్థపతి ఈమని శివనాగిరెడ్డి వివరాలు. నల్లగొండ జిల్లా కృష్ణాతీరాన ప్రాచీనమైన స్థావరం ఏలేశ్వరం తవ్వకాల్లో రోమన్ నాణేలతో పాటు రోమన్ సుందరీమణుల బొమ్మలున్న మట్టి బొమ్మలు, మట్టి మద్యం పాత్రలు బయల్పడింది. దీన్ని బట్టి విలాస పురుషులకు నజరాణాగా, నాగరిక జీవనంలో తెలంగాణ కొత్త ఒరవడిని సృష్టించిందనడానికి సజీవ సాక్ష్యం.

**– వెంకట సృజన్,** హైదరాబాద్

❖ ❖ ❖

## కనుమరుగవుతున్న భాష

తెలంగాణలో 'పైశాచి' భాష కనుమరుగు కాకుండా కాపాడుకుందాం. రచయిత ద్యావనపల్లి సత్యనారాయణ తెలిపిన ప్రకారం సుమారు రెండు వేల సంవత్సరాలకు పూర్వం కవి గుణాఢ్యుడు ప్రపంచంలోనే మొట్టమొదటి కథా సంకలన గ్రంథం 'బృహత్కథ'ను పైశాచి భాషలో రచించాడు. పైశాచిని ఒక రకమైన ప్రాకృత భాష అని, రాక్షసుల భాష అని, భూత భాష అని, కొన్ని అపభ్రంశాల వంటి అనాగరిక భాష అని అన్నారని, హేమచంద్రుడు వంటి వ్యాకరణకారులు చూలికా పైశాచి అని పైశాచి భాషలో ఒక ఉప భేదం కూడా ఉన్నదని ప్రస్తావించాడని తెలుస్తున్నది. ఈ పైశాచి భాషా భేదం ప్రాచీన లక్షణాలను కలిగి ఉంది. అధికార భాష, మెజారిటీ భాష వ్యవహారం నిమిత్తం తక్కువ మంది మాట్లాడే (గిరిజన) భాషలను చంపేస్తాయి. అట్లా ఇప్పుడు కోయ, కోలం, బంజారా భాషలు కనుమరుగవుతుండడం చూస్తున్నాం.

**– కృష్ణ నాయక్,** మహబూబ్‌నగర్

❖ ❖ ❖

## కాకతీయులనాటి శివాలయం నేలమట్టం

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని అశోక్ నగర్ సైనిక్ స్కూల్ సమీపంలోని పాతకోట మట్టికోట ఆవరణలో వుండే పాత గుడి ఇటీవల నేలమట్టం చేసి బడి కట్టాలని చూస్తున్నారు. బడి కట్టడానికి చారిత్రకనేపథ్యం గల దేవాలయం కూల్చడం శోచనీయం, చారిత్రక తప్పిదనం. ఇటువంటి సలహా, సూచనలు ఎవరు చేశారో, ఎవరు నిర్ణయాలు తీసుకున్నారో తెలియకుండానే, ఒక ధార్మిక దేవాలయం నేలమట్టమవ్వడం చాలా బాధాకరం. ఈ గుడిని తొలి కాకతీయ (కళ్యాణీచాళుక్య) శైలిలో నిర్మించబడిన ఏకకూట దేవాలయం. గర్భగుడి, అంతరాళం, అర్ధమంటపం ప్రణాళికతో నిర్మించబడి, పదహారు స్తంభాల అర్ధమంటపం కక్ష్యాసనాలతో కూడివుంది. అంతరాళం ద్వారబంధం త్రిశాఖ పద్ధతిన తయారు చేయబడి, ద్వార పతంగం మీద లలాటబింబం లేదు. ద్వారశాఖమీద స్తంభికలుండి, ద్వారశాఖలకు రెండువైపుల ద్వారపాలకులున్నారు. లెంటల్ మీద, కప్పుకింద చతుర్దళ రత్నపుష్పాలతో అలంకరించబడ్డ రాతి దూలాలున్నాయి. గర్భగుడి ద్వారబంధం కూడా అంతరాళ ద్వారం వలెనే నిరాలంకారంగా వున్నది. చారిత్రక నేపథ్యం గల దేవాలయం గురించి తెలిపిన శ్రీరామోజు హరగోపాల్ గారికి కృతజ్ఞలు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని గుడిని యథాస్థితిలో పునఃప్రతిష్ఠించాలని కోరుకుంటున్నాం.

**– వి. క్రాంతి,** వరంగల్

❖ ❖ ❖

## పర్యావరణ మార్పులు

సంపాదకులు మణికొండ వేదకుమార్ తమ సంపాదకీయంలో ఆరోగ్యం, వాతావరణ మార్పుల గురించి చాలా చక్కటి విషయాలు తెలియజేశారు. ఋతుపవనాలు వెనక్కి పోయి, ఎండల మండిపోతున్నాయి. వర్షాలు కురిసినా వేడిమి తగ్గే అవకాశాలు లేవని పర్యావరణ వాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఎలినోన్ ప్రభావం తీవ్రంగా వుంది. వానలు లేక కర్షకులు, కార్మికులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ప్రతి సంవత్సరం 25 % ప్రపంచ వ్యాధులు పర్యావరణ కాలుష్యం వల్ల వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికైనా వాతావరణ మార్పుపై ఆలోచించాలి.

**– కె. వినయ్,** కొండాపూర్

## పరిశోధకులకు శుభవార్త

### దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 14 సంచిక : 11 పేజీలు : 60

జులై - 2026



సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

వాణిజ్య ప్రకటనలు

**కె. సచిన్**

86866 64949

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**



కవర్‌పేజీ

**దక్కన్ సుల్తానేట్ కట్టడాలు, కోటలు**

layout - Composing & Printed @

DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020

Mobile: 90599 50055

deccanpress.hyd@gmail.com



కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,

Himayatnagar, Hyderabad - 500 029

TELANGANA

Mobile: 9030626288

Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com




**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు

సలహాలు, సూచనలు అందించిన

వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


# లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ


29వ పేజీలో



ప్రకృతి ప్రేమికురాలు,

పర్యావరణ హితైషి

జానకి లెనిన్



అంతరిక్షంలో

అమ్మకానికి ప్లాట్లు!


బహుముఖ ప్రజ్ఞాశాలి 'కంబదూరు' స్మృతి ............ దాదాబాష ............ 6

నీటిని కాపాడుకోవడం మన బాధ్యత.. (ఎడిటోరియల్) ............ వేదకుమార్. యం ............ 7

అంతరిక్షంలో అమ్మకానికి ప్లాట్లు! ............ చకిలం వేణుగోపాలరావు ............ 9

మానవాళి ఉనికికి - అంతరిక్ష అన్వేషణ ............ కొత్వాల్ సచిన్ ............ 12

ఇంటి నెంబరు 20-6-296 ............ పరవస్తు లోకేశ్వర్ ............ 13

మేధోపరమైన సాంస్కృతిక ఆట చదరంగం ............ ఎసికె. శ్రీహరి ............ 16

దక్షినాదిన రాజుబొమ్మతో నాణెం ఆవిష్కరించిన తెలంగాణ! .. ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ............ 17

హరిత భవిష్యత్తుకు కాగితపు సంచులు ............ జుగాష్‌విలి ............ 18

ప్రకృతి ప్రేమికురాలు : జానకి లెనిన్ ............ డా॥ ఆర్. సీతారామారావు ............ 19

తెలంగాణకు సోమపానం తెలుసా? ............ ద్యావనపల్లి సత్యనారాయణ ............ 21

బీసీ చైతన్యం ఎందుకు విఫలమవుతోంది? ............ బి.ఎస్.రాములు ............ 23

ఆంగ్లేయులు: 1611-1947 ............ మహ్మద్ సిలార్ ............ 25

గ్రాఫైట్ ఖనిజం యొక్క నిక్షేపాలు మరియు ఉపయోగాలు ....... కమతం మహేందర్‌రెడ్డి ............ 27

దక్కన్ సుల్తానేట్ కట్టడాలు, కోటలు ............ ఎన్. వంశీమోహన్ ............ 29

బాటసింగారం ప్రాథమిక పాఠశాల ............ ఆర్.వెంకటరెడ్డి ............ 35

న్యూక్లియర్ ఫిజిక్స్ పరిశోధకులు డా॥ ఎమ్.ఆర్.రాజు ............ డా॥ నాగసూరి వేణుగోపాల్ ............ 37

న్యాయవ్యవస్థ... నైతికతలను ప్రశ్నించే కవితలు ............ డా॥ మంగారి రాజేందర్ (జింబో) ............ 39

పండితారాధ్య మల్లికార్జుని ప్రస్థాన స్థానం బెక్కెం ............ శ్రీరామోజు హరగోపాల్ ............ 41

సీతమ్మలొద్ది ప్రాముఖ్యత ............ బండి మురళీధర్‌రెడ్డి, దుగ్గంపూడి రవీందర్‌రెడ్డి . 44

గ్రహాంతర జీవుల ఉనికి ............ దక్కన్ న్యూస్ ............ 46

అల్లకొండ+వల్లకొండ = బాల్కొండ ............ బ్రాహ్మ రౌతు నర్సింగ్ రావు ............ 47

మహిళా కమర్షియల్ డైవర్ - అతుల్య కేవీ ............ కె. సత్యప్రసన్న ............ 49

అష్టనాగులతో పూజలందుకుంటున్న కోలాదేవి ఖగరాజు ............ డా॥ జి.యస్. రామయ్య ............ 51

పెను సంక్షోభంలో వ్యవసాయం ............ రాజేశ్వరి సిన్హా ............ 53

నమ్మకమైన తోడు... రేడియో ............ ఎస్. హన్మంతరావు ............ 55

సుస్థిర భవిష్యత్తు కోసం యువత సాధికారత ............ కట్టా ప్రభాకర్ ............ 57


**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిద్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# బహుముఖ ప్రజ్ఞాశాలి ‘కంబదూరు’ మృతి

కవి, వ్యాసకర్త, సామాజిక సేవా కార్యకర్తగా సేవలందించిన కంబదూరు షేక్ నబీ రసూల్ (74) అనారోగ్యంతో బాధపడుతూ జూన్ 11న మృతి చెందారు. అనంతపురం జిల్లాలోని కంబదూరులో ఆయన 1952లో జన్మించారు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత విద్యుత్ శాఖలో పనిచేసి పదవీ విరమణ చేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి షేక్ కంబదూరు నబీ రసూల్‌కు ఇద్దరు భార్యలు. ఇద్దరూ గతంలోనే మరణించారు. ఇద్దరు కొడుకులు ఉన్నారు. జిల్లా రచ యితల సంఘం, ఎన్నికల నిఘావేదిక, వినియోగదారుల రక్షణ మండలి, సమాచార హక్కు పరిరక్షణ సంఘం, త్యాగరాజ సంగీత సభ, లయన్స్‌క్లబ్, ఇంటాక్, తెలుగు వెలుగు సంస్థల్లో చివరిదాకా పనిచేశారు. వినియోగవాణి పత్రికలో సహ సంపాదకుడిగా వినియోగదారులను చైతన్యం చేసే వందల వ్యాసాలు రచించారు. కవిగా ఆయన ‘కమ్మని కంఠం నాకు లేదు’ ‘నిత్య నవనీతం నబీరసూల్ సుభాషితం’ పేరుతో పుస్తకాలు, వందల సంఖ్యలో కవితలు, సూక్తులు రచించి నిత్యం ఫేస్ బుక్ ద్వారా పంచుకునేవారు. నటుడిగానూ భీముడు, సుయోధనుడి పాత్రల్లో నటించి మెప్పించారు.



**పరిచయ పత్రం:**

**పేరు:** కంబదూరి షేక్ నబిరసూల్

**కలం పేరు:** “కంబదూరి”

**పుట్టిన తేది:** 01-07-1952

**పుట్టిన గ్రామం:** కంబదూరు, అనంతపురము జిల్లా.

**తల్లిదండ్రులు:** కీ॥శే॥ ఖాజాబీ & కీ॥శే॥ షేక్ మస్తాన్సాహేబ్,

**ప్రస్తుత నివాసం:** ఇ.నెం.28-4-606, డ్రైవర్స్ కాలనీ, అనంతపురము - 515 001, ఆంధ్రప్రదేశ్.

**జీవిత భాగస్వామ్యం:** వహిదా ఖుర్షిద్

**సంతానం:** దాదాబాష, ఖలందర్ భాష, జహీర్, జమీర్, తబస్సుమ్

**హోదాలు:**

1. **కార్యదర్శి:** జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, 2. **సహాధ్యక్షులు:** జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అనంతపుంం, 3. **ప్రాంతీయ సమన్వయకర్త:** ఆంధ్రప్రదేశ్, ఎన్నికల నిఘావేదిక, అనంతపురము మరియు సత్యసాయి జిల్లాలు, 4. **ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులు:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి, 5. **జీవిత సభ్యులు:** ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫార్ ఆర్ట్ & కల్చరల్ హెరిటేజ్ (INTACH), 6. **గౌరవ సలహాదారులు:** జిల్లా రచయితల సంఘం, అనంతపురం. 7. **డిస్ట్రిక్ట్ గవర్నర్:** ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, అనంతపురము. 8. **జిల్లా చైర్మన్:** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, 9. **ఉపాధ్యక్షులు:** త్యాగరాజు సంగీత సభ, 10. **గౌ॥ అధ్యక్షులు:** అనంతపురము ఫిలిం సొసైటీ, **11. గౌ॥ అధ్యక్షులు:** సమాచార హక్కు పరిరక్షణ సంఘం, **12. గౌ॥ అధ్యక్షులు:** ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక, అనంతపురము నగర శాఖ. **13. జిల్లా చైర్మెన్:** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, అనంతపురము జిల్లా, **14. జిల్లా గవర్నర్:** ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్.

**సాహిత్యరంగ ప్రవేశం చేసిన సం॥:** 1968

**తొలిరచన:** కమ్మనికంఠం నాకు లేదు (కవితల ప్రతి)

**ప్రచురితమైన తొలిరచన:** 1973 (కవిత) సమరశంఖం పూరించగ రండి

**ప్రచురితమైన కవితలు వ్యాసాలు, సమీక్షలు:** దాదాపు 100కు పైగా

**వృత్తిరీత్యా:** 1.7.1972 నుండి 15.9.2003 వరకు రాష్ట్ర విద్యుత్ సంస్థలో వివిధ హోదాలలో పనిచేస్తూ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా కల్యాణదుర్గంలో పదవీ విరమణ


**ప్రవృత్తి రీత్యా:** 1968–1972: కంబదూరి యువక సంఘం కార్యదర్శిగా, 1978–1979: రాయదుర్గం చైతన్య కళాభారతి కార్యవర్గంలో, 1980–1985: కల్యాణదుర్గం శ్రీకృష్ణదేవరాయ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శిగా / వినియోగ ఉద్యమంలో ప్రవేశం., 1992–1998: పెనుకొండ ఘనగిరి సాంస్కృతిక మండలి సహాయ కార్యదర్శిగా / వినియోగ ఉద్యమంలో కార్యకర్తగా, 1999 నుండి: అనంతపురం జిల్లా జమియత్ ఉలేమా (పండిత సభ) సహాయ కార్యదర్శిగా, 2002 నుండి మరణం వరకు: రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు (ప్రభుత్వ నియామకం).

**చేయూత:** సాహిత్యంలో “ఓనమాలు” దిద్దించిన ఆత్మీయులు డా॥ ఆశావాది ప్రకాశరావు, డా॥ శాంతి నారాయణగారయితే అంచెలంచెలుగా అడుగులేయించింది. శ్రీ ఏలూరి యంగన్న గారు, డా॥ జూపల్లి ప్రేమచందో బాటు అరసం వారే, ఇక వినియోగ ఉద్యమంతో నడిపించిన రథసారథులు కీ॥శే॥ బంగిరామప్ప, కీ॥శే॥ బాభయ్య నాయుడు & శ్రీ పెంచికల రవీంద్రనాథ్ రెడ్డి గారు.

**2004 నుండి మరణం వరకు:** కార్యదర్శి జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, అనంతపురం. గౌరవ సలహాదారులు, అనంతపురం జిల్లా రచయితల సంఘం **జీవిత సభ్యులు:** ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫార్ ఆర్ట్ & కల్చరల్ హెరిటేజ్.

**సీనియర్ జర్నలిస్టుగా:** అనంత వినియోగవాణి, వినియోగదర్శిని మాసపత్రికలకు సహసంపాదకులుగా విభిన్న కోణాల్లో వర్తమాన,

*(మిగతా 8వ పేజీలో)*




# ప్రాణప్రదమైన నీటిని గౌరవించడం, కాపాడుకోవడం మన బాధ్యత

నీరు ప్రకృతి ప్రసాదించిన సహజ సంపద. సృష్టిలోని సకల జీవరాశి జీవనానికి, మనుగడకు నీరు అత్యంత కీలకం. నీరున్నచోటే నగరాలు వెలిసాయి. నాగరికతలు అభివృద్ధిచెందాయి. వర్షాల వల్ల లభ్యమైన నీరు భూమి ఉపరితలంకింద మట్టి మరియు రాతి పొరల మధ్యకి చొచ్చుకుపోయి నిల్వగానూ, ప్రవహిస్తూనూ వుంటుంది. ఈ నీటినే భూగర్భజలాలు అంటారు. భూమిలోపల దాచుకున్న ఈ నీరు మన తాగునీటి, సాగునీటి అవసరాలను తీరుస్తుంది.

భూగర్భ జలాలు సాధారణంగా బావులు, బోర్లు, చేతి పంపుల ద్వారా లభ్యమవుతుంది. నీరు మనిషి దప్పిక తీర్చడమేకాదు, జీవితం కొనసాగడానికీ అంటే ప్రాణాలతో ఉండడానికి ఈ నీరే ప్రధాన ఆధారం. అది కణాలకు పోషకాలను, ఆక్సిజన్‌ని చేరవేయడంలో, వ్యర్థాలను బయటికి పంపడంలో శరీర ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో, జీర్ణక్రియ సజావుగా సాగడంలో సహాయ పడుతుంది. మనిషి మనుగడకు అవసరమైన అనేక భౌతిక ఉత్పాదనలకు నీరే కీలకం. ఇలాంటి ప్రాణపదమైన నీటిని గౌరవించడం, కాపాడుకోవడం మన బాధ్యత.

భూగర్భజలాలు ప్రస్తుతం ఆందోళనకరస్థాయికి పడిపోయాయి. భూగర్భజలాలు తగ్గటానికి ప్రధానకారణం అవసరానికి మించి నీటిని తోడటం. బోర్లద్వారా అధిక వినియోగం, భూమి ఉపరితలం కాంక్రీటీకరణం చెందడం, నగరాలపై, పట్టణాలపై జన సాంద్రత ఒత్తిడి పెరగడం, పారిశ్రామిక నిర్మాణాలు, వర్షపునీరు భూమిలోకి ఇంకకుండా పోవడం, రైన్ వాటర్ హార్వెస్టింగ్ తక్కువగా వుండటం ప్రధాన కారణాలుగా జలవనరుల నిపుణులు చెబుతున్నారు. చిన్నచిన్న తేడాలతో అన్ని చోట్లా భూగర్భజలాల నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి. కొన్ని ప్రాంతాలు క్రిటికల్ జోన్లుగా మారాయి. ఎరువులు, పురుగు మందులు, పారిశ్రామిక రసాయన వ్యర్థజలాలు, మురికి నీటితో భూగర్భజలాలు కలుషితమవుతన్నాయి. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే జీవరాశి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది.

మన జీవన విధానంలో మార్పులు ఈ ప్రమాదం నుంచి మనల్ని రక్షిస్తాయి. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు, సంపులు ఏర్పాటు చేసుకోవాలి. అవసరాలకి నీటిని పొదుపుగా వాడుకోవాలి. అధికంగా పంపింగ్ చేయకూడదు. పంటల మార్పిడి విధానం మంచిది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, యువత, మహిళలతో నీటి సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి నీటి వినియోగాన్ని క్రమబద్ధం చేయాలి. పట్టణాలకు, నగరాలకు అనుసంధానంగా గ్రామాలను నిర్మించి పట్టణాలు, నగరాలపై జనాభా ఒత్తిడి తగ్గించాలి. జనాభా పెరగడం వల్ల ఉత్పన్నమయ్యే పలురకాల సమస్యల ఒత్తిడి తగ్గించాలి. అపార్ట్‌మెంట్స్, కాలనీలు, వాణిజ్య సముదాయాలు రైన్ వాటర్ హార్వెస్టింగ్‌ను తప్పనిసరిగా అమలు చేయాలి.

వివిధ పౌర సంస్థలు, ఆర్థిక, సాంకేతిక రంగ నిపుణులు, మేధావుల సమన్వయంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి.

ప్రజల అవగాహన, చైతన్యం, ప్రవర్తన కీలకపాత్ర వహించాలి.

వేదకుమార్.యం


(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

సామాజిక సమస్యల పట్ల స్పందించిన రచనలు ధారావాహికంగా ప్రచురితం.

**పరిశోధక రచనలు:** 1) విద్యుత్ సంస్థలో బిల్ కలెక్టర్ స్థితిగతులు మెరుగు పడటానికి వివరణాత్మక పరిశోధక సమీక్షా వ్యాసం, 2) విద్యాసంస్థల్లో ప్రారంభించిన వినియోగదారుల క్లబ్బుల పాఠాంశాలకు వినియోగదారుల ఉద్యమం, పౌరసమాచార పత్రం (సిటిజన్ చార్టర్) పాఠ్యాంశాల రచన

**ఇతర వ్యాపకాలు:** 1) 25.1.2005న సునామి బాధితులకు గుడ్డలు, బియ్యం, సబ్బులు ఇతరత్రా నిత్యావసర వస్తువులు సేకరించి నెల్లూరు జిల్లా నాయుడు పేట మండలం నవాబు పేట బాధితులకు అందజేసిన సేవలు, 2) కరోనా కాలంలో రెడ్ జోన్ ప్రాంతాలకు కూడా వెళ్ళి ఆహారం, కూరగాయలు, మాస్కులు పంపిణీ చేస్తూ నిరుపేదల కాలనీలలో టీచర్ జి. ఉమాదేవి (కూతురు)తో పాటు విస్తృత సేవాకార్యక్రమాలు. 3) జమియత్ ఉలేమా ఆధ్వర్యంలో అనంతపురంలో ముస్లిం నిరుపేదల గణాంకాలు సేకరించి అతి పేద ముస్లిం బాలురకు విద్య, ఉపాధి, నిరాశ్రయులైన మహిళలకు ఉదార జీవన భృతి ఇప్పించే సేవలు. రంజాన్ పండుగ చేసుకోలేని బీద ముస్లింలను గుర్తించి కుటుంబానికి 5 కజీలు ఉచిత బియ్యం పంపిణీ సేవలు. నెలవారీ ఆర్థిక సహాయార్హుల ఎంపిక. కరోనా సమయంలో జామిన్ హ్యాండ్, హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యాన పేదలందరికి ఉచిత రేషన్, కాయగూరలు, మాస్కు, ఆహారం పంపిణీ కార్యక్రమాలు, రెడ్ జోన్ ఏరియాలో కూడా ఆహార పంపిణీ.



**జానపద రంగం:** జానపద గీతాల ఆలాపన, గ్రామీణ పల్లెసుద్దులు, కోలాటం, పాటల సేకరణతో పలుకోలాట ప్రదర్శనలు ద్వారా ప్రాచీన కళలను కాపాడుకొనే మక్కువ. తపన కలిగి ఉండడం. నటుడిగా, దర్శకుడిగా.

**ప్రదర్శించిన నాటికలు:** దేశభక్తి, కొత్త ప్రాక్టీసు, వరుదు కావాలి, పునర్జన్మ, ధర్మానికి దిక్కెవరు, మనుషులొస్తున్నారు జాగ్రత్త, పల్లెపడుచు, జయంవమనదే, అమ్మాయి తప్పిపోయింది, పద్మవ్యూహం, శ్రీకృష్ణపాండవీయం, భువన విజయం.

**అభిరుచులు:** కథలు, కవితలు వ్రాయడం, రేడియో ద్వారా సెల్ఫోన్ ద్వారా సుభాషితాలు, సామాజికాంశాల ప్రసంగం కవి సమ్మేళనం, సాహితీ, సాంస్కృతిక, సామాజిక సేవ కార్యక్రమాలలో పాల్గొనడం, అప్రస్తుత ప్రసంగ పృచ్ఛకుడిగా అవధానాలలో పాల్గొనడం. వినియోగ ఉద్యమం చురుకైన పాత్రలో వివిధ రూపాల్లో సేవలందించడం. సమాచారహక్కుపై అవగాహనా సదస్సులు నిర్వహించుట అప్రస్తుత ప్రసంగ పృచ్ఛకత్వంతో అవధానం నిర్వహించిన సుప్రసిద్ధ అవధానులు: సర్వశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు, డా॥ మేడవరం మల్లికార్జునశర్మ శ్రీగురువేపల్లి, నరసింహులు, ఒడిగేపల్లి నరసింహం, ఎం.కె.ప్రభావతి, డా॥ కాసారం కుప్పస్వామి, జోస్యుల సదానందశాస్త్రి, బాలమేధావి, జానాదుర్గ మల్లికార్జునావు, గండ్లూరి దత్తాత్రేయ శర్మ, ఆముదాల మురళీ, మాచిరాజు శివరామరాజు.

**ఈ అవధానాలు నిర్వహించిన ప్రదేశాలు:**

గోరంట్ల, లేపాక్షి, పెనుకొండ, ఎనుములదొడ్డి, అనంతపురం, కుందిర్పి, గుంతకల్లు, బుక్కరాయ సముద్రం, కంబదూరు, రాయదుర్గం, కల్యాణదుర్గం, కనగానపల్లి, కుందుర్పి, బెస్తరపల్లి, బత్తలపల్లి

**కార్మిక సంక్షేమం:**

ఐ.ఎన్.టి.యు.సి. అనుబంధంలోని విద్యుత్ ఉద్యోగుల యూనియన్ జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అనేక కార్యనిర్వాహక పదవులు నిర్వహించి కార్మిక సంక్షేమానికి పాటుపడడం.

**విదేశీయాత్ర:**

పవిత్ర మక్కా సందర్శన ముచ్చటగా మూడుసార్లు 2002, 2006, 2007

**సామాజిక ఉద్యమకర్తగా:**

1) అవినీతి వ్యతిరేక పౌరనిఘా సంస్థ అనంతపురం జిల్లా అధ్యక్షులుగా మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సేవలందించడం. 2) ఆంధ్రప్రదేశ్ ఎన్నికల నిఘా వేదిక, అనంతపురం మరియు సత్యసాయి జిల్లాలకు రీజనల్ సమన్వయ కర్తగా ఓటర్లను జాగృతపరచడం. 3) సఫా' స్వచ్ఛంద సేవా సంస్థ, అనంతపురం జిల్లాకు మీడియా ఇన్‌ఛార్జ్ గా ఉంటూ సఫా సంస్థ ద్వారా ఏ ఆర్థిక ఆలంబన లేని నికృష్ట జీవితం గడుపుతున్న మురికివాడల్లో నివసిస్తున్న వారిని ఎంపిక చేసి వారికి పెన్షన్ల పంపిణీ మురికివాడల్లో ఉచిత ఆరోగ్య క్యాంపులు ఉచిత మందుల పంపిణీ, రంజాన్ ఉపవాసకులైన నిరుపేదలకు బియ్యం తదితర వంట సరుకుల రూ॥ 10000/- విలువ కల ప్యాకేజీ పంపిణీ, వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, చలికాలంలో అనాథలుగా బస్టాండు, రైల్వేస్టేషన్లలో, వీధుల్లో ఏ ఆచ్ఛాదనా కప్పుకోని వారిని గుర్తించి వారికి దుప్పట్లు పంచుట, అనాధ శవాల ఖనన సంస్కారాలలో, బీద బాలికలకు ఉచితవిద్య, వివాహ ఖర్చుకు సహాయం ఆసుపత్రులలో రోగులకు పళ్ళు, రొట్టెలు, ప్రముఖ పండుగలకు పంచడం వారి స్వస్థతకొరకు ప్రార్థనలు చేయడం లాంటి కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర. 4) జమీయత్-ఉలేమా (పండిత మేధావుల వేదిక) జిల్లా సహాయ కార్యదర్శిగా సమాజిక సేవలందించడం. 5) జిల్లా వినియోగదారుల సమస్యల ప్రత్యామ్నాయ పరిష్కార వేదికలో వివిధ వినియోగ సంబంధిత కేసులు కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడిగా ప్రభుత్వం 3వసారి ఎంపికతో వినియోగదారుల సేవలు విస్తృతంగా అందించడం.

- దాదాబాష
m : +91 94411 80677

# అంతరిక్షంలో అమ్మకానికి ప్లాట్లు!


మీరు గూగుల్‌లో "Buy land on Moon" అని టైప్ చేస్తే, $25కే ఎకరం ప్లాట్ అమ్మే వెబ్‌సైట్లు డజన్ల కొద్దీ ప్రత్యక్షమవుతాయి. క్లిక్ చేస్తే. మీ పేరుతో అందమైన పార్చ్‌మెంట్ డీడ్, చంద్రుడి మ్యాప్‌లో మీ ప్లాట్ మార్క్ చేసిన కోఆర్డినేట్లు, రిజిస్ట్రీ నంబర్ ఇంటికి వచ్చేస్తాయి. ఫ్రేమ్ కట్టించి హాల్లో పెట్టుకోవచ్చు. సరదాగా గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. కానీ ఆ పట్టాకు చట్టబద్ధత ఉందా? చంద్రుడిపై మీరు నిజంగా ఇల్లు కట్టుకోవచ్చా?

**సమాధానం ఒక్కటే:** చట్టపరంగా ఆ డీడ్ విలువ సున్నా.

**చంద్రుడి ప్లాట్లు అమ్మే కంపెనీలు చట్టం నుండి ఎలా తప్పించుకుంటున్నాయి?**

**1. "గిఫ్ట్" ముసుగు**

Lunar Embassy లాంటి కంపెనీలు డీడ్‌లను నవల్టీ గిఫ్ట్, జ్ఞాపిక అని టెర్మ్స్‌లో రాస్తాయి. ధర కూడా $20-$50 మాత్రమే. మోసం కేసు పెట్టాలంటే "కొనేవాళ్లను మోసం చేయాలనే ఉద్దేశం" నిరూపించాలి. వాళ్లు "ఆలోచన అమ్ముతున్నాం, ఆస్తి కాదు" అంటారు కాబట్టి క్రిమినల్ కేసు నిలవదు.



**2. బాధితులు లేరు, అధికారం లేదు**

కొనేవాళ్లకు ఇది జోక్ అని తెలుసు. ఎవరూ చంద్రుడిపై ఇల్లు కట్టడానికి వెళ్లరు కాబట్టి పోలీస్ కంప్లైంట్ ఇవ్వరు. పైగా చంద్రుడు ఏ దేశ పరిధిలోకి రాడు. స్థానిక పోలీసులు, FTC లాంటి సంస్థలకు అంతరిక్ష ఆస్తి వివాదాలపై చట్టం లేదు. ఆసక్తీ లేదు.

**3. "కొనేవాడి తప్పు" లాజిక్**

కోర్టులు Caveat Emptor- కొనుగోలుదారుడు జాగ్రత్త సూత్రం వాడతాయి. 3.84 లక్షల కి.మీ దూరంలో ఉన్న చంద్రుడిపై నిజంగా ప్లాట్ వస్తుందని నమ్మడం "సహేతుకం కాదు" అని తేల్చేస్తాయి. చిన్న మొత్తాలకు ప్రభుత్వం జోక్యం చేసుకోదు.

**4. కాంట్రాక్ట్ ప్రకారం డెలివరీ**

$25 కట్టినవాడికి అందమైన పార్చ్‌మెంట్ సర్టిఫికేట్, మ్యాప్, రిజిస్ట్రీ నంబర్ ఇచ్చేస్తారు. 'అమ్మిన వస్తువు' డెలివరీ అయినట్టే లెక్క. కాబట్టి ఇ-కామర్స్ చట్టాల ఉల్లంఘన ఉండదు. చట్టానికి లూప్‌హోల్స్, కొనేవాళ్లకు అవగాహనా రాహిత్యం, బాధితులు లేకపోవడం వల్ల ఈ కంపెనీలు హాయిగా నడుస్తున్నాయి.

**వినియోగదారుల రక్షణ చట్టం VS అంతరిక్ష రియల్ ఎస్టేట్**

"అంతరిక్ష రియల్ ఎస్టేట్" అమ్మకందారులు తప్పించుకునే ప్రయత్నాలను కోర్టులు, నియంత్రణ సంస్థలు అన్యాయమైన వ్యాపార పద్ధతులు, ఎప్పుడు ప్రకటనలు లేదా కాంట్రాక్ట్ ఉల్లంఘన నిబంధనలను ప్రయోగించి అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. International Institute of Space Law IISL వంటి అంతర్జాతీయ సంస్థలు చంద్ర డీడ్‌లకు అంతరిక్ష చట్టంలో విలువ లేదని పేర్కొన్నందున, ఈ కార్యకలాపాలు స్పష్టంగా వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి వస్తాయి.

**కేస్ స్టడీ 1: చైనాలో Lunar Embassy మూసివేత - 2005**

బీజింగ్‌లో డెన్నిస్ హోప్ అనే వ్యక్తి స్థాపించిన Lunar Embassy స్థానిక శాఖ 2005లో చంద్రుడి ప్లాట్లను ఎకరానికి 298 యువాన్- $37కి అమ్మడం మొదలుపెట్టింది. కొన్ని రోజుల్లోనే డజన్ల కొద్దీ ప్లాట్లు అమ్ముడయ్యాయి. Beijing Administration for Industry and Commerce జోక్యం చేసుకుని, కంపెనీ వ్యాపార లైసెన్సు రద్దు చేసింది. అన్ని అమ్మకాలను నిలిపివేసింది. వారి నిధులను స్వాదీనం చేసుకుంది. చంద్రుడి మీద భూమిని అమ్మడం "ఊహాజనిత విషయాన్ని అడ్డుపెట్టుకుని చేసిన మోసం" మరియు "అన్యాయమైన వ్యాపార పద్ధతులు" అని నియంత్రణ సంస్థ తీర్పు ఇచ్చింది.

కంపెనీ తమ లైసెన్స్ తిరిగి పొందడానికి దావా వేసింది. అంతరిక్షాన్ని అమ్మడాన్ని చట్టం నిషేధించలేదని వాదించింది. కానీ 2007లో చైనా అప్పీల్ కోర్టు నిషేధాన్ని సమర్థించింది. ఖగోళ వస్తువులను ఎవరూ సొంతం చేసుకోలేరు కాబట్టి, వాటిని వినియోగదారులకు అమ్మడం ప్రాథమికంగా మోసపూరిత వాణిజ్య పద్ధతి అని పేర్కొంది.

**కేస్ స్టడీ 2: ఏంజెల్స్ దురాన్ vs eBay స్పెయిన్, 2015**

ఈ కేసులో ఖగోళ "అమ్మకందారు" వినియోగదారు, కాంట్రాక్ట్ చట్టాన్ని ఒక ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌పై ఉపయోగించడానికి విఫల ప్రయత్నం చేశారు.

ఈ కేసులో ఖగోళ "అమ్మకందారు" వినియోగదారు. కాంట్రాక్ట్ చట్రాన్ని ఒక ఇ-కామర్స్ ప్లాట్ఫామ్ పై ఉపయోగించడానికి విఫల ప్రయత్నం చేశారు.

**కేసు వివరాలు:** సూర్యుడిపై యాజమాన్యాన్ని క్లెయిమ్ చేసిన స్పానిష్ మహిళ ఏంజెల్స్ దురాన్, eBayలో సూర్యుడి 1 చదరపు మీటర్ ప్లాట్లను ఒక్కొక్కటి €1కి లిస్ట్ చేసింది. eBay ఆమె ఖాతాను మూసివేసి, నిధులను బ్లాక్ చేసింది. భౌతికంగా డెలివరీ చేయలేని

“అమూర్త వస్తువులు” అమ్మడాన్ని నిషేధించే తమ విధానాన్ని ebay కారణంగా చూపింది.

దురాన్ కాంట్రాక్ట్ ఉల్లంఘన కింద eBayపై దావా వేసింది. మాడ్రిడ్లోని స్పానిష్ కోర్టు వినియోగదారుడిగా eBay నిబంధనలను సవాలు చేసే హక్కు ఆమెకు ఉందని నిర్ధారించింది. చివరికి కోర్టు దావాను కొట్టివేసింది. ఆమె నిజంగా సూర్యుడిని సొంతం చేసుకుండా అనే దానిపై తీర్పు ఇవ్వకుండా, డెలివరీ చేయలేని లావాదేవీల నుండి తన ప్లాట్ ఫామ్‌ను రక్షించుకునే ప్రైవేట్ సంస్థగా eBay తన చట్టపరమైన హక్కుల పరిధిలోనే వ్యవహరించిందని పేర్కొంది.

1967 OST నుండి 2020 ఆర్టెమిస్ ఒప్పందాల దాకా – అంతరిక్ష చట్టం ఎలా మారింది?

1967-Outer Space Treaty (OST): ‘‘అంతరిక్ష రాజ్యాంగం’’

శీతల యుద్ధ నేపథ్యంలో అమెరికా, రష్యాల మధ్య అంతరిక్ష పోటీ తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు, చంద్రుడిపై న్యూక్లియర్ ఆయుధాలు పెట్టడం, భూ ఆక్రమణలు జరగకుండా ఆపడానికి ఈ ఒప్పందం వచ్చింది.



**కీలక నిబంధనలు:**

**ఆర్టికల్ I:** అంతరిక్షం ‘‘మానవాళి అందరిది’’. అన్ని దేశాలకు అన్వేషణ, వినియోగ స్వేచ్ఛ. ఎవరైనా వెళ్లొచ్చు. కానీ సొంతం చేసుకోలేరు.

**ఆర్టికల్ II:** చంద్రుడు, గ్రహాలు సహా అంతరిక్షం “జాతీయ ఆక్రమణకు లోబడదు”. ఎలాంటి చర్యల ద్వారా కూడా సార్వభౌమ అధికారం పొందడం చట్టవిరుద్ధం.

**ఆర్టికల్ IV:** చంద్రుడిపై మిలిటరీ బేస్‌లు, ఆయుధ పరీక్షలు నిషేధం. శాంతియుత వినియోగం మాత్రమే.

ఈ ఒప్పందంపై భారతదేశంతో సహా 110+ దేశాలు సంతకం చేశాయి.

**1979-Moon Agreement: విఫల ప్రయోగం**

దీని ప్రకారం చంద్రుడు, దాని వనరులు “మానవాళి ఉమ్మడి వారసత్వం”. వనరులను వాడుకోవాలంటే అంతర్జాతీయ సంస్థ ఏర్పాటు చేసి, అందరికి లాభాలు పంచాలి.

అయితే ఈ ఒప్పందంపై అమెరికా, రష్యా, చైనా, భారతదేశం సహా ఎవరూ సంతకం చేయలేదు. “లాభాలు పంచుకోవడం” అంటే ప్రైవేట్ కంపెనీలు, అంతరిక్ష పరిశోధనలో అగ్రగామి దేశాలు ఆసక్తి చూపలేదు. చంద్రుడిపై మైనింగ్‌కు ఈ ఒప్పందం అనుకూలంగా లేదు. అందుకే ఇది ఆచరణలోకి రాలేక విఫలమైంది.

2015-USA Commercial Space Launch Competitiveness Act: గేమ్ ఛేంజర్

అమెరికా మొదటిసారి “స్పేస్ మైనింగ్’కు పచ్చజెండా ఊపింది.

**ప్రధాన అంశం:** “గ్రహశకలాల నుండి, చంద్రుడి నుండి తవ్విన వనరులపై అమెరికా పౌరులు యాజమాన్య హక్కులు కలిగి ఉంటారు. కానీ అంతరిక్షాన్ని ఖగోళ వస్తువులపై సార్వభౌమ అధికారం సొంతం చేసుకున్నట్లు కాదు” అని OST ఆర్టికల్ IIని ఉల్లంఘించకుండా జాగ్రత్త పడింది.

అంటే ప్రదేశం కాదు, తవ్విన మట్టి/లోహాన్ని సొంతం చేసుకోవచ్చు. సముద్రం స్వంతం కాకపోయినా అందులో చేపలు పట్టుకోవడంతో దీన్ని పోల్చవచ్చు. పట్టుకున్న చేపలపై వాటి యజమానులకు సర్వాధికారాలు ఉంటాయి.

2016-2020 2 Luxembourg, UAE, Japan ఇదే ప్రణాళికను అనుసరించి సొంతంగా స్పేస్ మైనింగ్ చట్టాలు తెచ్చాయి. ‘‘వచ్చినది మీదే’’ అనే భరోసా కంపెనీలకు ఇచ్చాయి.

**2020 - Artemis Accords: కొత్త రూల్ బుక్**

NASA చొరవతో కుదిరిన ఈ ఒప్పందంపై భారతదేశం 2023లో సంతకం చేసింది. ఇప్పుడు 40+ దేశాలు భాగస్వాములు. ఈ ఒప్పంద భాగస్వాములు పూర్తిగా OST ఆర్టికల్ IIకి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కొత్తగా తెచ్చిన సెక్షన్ 10లో “వనరులను వెలికితీయడం, ఉపయోగించడం” OSTకి లోబడి చేయవచ్చు అని రాసుకున్నారు.

**సేఫ్టీ జోన్స్:** భాగస్వామి దేశం మైనింగ్ చేస్తుంటే, ఇతరులతో ఘర్షణ జరగకుండా తాత్కాలిక ‘‘భద్రతా మండలాలు’ ప్రకటించుకోవచ్చు. కానీ అది సార్వభౌమాధికారం కాదు. రోడ్డుపై పని జరుగుతుంటే బారికేడ్ పెట్టడంతో దీన్ని పోల్చవచ్చు. అపోలో ల్యాండింగ్ సైట్‌లను చారిత్రక ప్రదేశాలుగా కాపాడాలి.

**పారదర్శకత:** అంతరిక్ష కార్యక్రమంలో ఏం చేస్తున్నారో అందరికీ తెలియజేయాలి. అంటే చంద్రుడిపై బేస్ నిర్మించుకోవచ్చు కానీ ఆ బేస్ చుట్టూ ఉన్న భూమి “ఇండియా” అని చెప్పలేరు. నీరు, హీలియం-3 తవ్వి అమ్ముకోవచ్చు కానీ సార్వభౌమ అధికారం పొందలేరు.

**భారతదేశంలో చంద్రుడి ప్లాట్ల అమ్మకాలు చట్టపరమైన చర్యలు**

2011 ప్రాంతంలో స్థానిక ఏజెంట్లు “చంద్రునిపై ప్లాట్” ఆన్‌లైన్ అమ్మకాలను నిజమైనవిగా చిత్రించడానికి ప్రయత్నించినప్పుడు జాతీయ వినియోగదారుల సంస్థలు, పోలీసు

బలగాలు జోక్యం చేసుకున్నాయి.

2011లో భారతదేశంలోని సైబర్- నేర విభాగాలు, వినియోగదారుల రక్షణ విభాగాలు అంతర్జాతీయ వెబ్‌సైట్ల ద్వారా పౌరులు "చంద్ర డీడీలు" కొనే సంఘటనలు భారీగా పెరగడాన్ని గుర్తించాయి. దాదాపు 2,000 మంది పౌరులు ప్లాట్లు కొన్నారు. కానీ కొందరు డబ్బు చెల్లించిన తర్వాత తమ క్రెడిట్ కార్డ్ డేటా కూడా దొంగిలించబడిందని వాపోయారు.



**నివారణ చర్యలు:** చంద్రుడు, అంగారకుడు లేదా శుక్రుడిపై భూమి కొనడం చట్టబద్ధంగా చెల్లని లావాదేవీ అని అధికార సంస్థలు ప్రజా నోటీసులు జారీ చేశాయి. అలాంటి చర్యలను Information Technology Act కింద ఎలక్ట్రానిక్ మోసంగా వర్గీకరించారు. వీటిని చట్టబద్ధంగా చెల్లని నవల్టీ గిఫ్ట్‌లుగా స్పష్టంగా ప్రకటించకుండా ఈ సర్టిఫికెట్లకు అధిక ధరలు వసూలు చేసే ఏ వ్యాపారమైనా క్రిమినల్ ప్రాసిక్యూషన్ ఎదుర్కోవాల్సి ఉంటుందని వినియోగదారులకు సలహా ఇచ్చారు.

**అంతరిక్షంలో భారతదేశం:**

భారత్ 2023 జూన్ 27న అర్టెమిస్ ఒప్పందాలపై సంతకం చేసింది. అయితే ఇది చంద్రుడిపై ప్లాట్లు అక్రమించుకోవడానికి కాదు. ఖనిజాలు తవ్వుకునే అంతర్జాతీయ నియమాలను రూపొందించడంలో భాగస్వామి కావడానికి. 1967 నాటి Outer Space Treaty ఆర్టికల్ IIకి కట్టుబడి, చంద్రుడు లేదా అంగారక గ్రహంపై ఏ దేశానికి సార్వభౌమాధికారం ఉండదని భారత్ మళ్ళీ స్పష్టం చేసింది. అయితే అర్టెమిస్ ఒప్పందాల ప్రకారం, ISRO భవిష్యత్తులో చంద్రుడిపై బేస్ నిర్మిస్తే దాని చుట్టూ తాత్కాలిక భద్రతా మండలం ఏర్పాటు చేసుకోవచ్చు. నీరు, హీలియం-3 లాంటి వనరులను తవ్వి వాడుకోవచ్చు. కానీ ఆ ప్రదేశం "భారత భూభాగం కాదు". ఇది రోడ్డుపై పని జరుగుతున్నప్పుడు ఏర్పాటు చేసుకునే తాత్కాలిక శిబిరం లాంటిది, శాశ్వత హక్కు కాదు.



చంద్రయాన్-3 విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంలో విక్రమ్ ల్యాండర్ దిగింది. అక్కడ నీటి మంచు జాడలు ఉన్నాయి. రాకెట్ ఇంధనం, తాగునీరు, ఆక్సిజన్ తయారీకి నీరు కీలకం కాబట్టి భవిష్యత్ లూనార్ బేస్‌లకు ఇది బంగారంతో సమానం. దీన్ని ఆధారంగా చేసుకుని ISRO, జపాన్ అంతరిక్ష సంస్థ JAXAతో కలిసి 2026-28 మధ్య LUPEX మిషన్ చేపట్టబోతోంది. ఈ మిషన్ 1 టన్ను బరువున్న రోవర్‌ను పంపి, అక్కడి మంచును తవ్వి, నీటిని వెలికితీసే టెక్నాలజీని పరీక్షిస్తారు. ఇది నేరుగా "మైనింగ్ టెక్"కు తొలి అడుగు. దీంతో పాటు 2035 నాటికి సొంతంగా "భారతీయ అంతరిక్ష కేంద్రం" ఏర్పాటు చేయాలని ISRO లక్ష్యంగా పెట్టుకుంది. ఇది చంద్రుడిపై శాశ్వత బేసు దారితీస్తుంది.

అర్టెమిస్ ఒప్పందాల్లో చేరడం వల్ల భారత ప్రైవేట్ స్పేస్ స్టార్టప్‌లకు కూడా అవకాశాలు తెరుచుకున్నాయి. 2023లో IN-SPACE విధానంతో అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్‌కు తెరిచారు. అమెరికాలోలా భారత్ కూడా స్పేస్ వనరుల చట్టం తెస్తే, Skyroot, Agnikul లాంటి కంపెనీలు భవిష్యత్తులో చంద్రుడిపై లేదా గ్రహశకలాలపై తవ్వకాలు జరపవచ్చు. వచ్చిన ఖనిజాలు వారి ఆస్తి అవుతాయి. అయితే ప్రస్తుతానికి భారత్‌కు సొంతంగా స్పేస్ మైనింగ్ చట్టం లేదు. అర్టెమిస్ ఒప్పందాలు కేవలం అంతర్జాతీయ మార్గదర్శకాలు మాత్రమే.

ఈ అంశంలో చైనాతో కొత్త స్పేస్ రేస్ కూడా మొదలైంది. చైనా అర్టెమిస్‌లో లేదు. రష్యాతో కలిసి 2035 నాటికి సొంతంగా "ఇంటర్నేషనల్ లూనార్ రిసెర్చ్ స్టేషన్" నిర్మిస్తామని ప్రకటించింది. భారత్ మాత్రం అమెరికా, జపాన్, యూరప్ దేశాలతో కలిసి అర్టెమిస్ క్యాంప్‌లో చేరింది. ఇప్పుడు పోటీ భూమి కోసం కాదు. చంద్రుడి దక్షిణ ధ్రువంలో ఎవరు ముందుగా నీటిని నిర్ధారించి, ఎవరు ముందుగా వెలికితీస్తారనేదే అసలు పోటీ. చందమామపై ప్లాట్ కొంటే పట్టా ఏ దేశమూ ఇవ్వదు. కానీ అక్కడ తవ్వి ఖనిజాలు తీస్తే అది భారత్ భవిష్యత్తుకు ఇంధనం అవుతుంది.

-చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్పై(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com
- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com



జ్వెజ్డా సర్వీస్ మాడ్యూల్ నుండి విడిపోయిన కొద్దిసేపటికే, భూమి హారిజోన్‌కు పైన పౌర్ణమి చంద్రుడు ఉండగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి విడిపోతున్న ISS ప్రోగ్రెస్ 75 రీసప్లై షిప్ చిత్రంలో కనిపిస్తుంది.

# మానవాళి ఉనికికి-అంతరిక్ష అన్వేషణ

అంతర్జాతీయ చంద్ర దినోత్సవం (IMD) అనేది మానవాళి మొట్టమొదటి చంద్రునిపై అడుగుపెట్టిన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం **జూలై 20న** జరుపుకునే ఒక ప్రపంచవ్యాప్త దినోత్సవం. 2021లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీచే స్థాపించబడిన ఈ రోజు, 1969 నాటి చారిత్రాత్మక అపోలో 11 యాత్రను స్మరించుకోవడంతో పాటు, సుస్థిరమైన మరియు శాంతియుతమైన చంద్ర అన్వేషణను కూడా ప్రోత్సహిస్తుంది. 1969 జూలై 20న, కక్ష్యలో కమాండ్ మాడ్యూల్‌ను మైఖేల్ కాలిన్స్ నడుపుతుండగా, నాసా వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ మరియు బజ్ ఆల్డ్రిన్ మరో ఖగోళ వస్తువుపై దిగి, నడిచిన మొట్టమొదటి మానవులుగా నిలిచారు.

**నేపథ్యం:** వేల సంవత్సరాలుగా, మానవ నాగరికతలు మన ఏకైక సహజ ఉపగ్రహమైన చంద్రుని పుట్టుక, రహస్యాల గురించి ఆలోచిస్తూ ఆకాశం వైపు చూస్తూ వచ్చాయి. మొట్టమొదటి టెలిస్కోపుల ఆవిష్కరణతో సాధ్యమైన భూమి ఆధారిత పరిశీలనలు, మన ఖగోళ సహచరుని గురించిన మన అవగాహనలో ఒక కొత్త అధ్యాయాన్ని తెరిచాయి. అంతరిక్ష కార్యకలాపాలు ప్రారంభం కావడంతో, విశ్వంలో మరో ప్రదేశానికి మొట్టమొదటి మానవ అడుగుజాడలను తీసుకువచ్చిన సిబ్బందితో కూడిన యాత్రలతో సహా, లెక్కలేనన్ని యాత్రలకు చంద్రుడు అంతిమ గమ్యస్థానంగా మారాడు. ప్రతిష్టాత్మక ప్రణాళికలతో చంద్రుని అన్వేషణ ప్రయత్నాలు రూపుదిద్దుకుంటున్న తరుణంలో, ఈ ప్రపంచవ్యాప్త వేడుక గత విజయాలకు జ్ఞాపికగా మాత్రమే కాకుండా, భవిష్యత్ ప్రయత్నాలకు వార్షిక నిదర్శనంగా కూడా నిలుస్తుంది.

**ఐక్యరాజ్యసమితి మరియు అంతరిక్షం:** అంతరిక్ష యుగం ప్రారంభం నుంచే, బాహ్య అంతరిక్షం మానవాళి ఉనికికి ఒక కొత్త కోణాన్ని జోడించిందని ఐక్యరాజ్యసమితి గుర్తించింది. ఐక్యరాజ్యసమితి కుటుంబం, సకల మానవాళి శ్రేయస్సు కోసం బాహ్య అంతరిక్షం యొక్క విశిష్ట ప్రయోజనాలను వినియోగించుకోవడానికి నిరంతరం కృషి చేస్తుంది. బాహ్య అంతరిక్షం పట్ల మానవాళికి ఉన్న ఉమ్మడి ఆసక్తిని గుర్తించి, భూలోక ప్రజలకు బాహ్య అంతరిక్షం ఏ విధంగా ప్రయోజనం చేకూర్చగలదనే ప్రశ్నలకు సమాధానాలు కనుగొనే ప్రయత్నంలో, సాధారణ సభ "బాహ్య అంతరిక్షం యొక్క శాంతియుత వినియోగంపై ప్రశ్న" అనే శీర్షికతో బాహ్య అంతరిక్షానికి సంబంధించిన తన మొదటి తీర్మానం. తీర్మానం 1348 (XIII)ను ఆమోదించింది. 1967 అక్టోబర్ 10న, "అంతరిక్ష మాగ్నా కార్టా", అంటే చంద్రుడు, ఇతర ఖగోళ వస్తువులతో సహా బాహ్య అంతరిక్ష అన్వేషణ, వినియోగంలో రాష్ట్రాల కార్యకలాపాలను నియంత్రించే సూత్రాలపై ఒప్పందం అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం, బాహ్య అంతరిక్ష వ్యవహారాల కోసం ఐక్యరాజ్యసమితి కార్యాలయం (UNOOSA), బాహ్య అంతరిక్షాన్ని శాంతియుతంగా ఉపయోగించుకోవడంలో అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించే బాధ్యతను కలిగి ఉన్న ఐక్యరాజ్యసమితి కార్యాలయం. బాహ్య అంతరిక్షాన్ని శాంతియుతంగా ఉపయోగించు కోవడంలో అంతర్జాతీయ సహకారంతో ప్రత్యేకంగా వ్యవహరించే జనరల్ అసెంబ్లీ యొక్క ఏకైక కమిటీ అయిన, బాహ్య అంతరిక్షం యొక్క శాంతియుత వినియోగాలపై ఐక్యరాజ్యసమితి కమిటీ (COPUOS)కి UNOOSA కార్యదర్శిగా పనిచేస్తుంది.

అంతర్జాతీయ అంతరిక్ష చట్టం కింద సెక్రటరీ-జనరల్ బాధ్యతలను అమలు చేయడం, బాహ్య అంతరిక్షంలోకి ప్రయోగించిన వస్తువుల ఐక్యరాజ్యసమితి రిజిస్టర్‌ను నిర్వహించడం కూడా UNOOSA బాధ్యత. చంద్రుని వనరులను శాంతియుతంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించడంపై అవగాహన కల్పించడం, అలాగే అంతరిక్ష సుస్థిరతను పరిరక్షించడం.

**చంద్ర దినోత్సవం ఎందుకు?**

1969లో అపోలో 11 చంద్ర యాత్రలో భాగంగా మానవులు చంద్రునిపై మొట్టమొదటిసారిగా అడుగుపెట్టిన వార్షికోత్సవాన్ని అంతర్జాతీయ చంద్ర దినోత్సవం జరుపుకుంటారు. ఈ వేడుకలలో చంద్రుని అన్వేషణలో అన్ని దేశాల విజయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. సుస్థిరమైన చంద్రుని అన్వేషణ, వినియోగంపై ప్రజలలో అవగాహన కల్పిస్తారు.

*(జూలై 20న అంతర్జాతీయ చంద్ర దినోత్సవం సందర్భంగా)*

– కొత్వాల్ సచిన్, m : 86866 64949
e: desk.deccan@gmail.com

# ఇంటి నెంబరు 20-6-296

## 2. పాతింటి నుండి కొత్తింటికి తరలినవైనం

**మా** అమ్మాబాపు మట్టిగోడలు, గూన పెంకుల ఇల్లు కొనటానికి అష్టకష్టాలు పడి, అమ్మ పుట్టింటి వారు పసుపు కుంకుమల క్రింద ఇచ్చిన బంగారు సొమ్ములను మార్వాడీ వడ్డీవ్యాపారి దగ్గర గిర్వీపెట్టి వచ్చిన వెయ్యి రూపాయలను ఆ వృద్ధ మరాఠీ బ్రాహ్మణ పండితుడి చేతులలో పోసి ఆ పురాతన కుటీరాన్ని తమ స్వంతం చేసుకున్నారు.

అది మేడంటే మేడాకాదు, గూడంటే గూడు కాదు టైపు. ప్రతి ఇల్లు ఒక జ్ఞాపకాల పొదరిల్లే కదా! ఆ మధ్యన ఏదో ఒక హిందీ చానెల్ వాళ్లు "హర్ ఘర్ కుచ్ కహతా హై" అని ఒక సీరియల్ తీసి ప్రతి ఎపిసోడ్‌లో ఒక ప్రముఖుడితో అతను తన బాల్యంలో నివసించిన "ఇల్లు" గురించి ఆ మధుర జ్ఞాపకాల "హరివిల్లు" గురించి లలితలలిత హృద్యంగా మాట్లాడించారు. జావేద్ అక్తర్, నవాజుద్దీన్ సిద్దీకీ లాంటి వారు తమ తమ జ్ఞాపకాల ఖజాను "ఓపెన్ సిసేమ్"లా తెరిచి వీక్షకులను తమ ఊహాలలో ఊరేగించారు. నిజం చెప్పాలంటే "గుజ్రే జమానా కరే దివానా". ప్రఖ్యాత నవలా రచయిత డా. కొమ్మూరి వేణుగోపాలరావు తన తొలి యవ్వనంలో రాసిన నవల "పెంకుటిల్లు". 1960 తొలి దశకంలో ఆ నవల వచ్చింది. ఆనాటి విజయవాడ పట్టణంలో దిగువ మధ్య తరగతి వారి జీవితాలను అతను తన స్వీయానుభావాల ఆధారంగా రచించి అందరినీ ఆకట్టుకున్నారు. రాచకొండ విశ్వనాథశాస్త్రి రాసిన ఆఖరి నవల పేరు "ఇల్లు'.



ఇంతకూ చెప్పొచ్చేదేమిటంటే ఒక నవ యువ రచయిత ఇంకా సాయంకాల, సంధ్యా దశలో ఉన్న మరో వృద్ధ రచయిత ఇద్దరూ ఇంటి చుట్టే పరిభ్రమించటం, ప్రదక్షిణ చేయటం ఒక విచిత్రం.

సరే నేను కూడా అక్కడా ఇక్కడా బైకాయించి చెక్కర్లు కొట్టకుండా సీదా మా ఇంటి దగ్గరికే వస్తా. అట్లా మా మాతా పితరులు ఇంటికోసం "బయానా" (అడ్వాన్సు) ఇచ్చి అలియాబాదు దగ్గరున్న "కుర్మగూడెం" నుండి శాలిబండల వున్న "రూప్‌లాల్" బజారుకు తరలివచ్చి స్థిరపడ్డారు. ఇక తరలి వచ్చిన వైనం గురించి బుధజన పాఠకులకు కొంచెం వివరించాలి. కావున శ్రద్ధతో ఆలకించగలరు.

ఆ రోజులలో సంసారానికి సంబంధించిన సామానులను తరలించటానికి ఇప్పటిలా "ప్యాకర్స్ అండ్ మూవర్స్" వారి వాహనాలు లేవు కదా! మరి కిం కర్తవ్యం? సామానులు మోసే ఎద్దుల బండ్లు, మనుషులను మోసే ఒంటెద్దు గూడు బండ్లు మాత్రమే గతి. జట్కాలు, రిక్షాలు, మనిషిని మనిషి మోసుకుంటూ లాగే "ఎక్కా" బండ్లు ఉన్నా వాటితో కామ్‌నహీ చల్తా. కుచ్ ఫాయిదా నహీఁ.

ఆ రోజులలో మా కుర్మగూడెంలో ఎద్దులబండ్లు నడిపే కుటుంబాలు కొన్ని ఉండేవి. కారణం? పక్కన్నే ఉండే అలియాబాద్ దర్వాజా దాటితే శంషేర్ గంజ్. "గంజ్" అంటే వర్తక వ్యాపార వాణిజ్య సముదాయం. లేదా మార్కెట్. నైజాం కాలంలోనే శక్కర్ గంజ్, ఉస్మాన్ గంజ్, మహబూబ్‌గంజ్, హష్మత్‌గంజ్ లాంటి మార్కెట్లు జోరుగా హుషారుగా మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లినాయి. పాత మలక్‌పేటలో ఆరవ నిజాం పేరుతో వెలిసింది మహబూబ్‌గంజ్, ఆఖరి ఏడవ నిజాం పేరుతో వెలిసింది ఉస్మాన్ గంజ్. ఈ గంజ్‌లలో ఆహారధాన్యాలు, ఉప్పులు పప్పులు పసుపు మిర్చి ఉల్లి అల్లం బెల్లం అన్నీ అమ్మకాలు కొనుగోలు జరిగేవి. శక్కర వ్యాపారం జరిగేదే శక్కర్ గంజ్. దాని మరో పేరు "మిస్రీ గంజ్". హుస్సేనీ ఆలం దగ్గరున్న అలియాబాద్ దర్వాజా లోపలి నగరాన్ని "అందరూన్ అలియాబాద్" అని అవతలి నగరాన్ని అంటే ఫలక్‌నుమాకు వెళ్లే దారిని "బేరూన్ అలియాబాద్" అని పిలిచేవారు. హుస్సేనీ ఆలం దగ్గరున్న "షాగంజ్" కూడా మరో ప్రముఖ వ్యాపార స్థలం.

అలనాడు పట్నంలో "గంజ్"లే కాక బజారులు కూడా చాలా ఉండేవి. బేగంబజార్, లార్డు బజార్, బడా బజార్, సుల్తాన్ బజార్, ఇసామియా బజార్, వగైరా వగైరా ఇప్పటికీ పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్, ఇరాన్, మధ్య ఆసియా దేశాలలో "బజార్"లు అన్న పదం చెలామణిలో ఉన్నాయి. ఈ "బజార్" అరబ్బీ భాష నుండి వచ్చిందో లేక ఫార్సీ భాష నుండి వచ్చిందో ఆ ''అల్లా''మియాకే తెలుసుండవచ్చు.

మా చిన్నతనంల శంశీర్ గంజ్‌లో ఉప్పులు-పప్పుల దుఖాణాలే కాక, మార్వాడీలు నడిపే నూనె మిల్లులు, బియ్యం, పప్పుల ఖార్ఖానాలు ఫలక్‌నుమా, చంద్రాయణగుట్ట దాకా ఉండేవి. (అసలు పేరు చెన్నరాయుని గుట్ట కాలక్రమంలో అన్నిపేర్ల లాగే అపభ్రంశానికి, వికృతికి గురి అయ్యింది). ఏతావాతా చివరాఖరికి చెప్పొచ్చేదేమిటంటే ఆ శంశీర్ గంజ్ వ్యాపారాలకు రవాణా సాధానాలు "ఎద్దుల బండ్లు" మాత్రమే. వాటిని నడిపే వాళ్లందరూ హమాలీలు, కూలీలు వారందరూ మా కుర్మగూడెంలో బస చేసేవారు. ఇప్పటి భాషలో అదొక "బహుజనుల" బస్తీ. అందులో కురుమలే ఆధిక్యం. వారి పుణ్యమా అని నేను బాల్యంలోనే మా ఇంటి ముందు రావిచెట్టు క్రింద ఉన్న గద్దెమీద "ఒగ్గుకథ" విన్నాను.



అప్పుడు మేం దానిని "డిల్లంబల్లం" అని పిలిచేవాళ్లం. ఆ డోలు-తప్పెట్లు-తాళాల సంగీతం మమ్మల్ని మంత్రనగరిలోకి మాయా జగత్తులోకి తీసుకుపోయేవి. ఆ ఒగ్గుకథ జరుగుతున్న అన్ని రోజులు వాడకట్టు జనం అందరూ ఆ రావి చెట్టు క్రింది గద్దె ముందు శత్రంజీలు, జంపుఖానాలు, చాపలు పరుచుకుని వాటిమీద కాళ్లు చాపుకుని ఆరాంగ కూచుని కండ్లు విప్పార్చి చెవులప్పగించి ఆ కథలో మునిగి తేలేవారు. తర్వాత్తర్వాత నాకు మళ్లీ ఆ డిల్లం-బల్లం సంగీతం 1983లో బి.నర్సింగరావు తీసిన "రంగుల కల" సీన్మాలో గద్దర్ పాడిన "జరభద్రం కొడుకో – నా కొడుకో కొమురన్న"లో వినబడి నేను నా "పసిడిబాల్యం" జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయినాను. అప్పుడు నా మనోనేత్రాలు ఆనాటి కుర్మగూడెంలోని రావిచెట్టు -దాని కింది గద్దె – ఆ డిల్లం బల్లం జ్ఞాపకం వచ్చి కండ్లు చెమర్చాయి.



సరే. మళ్లీ ఎద్దుల బండ్లు నడిపేవాళ్ల గురించి ముచ్చట్లు చెప్పుకుందాం. ధాన్యాలు, సరుకుల బండ్లు నడిపేవాళ్లు తమ కాళ్లు తొడలన్నీ, కనబడేటట్లు తెల్లని పంచెను బిగించి గోచీ పెట్టుకునేవారు. శరీరమంతా బరిబిత్తల ఉండి ఆ నల్లని శరీరాలు చెమటలు పట్టి నిగనిగా మెరుస్తూ ఉండేవి. తలకు ఎండ తగల కుండా గళ్లగళ్ల ఎర్రని తలపాగా చెవులను కప్పుతూ పొడుగ్గా క్రిందికి వ్రేలాడేలా చుట్టకునేవారు. ముఖాన్ని సగభాగం కప్పేసేలా బుంగ మీసాలు, మెలి తిప్పిన కోర మీసాలు ఉండేవి. కాని శరీరాలు మాత్రం సన్నగా బక్కచిక్కి ఇనుప సలాకుల్లా ఉండేవి. వాళ్ల చేతులలో ఎద్దులను అదిలించటానికి సన్నిటి పొడుగు యాప బెత్తాలు ఉండేవి. ఇస్కూలుకు పోయే కొంటె మగపిల్లలు వారి బక్కశరీరాలను చూసి వాళ్లను చెడాయించటానికి "బండి కొట్టె బాలయ్య గుద్దల దమ్ము లేదయ్యా" అని వొర్లే వాళ్లు. వాళ్లు కోపంతో ఆ బెత్తాలను పోరగాండ్ల మీదికి ఝళిపించేసరికి పోరలందరూ పరార్ అయ్యేవాల్లు. వాళ్లంతా శ్రమజీవులని, శ్రమ జీవుల శరీరాలు అట్ల బక్కగా సన్నగా ఉంటాయని తెలుసుకునే ఇంగిత జ్ఞానం పిల్లలకు ఉండదు కదా!


నూనె మిల్లుల పనిచేసే కూలీలు, హమాలీలు మరో రకంగా ఉండేవారు. వంట నూనెల డబ్బాలు తమ వీపుల మీద మోసి మోసీ ఆ టిన్ డబ్బాలను ఎద్దుల బండ్ల మీదికి ఎక్కించి, దుఖాణాలకు సరఫరా చేసి కారిన నూనె, చమటలతో వారి శరీరాలు ఎర్రటి ఎండలో మిలమిలా నల్ల నాగు త్రాచు పాముల్లా మెరిసిపోతూ ఉండేవి. ఎండలో వేడెక్కిన ఆ టిన్ డబ్బాలు (అందులో పద్దెనిమిది సేర్ల నూనె ఉండేది.) తమ వీపులను కాల్చేయకుండా బార్దాన్లను అంటే గోనె సంచులను తమ వీపులకు చుట్టుకుని ఆ బరువులను మోస్తూ వొంగి వొంగి నడుస్తుండేవాళ్లు.

తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలలాగా, ఈజిప్టులో పిరమిడ్ల నిర్మాణానికి చతురస్రాకారపు శిలాఫలకాలను తమ వీపుల మీద మోస్తున్న దేశదేశాల బానిసల లాగా ప్రాచీన రోము నగరపు వీధుల్లో వేలాది సంవత్సరాల క్రితం నడయాడిన బానిసల నల్లటి నగ్న శరీరాల మాదిరిగా శక్కర్‌గంజ్ సడక్‌ల మీద హమాలీలు, కూలీలు సంచరించేవారు.

ఒకరోజు పొద్దుపొద్దున్నే మా బాపు ఎద్దుల బండ్లల్లో సామానులను తరలించటానికి బండ్లు నడిపే వాండ్ల వాడ కట్టుకు వెళ్లి "ఏం కిరాయి" తీసుకుంటారని వాళ్లని విచారించాడు. వాళ్లలో కురుమ మల్లయ్య ఒకడు. ఆయన చిన్న కొడుకు మొగలయ్య మా బాపు ఇస్కులులో నాలుగో తరగతి విద్యార్థి. కిరాయి మాట చెవుల బడంగనే మల్లయ్య వినయంగా భక్తి శ్రద్ధలతో రెండు చేతులు జోడించి దండం పెట్టి "మాష్టర్‌సాబ్" కిరాయి మాట మర్సిపోండ్రి. ఈ ఐత్వారం గంజ్‌కు తాకీల్ (సెలవు) కదా పొద్దుల్నే రెండు బండ్లతో మీ ఇంటి ముందు హాజర్ అవుతా అని వాదా చేసిండు. బడిపంతులంటే ఆ రోజుల్లో ఉండే ఖదర్ (గౌరవం) అది.

అన్నట్లు ఐత్వారం పొద్దున్నే రెండు ఎడ్ల బండ్లు మా ఇంటి వాకిట్లకు వచ్చి ఆగినయి. ఒక ఎద్దు నల్లటిది మరొకటి తెల్లనిది. వాటి పేర్లు రాముడు-భీముడు అట. మొగలయ్య అతని సావాసగాడు భూమయ్య ఇద్దరు కల్సి సామాన్లనన్నింటినీ రెండు బండ్లల్ల పొందికగా సర్దినారు. ప్రయాణంలో అవి అటు ఇటు కదిలి క్రింద జారి పడకుండా జనపనార త్రాళ్లతో బిగించి

బందోబస్తుగా కట్టినారు. మడిల్లు అంటే మడి కట్టుకుని పెరుమాండ్లకు పూజ ఆరగింపు చేసే గదిలోని దేవుండ్ల విగ్రహాలను అమ్మ సింధూరం రంగులో వున్న పాత పట్టుచీరలో భద్రంగా మూటగట్టి తన చేతులలో పట్టుకొని అప్పుడే కిరాయికి వచ్చిన రిక్షాలో ఎక్కి కూచుంది. పిల్లలందరూ రిక్షాలో పై సీటులో, ఇంకా క్రింద సర్దుకుని కూచున్నారు. మా బాపుకు సొంత సైకిలు కొనే తాహతు లేనందున పనులున్నప్పుడు ఒక సైకిలును కిరాయకు తెచ్చుకునేవాడు. ఆ రోజు అట్లా తెచ్చుకున్న ఒక సైకిలు హాండ్ బార్ మీద నేను దర్జాగా బైఠాయించి అక్కడ గుండ్రంగా తెల్లటి చందమామలా మెరుస్తున్న గంటీని ట్రింగుట్రింగు మని ప్రయాణ ఆరంభ శంఖారావాన్ని శ్రీకృష్ణుడి పాంచజన్యంలా మోగించాను.





ఆ విధంగా ముందు రెండు ఎడ్ల బండ్లు వాటి వెనక ఒక రిక్షా మళ్లీ దాని వెనుక సైకిలుపై ఇంటి యజమాని పుత్ర "సమేతంగా" కూచోగా "కారవాన్" ప్రారంభమయ్యింది. రావిచెట్టు క్రింద గద్దెమీద ఉన్న అమ్మవారి రాతి విగ్రహానికి అందరం దండాలు పెట్టి (అది ఆ వాడకట్టును అన్ని ఉపద్రవాలు, రోగాల నుండి కాపాడే గ్రామదేవత లేదా అమ్మతల్లి విగ్రహం) నేను పుట్టి పెరిగిన ఆ కుర్మగూడెంను వదిలి పెట్టాం. మమ్మల్ని, అమ్మగారు, అయ్యగారు అని గౌరవించే ఆ వాడకట్టు నివాసులు మా వెనుక కొంత దూరం వచ్చి వెనుకకు మరలినారు. కాని ఎప్పుడూ మా ఇంటి అరుగుమీద కూచొనే ఒక ముసలి నల్ల కుక్క మాత్రం మా బండి వెనక చాలా దూరం వచ్చింది. అమ్మ వెళ్లు అనగానే నిరాశగా వెనకకు తిరిగింది. బస్తీని వదిలిన బండి ఒక గట్టు మీదికి ఎక్కి క్రిందికి దిగింది. అక్కడ దారి కుడి ఎడమలుగా చీలిపోయింది.

కుడి పక్కకు పోతే అలియాబాద్ సరాయి (దర్వాజా లోపలికి రాగానే ముసాఫిర్లు తాత్కాలికంగా విడిది చేసి విశ్రమించే సత్రాలు), తగులుతుంది. అక్కడ సిమెంటు సడక్ మీదికి ఎక్కంగనే ఉత్తరం వైపు చార్మినార్‌కు దక్షిణం వైపు ఫలక్‌నుమా వైపు పోవచ్చు. అది సుఖమైన రాస్తానే కాని ఆబాదీ (జనాలు) సైకిళ్ళు, రిక్షలు పైదల్ (కాలినడక) ఆద్మీలు ఎక్కువ కావున మా బాపు ఎడమవైపు రాస్తాకు బండ్లను మళ్లించమని ఆదేశించాడు. అది సున్‌సాన్ రాస్తా అంటే ప్రశాంతమైన కచ్చాపక్కా కంకరదారి తప్ప సడక్ కాదు. పైగా ఆ దారి వెంబడి చాలా దూరం కుతుబ్‌షాహీ నవాబులు కట్టించిన సఫీల్ (కోటగోడ) మనల్ని వెంబడిస్తుంది. పురాతన కాలం గనేట్ రాళ్లతో నిర్మించిన కోటగోడ అది. శంషాబాద్‌కు పొయ్యే తొవ్వల గగనపహాడ్ ఉంటది. అక్కడి కొండలను బండలను ఉలి, బాడిషలతో తొలిచి చతురస్రాకారపు రాళ్లుగా చెక్కి వాటితో ఈ కోటగోడలను నిర్మించారట. కుతుబ్‌షాహీల తర్వాత ఆసఫ్‌జాహీల కాలంలో అంటే రెండవ నిజాం కాలంలో (1802లో) నగరంచుట్టూ ఆ ప్రాకారం పన్నెండు దర్వాజాలతో పూర్తి అయ్యిందట.

అట్లా మేం ఆ కోటగోడల చల్లటి నీడల క్రింద పురుసత్‌గ ప్రయాణిస్తూ మిస్రీగంజ్ దాటి గాజీబండకు చేరుకున్నాం. గాజీ అంటే యుద్ధవీరుడు అని ఉర్దూలో అర్థం.

ఓబుకాలానా అక్కడెవరో యుద్ధవీరుడు మకాం చేసినందున ఆ ప్రాంతానికి గాజీబండ అను పేరు వచ్చిందేమో. దీని కోసం తారీఖులు, దస్తావేజులు తిరిగేస్తే ఖుద్దు మతలబు లేదా అసలు సంగతి తెలుస్తుందేమో! అయితే ఈ గాజీబండ దగ్గర రెండు మజేదార్ ముచ్చట్ల గురించి మనం చెప్పుకోవాలి. ఇక్కడికి కొంచెం కూతవేటు దూరంలో ఒక సూఫీ ఫకీర్ దర్గా ఉన్నది. దాని పేరు "షారాజుఖత్తాల్" దర్గా. గాలి కూడా నడిచేయని ప్రశాంత నిశ్శబ్ద అరణ్య వాతావరణంలో ఆ దర్గా మహామహా వృద్ధ వటవృక్షాల నీడలో నెలకొని ఉంటది. ఆ సూఫీ సాధువు దినంలో ఎక్కువ సేపు ధ్యానంలో మౌనంలో మునిగి ఉండేవాడు. ఆ దర్గాలో షాగిర్ద్‌గా (శిష్యునిగా) ఒక కౌమారప్రాయపు కొంటె బాలుడు కూడా ఉండేవాడు. మురీద్ (గురువు) జోస్యం ప్రకారం కాలమహిమ వలన ఆ బాలుడు గోల్కొండ కోటకు ఏడవ నవాబుగా నియమించబడినాడు. అతనే తానీషా నవాబు. ఇప్పటికీ మణికొండ ప్రాంతంలో ఒక లొకాల్టీ పేరు తానీషా నగర్.

మా సఫర్ అట్లా గాజీబండ దాటి ఖాజీపురాకు వెళ్లే దారిలో పిట్టలోళ్లు నివసించే పార్థీవాడకు చేరింది. వీళ్లవన్నీ రాజస్థానీ ప్రజల పోలికలు. రంగు, పొంగు, బాషా, ఆహార్యం అన్నీ. తాము రాణాప్రతాప్‌సింగ్ వారసులమని ఆయన, యుద్ధంలో ఓడిన తర్వాత దక్షిణాపథానికి వలస వచ్చామని చెప్పుకుంటారు. చలికాలం రెండు నెలలు ఇక్కడి విశాలమైన మైదాన్‌లో సీతాఫలాల మండి వెలిసేది. ఒక బుడ్డపైసకో, చిల్లి పైసకో పెద్ద వెదురు గంపనిండా తియ్యటి మధురమైన సీతాఫలాలు దొరికేవి. 1989లో జరిగిన మతకల్లోలాలలో దుండగులు ఆ పార్థీవాడను తగలబెట్టినందున ఆ పిట్టలోళ్లందరూ చెట్టుమీద పిట్టల్లా చెల్లాచెదురైనారు.

ఆ ప్రకారంబుగా ఆ సుదీర్ఘ ప్రయాణం ముగిసి మేం రూప్‌లాల్ బజార్‌లోని నానక్‌బావులీ గల్లీలోకి ప్రవేశించి మా కొత్త ఇంటికి చేరుకున్నాం.

వచ్చే నెల మరికొన్ని కథలు చెప్పుకుందాం.

–పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# మేధోపరమైన సాంస్కృతిక ఆట చదరంగం

క్రీడలు, కళలు, శారీరక కార్యకలాపాలు అవగాహనలను, పక్షపాతాలను, ప్రవర్తనలను మార్చగలవని, అలాగే ప్రజలను ప్రేరేపించగలవని, జాతి, రాజకీయ అడ్డంకులను తొలగించగలవని, వివక్షను ఎదుర్కోగలవని, సంఘర్షణలను నివారించగలవని, అందువల్ల స్థానిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలలో విద్య, సుస్థిర అభివృద్ధి, శాంతి, సహకారం, సంఘీభావం, సామాజిక సమ్మిళితం, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో దోహదపడతాయని ఐక్యరాజ్యసమితి గుర్తిస్తుంది.

చదరంగం అనేది క్రీడ. శాస్త్రీయ ఆలోచన, కళా అంశాల కలయికతో కూడిన అత్యంత ప్రాచీనమైన, మేధోపరమైన మరియు సాంస్కృతిక ఆటలలో ఒకటి. ఇది అందరికీ అందుబాటులో ఉండే కార్యకలాపం కాబట్టి, భాష, వయస్సు, లింగం, శారీరక సామర్థ్యం లేదా సామాజిక హోదా వంటి అడ్డంకులకు అతీతంగా దీనిని ఎక్కడైనా అందరూ ఆడవచ్చు.



చదరంగం ఒక ప్రపంచవ్యాప్త క్రీడ. ఇది నిష్పక్షపాతాన్ని, సమ్మిళితత్వాన్ని, పరస్పర గౌరవాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ విషయంలో ఇది ప్రజలు, దేశాల మధ్య సహనం, అవగాహన వాతావరణానికి దోహదపడుతుందని గమనించాలి.

సుస్థిర అభివృద్ధి కోసం 2030 అజెండా, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలులో, విద్యను బలోపేతం చేయడం, లింగ సమానత్వాన్ని సాధించడం, మహిళలు, బాలికల సాధికారతను కల్పించడం, అలాగే సమ్మిళితత్వం, సహనం, పరస్పర అవగాహన, గౌరవాన్ని పెంపొందించడం వంటి ముఖ్యమైన అవకాశాలను కూడా చదరంగం అందిస్తుంది.

**నేపథ్యం:** చదరంగం అనేది ఇద్దరు ఆటగాళ్లు ఆడే ఒక వ్యూహాత్మక బోర్డు ఆట. ఇందులో, ప్రతి పావుకు నిర్దేశించిన కొన్ని ఎత్తులు ఉంటాయి. వివిధ రకాల పావులను చదరంగపు గళ్ల బోర్డు చుట్టూ కదుపుతూ, ప్రత్యర్థి 'రాజు' పావును పట్టుకోవడమే దీని లక్ష్యం. నేడు ఈ ఆటలో 2,000కు పైగా గుర్తించదగిన రకాలు ఉన్నాయి. ఒక సిద్ధాంతం ప్రకారం, చదరంగాన్ని పోలిన చతురంగ అనే ఒక ప్రాచీన ఆట గుప్తుల కాలంలో (క్రీ.శ. 319-543) ఉత్తర భారత ఉపఖండంలో ఉద్భవించి, సిల్క్ రోడ్ల వెంబడి పశ్చిమాన పర్షియా వరకు వ్యాపించింది.

ఆధునిక చదరంగం 'చతురంగ' అనే పదం నుండి ఉద్భవించిందని నమ్ముతారు. దీనికి అర్థం 'నాలుగు విభాగాలు'. ఇది ఆటలోని పావులను పదాతిదళం, అశ్వికదళం, గజదళం మరియు రథదళం (ఆధునిక ఆటలో బంటు, గుర్రం, బిషప్ మరియు ఏనుగుగా మారిన పావులు)గా విభజించడాన్ని సూచిస్తుంది. లేదా ఈ ఆటను నలుగురు ఆటగాళ్లు ఆడతారనే వాస్తవాన్ని తెలుపుతుంది. క్రీ.శ. 600 ప్రాంతంలో ఈ ఆట సస్సానిడ్ పర్షియాకు చేరుకున్నప్పుడు, దానికి చత్రంగ్, ఆ తర్వాత షత్రంజ్ అని పేరు పెట్టారు. ఈ ఆట గురించిన మొట్టమొదటి ప్రస్తావన క్రీ.శ. 600 నాటి ఒక పర్షియన్ వ్రాతప్రతిలో లభిస్తుంది. భారత ఉపఖండం నుండి ఒక రాయబారి మొదటి ఖోస్రో రాజును (క్రీ.శ. 531-579) సందర్శించి, అతనికి ఈ ఆటను బహుమతిగా ఇచ్చినట్లు అందులో వర్ణించబడింది. అక్కడి నుండి ఇది సిల్క్ సముద్రం వెంబడి అరేబియా ద్వీపకల్పం మరియు బైజాంటియంతో సహా ఇతర ప్రాంతాలకు వ్యాపించింది.

క్రీ.శ. 900లో, అబ్బాసిడ్ చదరంగపు దిగ్గజాలైన అల్-సులి, అల్-లజ్జజ్ ఈ ఆట యొక్క మెళకువలు మరియు వ్యూహాలపై గ్రంథాలను రచించారు. క్రీ.శ. 1000 నాటికి చదరంగం ఐరోపా అంతటా, యూరేషియన్ స్టెప్పీ నుండి పరిచయం చేయబడిన రష్యాలో కూడా ప్రాచుర్యం పొందింది. క్రీ.శ. 13వ శతాబ్దానికి చెందిన మూడు విభిన్న రకాల జనాదరణ పొందిన ఆటలపై మధ్యయుగపు గ్రంథాల సంకలనమైన, 'లిబ్రో డి లాస్ జుగోస్' (ఆటల పుస్తకం) అని కూడా పిలువబడే అల్ఫోన్సో మాన్యుస్క్రిప్ట్, చదరంగం ఆట నియమాలు, ఆటవిధానంలో పర్షియన్ షత్రంజ్‌ను చాలా పోలి ఉంటుందని వివరిస్తాయి.

1924లో పారిస్‌లో అంతర్జాతీయ చెస్ సమాఖ్య (FIDE) స్థాపించబడిన తేదీకి గుర్తుగా, 2019 డిసెంబర్ 12న జనరల్ అసెంబ్లీ జులై 20న ప్రపంచ చెస్ దినోత్సవంగా ప్రకటించింది.


**మానసిక ఆరోగ్యం:** క్రమం తప్పని ఆట లోతైన తార్కిక ఆలోచన, సహనం, మానసిక శ్రేయస్సును పెంపొందిస్తుంది. ఎలా జరుపుకోవాలి ప్రతి సంవత్సరం, వృద్ధులు, వెనుకబడిన ప్రాంతాల యువత, వికలాంగులతో సహా విభిన్న సమూహాలను స్వాగతించే సమ్మిళిత, ప్రత్యక్ష కార్యక్రమాలను నిర్వహించమని FIDE చెస్ ఫెడరేషన్లు, క్లబ్‌లు మరియు స్థానిక సంఘాలను ప్రోత్సహిస్తుంది.

*(జులై 20న ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా)*

– ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

# దక్షిణాదిన రాజుబొమ్మతో నాణెం ఆవిష్కరించిన మన తెలంగాణం!

పురావస్తు పరిశోధనలపరంగా ఎన్నో కొత్త ఆవిష్కరణలకు నాంది పలికిన తెలంగాణా నాణేల విషయంలోనూ తన ప్రత్యేకతను చాటుకొంది. పేర్లను తొలిసారిగా ముద్రించి, ఆ దిశగా మార్గదర్శనం చేసిన సా.శ.పూ. 1వ శతాబ్దిలో తెలంగాణాను పాలించిన గోభద, కంవాయ, సమగోప, నరన అనే శాతవాహనులకంటే ముందే రాజుల నాణేలు కోటలింగాలలో బయల్పడి చరిత్ర గతిని మార్చాయి. తరువాతి పాలకులైన శాతవాహనులు మరో అడుగు ముందుకేసి, నాణేలపై రెండు భాషల్లో తమపేర్లను తమ బొమ్మల్ని, ముద్రించి దక్షిణాదిన రికార్డు నెలకొల్పారు. తన బొమ్మతో, తెలుగు, తమిళ భాషల్లో తన పేరును ముద్రించిన వెండి నాణేలను తొలిసారిగా విడుదల చేసిన ఘనతను తొలితరం శాతవాహన చక్రవర్తి మొదటి పుళుమావి దక్కించుకొన్నాడు. అదే వరవడిలో, వాసిష్ఠీపుత్ర సాతకర్ణి, సివసిరి పుళుమావి, సివస్కంధ సాతకర్ణి, గౌతమీ పుత్ర సాతకర్ణి, విజయసాతకర్ణి, బొమ్మ భాగంలో తమ బొమ్మను, బొరుసు భాగంలో రెండు భాషల సమ్మిళత రాతలో తమ పేర్లను ముద్రించిన నాణేలను విడుదల చేశారు. ఈ విషయంలో ఉత్తరాదిన కుషాణ, శకులకు పోటీ పడ్డారు.





వాసిష్ఠీపుత్ర సిరి పుళుమావి వెండి నాణెం

శాతవాహన రాజులు విడుదల చేసిన నాణేల బొమ్మవైపు పేర్లు ప్రాకృత-సంస్కృతంలోనూ, బొరుసుపై గల పేర్లు ద్రావిడ ప్రాకృత భాషలైన తెలుగు-తమిళంలో ఉండటం గమనార్హం. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, తెలంగాణా, ఆంధ్రా ప్రాంతాల్లో చలామణిలో ఉన్న ఈ రెండు భాషల నాణేలు, తమిళ, తెలుగు పురావస్తు పరిశోధకుల దృష్టినాకర్షించాయి. డా.వి.వి.కృష్ణశాస్త్రిగారు 1980వ దశకంలో, పెద్దపల్లి జిల్లా, ధూళికట్ట వద్ద జరిపిన తవ్వకాల్లో, శాతవాహన చక్రవర్తి సివసిరి పుళుమావి తన బొమ్మతో విడుదల చేసిన ఒక వెండి నాణెం బయల్పడింది. ఈ నాణెం బొమ్మ భాగంలో 'వాసిఠీపుత రఞో సివసిరిపుళుమావిస' అనీ, బొరుసు భాగంలో 'అరహణకు వాహిట్టీ మాకణకుసి వతిరుపుళు మావికు' అనీ 'పుళు మావికు'లో 'కు' తెలుగు షష్టీ తర్పురషను సూచిస్తుందని, అరహణకు అనగా అరసు -రాజు నకు అనీ, మాకణకు అనగా మగనకు - మగండుకు అనీ, తిరు అనగా సిరి-శ్రీ అని, రాతలో ఇలా ద్రావిడ ప్రాకృతభాషకు చెందిన తమిళ తెలుగు పదాలున్నాయని ప్రముఖ పురావస్తు పరిశోధకులు ఐకె శర్మ, ఆర్. నాగస్వామి, దేమె రాజారెడ్డి గార్లు తెలియజేశారు. రెండు భాషలు, రాజుబొమ్మ గల నాణెం ధూళికట్టలో దొరకటం, తెలంగాణా నాణేల చరిత్రలో ఒక మైలురాయి కాక మరేమిటి?

(ఈ దిశగా పరిశోధనలు చేసిన వారందరికీ కృతజ్ఞతలతో..)

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# హరిత భవిష్యత్తుకు కాగితపు సంచులు

ప్రతి సంవత్సరం జూలై 12న జరుపుకునే పేపర్ బ్యాగ్ డే, ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించి, సుస్థిరమైన, జీవవిచ్ఛిన్నమయ్యే ప్రత్యామ్నాయాల వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించడానికి పర్యావరణ అనుకూల అలవాట్లకు మారడం యొక్క ప్రాముఖ్యతను ఇది ప్రముఖంగా తెలుపుతుంది. కాగితపు సంచి చరిత్ర జూలై 12వ తేదీ ఎంపిక, ప్యాకేజింగ్‌లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఆవిష్కరణతో గాఢంగా ముడిపడి ఉంది. హరిత భవిష్యత్తుకు ఎలా ఉపయోగపడుతుందో చూద్దాం.

**1852:** అమెరికన్ ఆవిష్కర్త ఫ్రాన్సిస్ వోల్లె కాగితపు సంచులను తయారు చేయడానికి రూపొందించిన మొదటి యంత్రానికి పేటెంట్ పొందారు.

**1870:** తరచుగా "కిరాణా సంచి తల్లి" అని పిలువబడే మార్గరెట్ ఇ. నైట్, చదరపు, చదునైన అడుగుభాగం గల కాగితపు సంచులను కత్తిరించి, మడిచి, అతికించగల ఒక యంత్రాన్ని రూపొందించారు.



**1912:** వాల్టర్, లిడియా డ్యూబెనర్ సాంప్రదాయ కాగితపు సంచులకు తాడుతో చేసిన హ్యాండిళ్లను జోడించి, మొట్టమొదటి హ్యాండిల్ ఉన్న కాగితపు షాపింగ్ బ్యాగులను సృష్టించారు.

**స్విచ్ ఎందుకు ముఖ్యమైనది జీవ విచ్ఛిన్నత:**

హానికరమైన మైక్రోప్లాస్టిక్‌లుగా కుళ్ళిపోయి విచ్ఛిన్నం కావడానికి శతాబ్దాలు పట్టే ప్లాస్టిక్ సంచుల వలె కాకుండా, కాగితపు సంచులు సులభంగా పునర్వినియోగించదగినవి, సహజంగానే క్షీణిస్తాయి.

**వనరుల తగ్గింపు:**

జీవవిచ్ఛిన్నమయ్యే పదార్థాలను ఎంచుకోవడం వల్ల మన సముద్రాలు, వన్యప్రాణులు, సహజ ఆవాసాలపై విషపూరిత ప్రభావం తగ్గుతుంది.

**వినియోగదారుల బాధ్యత:**

వ్యక్తులు, వ్యాపారాలు ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్‌లను తిరస్కరించి, పర్యావరణహితమైన రోజువారీ అలవాట్లను అలవర్చుకోవడానికి ఈ రోజు ఒక పిలుపుగా నిలుస్తుంది. వేడుకలు జరుపుకోవడం, చర్యలు తీసుకోవడం. గట్టి కాగితపు సంచులను కంపోస్టింగ్ కోసం, కిరాణా సామాను కొనుగోలు కోసం, లేదా ఇంటి వస్తువులను సర్దుకోవడం కోసం తిరిగి ఉపయోగించుకోవాలి.

**జీవ విచ్ఛిన్నత:**

కుళ్ళిపోవడానికి వందల సంవత్సరాలు పట్టే ప్లాస్టిక్ సంచులలా కాకుండా, కాగితపు సంచులు కొన్ని నెలల్లోనే సహజంగా విచ్ఛిన్నమవుతాయి. ఇది పర్యావరణ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించి, మన పర్యావరణ వ్యవస్థలను శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది.

**పునర్వినియోగం:**

కాగితపు సంచులు సులభంగా పునర్వినియోగం చేయదగినవి. వాటిని కొత్త కాగితపు ఉత్పత్తులుగా తయారు చేయవచ్చు, దీనివల్ల ముడి పదార్థాల అవసరం తగ్గి, వ్యర్థాలు కనిష్ట స్థాయికి తగ్గుతాయి.

**సుస్థిర ఉత్పత్తి:**

కాగితపు సంచులను బాధ్యతాయుతంగా నిర్వహించబడే అడవుల నుండి లభించే కలప గుజ్జు వంటి పునరుత్పాదక వనరులతో తయారు చేస్తారు. ఈ సుస్థిర వనరుల సేకరణ సహజ ఆవాసాలను పరిరక్షించడంలో, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

**తక్కువ కార్బన్ ఉద్గారాలు:**

ప్లాస్టిక్ సంచులతో పోలిస్తే కాగితపు సంచుల ఉత్పత్తి, పారవేయడం వల్ల సాధారణంగా తక్కువ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు వెలువడతాయి. కాగితాన్ని ఎంచుకోవడం వాతావరణ మార్పులను ఎదుర్కొనే ప్రయత్నాలకు మద్దతు ఇస్తుంది.


**బహుముఖ ప్రజ్ఞ:**

కాగితపు సంచులు వివిధ పరిమాణాలలో, శైలులలో లభిస్తాయి. అందువల్ల కిరాణా సామాను కొనుగోలు నుండి బహుమతులు ప్యాక్ వరకు అనేక రకాల అవసరాలకు ఇవి అనువుగా ఉంటాయి. వీటిని అనుకూలీకరించవచ్చు, బ్రాండింగ్ కూడా చేయవచ్చు. తద్వారా వ్యాపారాలకు ఇవి పర్యావరణ అనుకూల మార్కెటింగ్ సాధనంగా ఉపయోగపడతాయి.

– జుగాష్‌విలి
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# ప్రకృతి ప్రేమికురాలు, పర్యావరణ హితైషి

# –జానకి లెనిన్




కొందరు ప్రకృతిని ప్రేమిస్తారు. కొందరు ఆరాధిస్తారు. ఇంకొందరు ప్రకృతిని కాపాడలేకపోతున్నామని విచారిస్తారు. కలత చెందుతారు. ప్రకృతిని కాపాడాడమంటే ముందుగా అర్థం చేసుకోవాలని, ప్రకృతిని అర్థం చేసుకోకుండా ప్రకృతిని కాపాడటం సాధ్యం కాదని కొందరు గ్రహిస్తారు. ఆ ప్రకృతిని ఎలా చూడాలో, ఎలా కాపాడాలో చైతన్యం పెంపొందించే రచనలు చేస్తారు. అట్లా రచనలు చేసిన మనిషి పేరు, మానవి పేరు జానకి లెనిన్. 'మై హజ్బెండ్ అండ్ అదర్ యానిమల్స్' అని ఒక పుస్తకానికి ఏకంగా పేరు పెట్టేసింది. భర్తను జంతువుల గాటిన కట్టేసిందని అనుకోనక్కర్లేదు. భర్తే కాదు, మనమూ జంతు సమానులమే సుమా! కాకపోతే మనుషులమని ఆధిక్యతను ప్రదర్శించబోతాం. ఆధిపత్యాన్ని నెరపుతాం అని చెపుతూనే మనమేమీ అధికులం కాము అనే ధ్వనిని ఆ పుస్తకం ప్రకటిస్తుంది.

దేశంలో ప్రకృతి, పర్యావరణం, జీవవైవిధ్యం, అరణ్యాలను కాపాడుకోవటం, వన్యప్రాణులను సంరక్షించుకోవటం గురించి ఎన్నో రచనలను జానకి లెనిన్ చేసింది. సంక్లిష్ట శాస్త్ర విషయాలను కూడా అత్యంత సరళంగా తేటతెల్లమయ్యేట్లు చెప్పడం ఆమె ప్రత్యేకత. ప్రకృతి అంటే చెట్లూ, చేమలూ, జంతుజాలాలు మాత్రమే కాదని, మానవ జీవితం ప్రకృతితో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంటుందని ఆమె రచనలు వెల్లడిస్తాయి.

జటిలమైన అంశాలను, శాస్త్రీయ పద్ధతిలో రాయాల్సిన వాటిని కూడా ఆమె కథల రూపంలో చెప్పి పిల్లలను, యువతను ఆకర్షించింది. మామూలు పాఠకులు కూడా ఆమె ప్రకృతి గురించి రాసిన వ్యాసాలు చదివితే ప్రేమికులైపోతారు.


అడవులు, కొండలు, గుట్టలు, నదులు, పక్షులు, కీటకాలు, రకరకాల సర్పాలు, మొసళ్లు లాంటి ఎన్నో రకాల జీవరాశుల గురించి ఎన్నో ఆసక్తికరమైన, విలువైన విషయాలను జానకి లెనిన్ తెలియజెప్పింది. ఆమె దృష్టిలో, దృక్పథంలో ప్రకృతిని రక్షించడమంటే అదేదో జీవరాశులకు చేసే మేలు కాదు. మనిషి తన భవిష్యత్తును కాపాడుకోవటం కోసం చేసేపని. జానకి లెనిన్ రాసే పలు వ్యాసాల్లో జీవ వైవిధ్యం పరిరక్షణ కోసం ఆమె పడే తపన కనిపిస్తుంది.

ఆమె రచనలు పర్యావరణం పట్ల సునిశితమైన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రదర్శిస్తాయి. పర్యావరణ విద్య అవసరం గురించి నొక్కి చెపుతాయి. మనిషికి, ప్రకృతికి మధ్యగల సంబంధం సమతుల్యత అవసరాన్ని గురించి చెపుతాయి. సకల జీవరాశులు ప్రాధాన్యం గలవి అనే విషయాన్ని పదేపదే గుర్తుచేస్తాయి. ముఖ్యంగా పాములు, మొసళ్లు, పక్షులు ఎంత ప్రాధాన్యం గలవో చక్కగా వివరిస్తాయి. సహజంగా ఆమె ప్రతి అంశాన్ని శాస్త్ర దృష్టితో పరిశీలించి చెపుతారు. కనుక జంతువులను మూఢనమ్మకాలతో ముడిపెట్టి చూడొద్దనే భావన వ్యక్తమవుతుంది.

జీవవైవిధ్యం గురించి లోతుగా, విస్తృతంగా పరిశోధించి చెప్పినవారిలో జానకి లెనిన్ ఒకరు. ఆమె క్షేత్ర పర్యటనల అనుభవాలు సాహసోపేతంగా కనిపిస్తాయి. ఆమె అడవులలో గడిపిన అనుభవాలు, పలు రకాలైన జంతువులతో ఎదురైన వ్యక్తిగత అనుభవాలు ఆసక్తినే కాదు గగుర్పాటును కలిగిస్తాయి.

ఎ కింగ్ కోబ్రాస్ సమ్మర్ దేశంలోని వన్యప్రాణులతోపాటుగా కింగ్ కోబ్రా వంటి అరుదైన జీవుల జీవన విధానాన్ని వివరిస్తుంది. సాధారణంగా మానవులకు మాత్రమే సామాజిక జీవితం ఉంటుందని అనుకుంటూ ఉంటాం. జానకి లెనిన్ రచనలు ప్రాణులన్నింటికీ సామాజిక జీవితం ఉందనే విషయాన్ని గుర్తుచేస్తుంది. అలాగే ఆమె రచనలు మనకు ప్రాణులపట్ల గల పలు అపోహలను తొలగించేవిగా, కనువిప్పు కలిగించేవిగా ఉంటాయి.

ప్రకృతి మన కనుల ముందు మనతో కలిసి తిరుగుతున్న




అనుభూతి ఆమె రచనలు చదువుతున్నప్పుడు మనకు కలుగుతుంది. వ్యక్తిగత అనుభవాల జోడింపు, హాస్యస్ఫోరక దృష్టి, సంక్లిష్ట విషయాలను సులభతరం చేసి చెప్పటం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. ప్రతి ఒక్కరూ మరల మరల ఆసక్తిగా చదవాలనుకునే విధంగా ఉంటుంది ఆమె రచనా శైలి.

ఎక్కువ సందర్భాలలో మనం పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే అనే నిర్ధారణ దృష్టితో ఉంటాం. కానీ జానకి లెనిన్ ఆ బాధ్యత పౌరులది కూడా అంటుంది. అసలు పౌరులు తమ ప్రకృతి, పరిసరాల పట్ల సరైన అవగాహన కలిగి ఉంటేనే పర్యావరణం కాపాడబడుతుందని ఆమె విశ్వసిస్తుంది. జానకి లెనిన్‌ది ఒక స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం. బడులు, కళాశాలలు, ఇతర ప్రజావేదికల ద్వారా ఆమె ప్రకృతి సంరక్షణపై ఎంతో అవగాహన, చైతన్యాలను పెంపొందిస్తూ స్ఫూర్తిదాయికంగా నిలిచారు. ప్రకృతిపట్ల ప్రేమ, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ స్పృహ, చైతన్యాల పెంపుదల లక్ష్యంగా ఆమె రచనలు సాగుతాయి.

మై హజ్బెండ్ అండ్ అదర్ యానిమల్స్, స్నేక్స్ డ్రగ్స్ అండ్ రాక్ఎన్‌రోల్, ఎవ్విరీ క్రీచర్ హాజ్ ఎ స్టోరీ, ది వైల్డ్ లైప్ అడ్వెంచర్ కంటిన్యూస్ లాంటి పుస్తకాలు రాశారు. 23 ఏప్రిల్ 1938లో పుట్టారు. జీవన సహచరుడు రామ్ విటాకర్‌తో కలిసి ఎన్నో కథలను పంచుకున్నారు. రామ్ విటాకర్ సర్పశాస్త్రవేత్త, వన్యప్రాణి సంరక్షకుడు. మద్రాస్ స్నేక్ పార్క్, క్రోకడైల్‌బ్యాంక్ వ్యవస్థాపకుడు. సువిశాల ప్రకృతి, పర్యావరణ వ్యవస్థలలో మానవుల స్థానం ఏమిటి? బాధ్యత ఎంత అనే విషయాల గురించి జానకి లెనిన్ రచనలు తీవ్రంగా ఆలోచింపజేస్తాయి. మనలను సంవేదనాశీలురుగా మారుస్తాయి.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

**పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.**

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టీఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంలో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు. అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ

**– మణికొండ వేదకుమార్**

సంపాదకులు

**చందా వివరాలు:**

వార్షిక చందా: రూ. 300 2 సం॥లకు: రూ. 600

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.
Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com
ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

Name : DECCAN LAND
Bank : KOTAK MAHINDRA BANK
A/c No : 7111218829
IFSC Code : KKBK0007463
Branch Code : 007463

**డిజిటల్ రూపంలో కూడా చెల్లించవచ్చు**

'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక
వార్షిక చందా : రూ. 300/-

ఒక సంవత్సరం బైండింగ్ పుస్తకం : రూ. 400/-

# తెలంగాణకు సోమపానం తెలుసా?

ఋగ్వేదం 8 వ మండలం 91వ సూక్తంలోను, దానికి క్రీ.శ. 14 వ శతాబ్దంలో సాయణ రాసిన వ్యాఖ్యానంలోను సోమపాన విద్యకు సంబంధించిన "అపాల కథ" ఉంటుంది. ఆ కథ ప్రకారం అత్రి మహర్షి బిడ్డ అపాల సోమలతలను నది-వాగు సంగమం ప్రాంతంలో కనుగొని, ఇంటికి తీసుకు వచ్చి, సోమరసాన్ని తీసే సోమయాగ సాధనాలు తన దగ్గర లేకపోవడంతో సోమ కాండాలను నమిలి సోమ రసాన్ని తీస్తున్నప్పుడు ఆ శబ్దం విని అక్కడ ప్రత్యక్షమైన ఇంద్రునికి అపాల సోమరసం సేవించుమని ఇచ్చి మూడు వరాలను కోరుతుంది: తండ్రి బట్టతలపై వెంట్రుకలు మొలవాలి, అతని భూమి సారవంతమై పంటలు పండాలి, తన చర్మ వ్యాధి తగ్గాలి (అపాల అంటేనే పాలిపోయిన చర్మం లేనిది అని అర్థం). ఇంద్రుడు సోమరస ఆతిథ్యానికి సంతోషించి ఆమెను వరుసగా రథం, బండి, కాడి / యుగ్మం రంధ్రాల గుండా ఈగించి ఆమె చర్మం పై 3 పొరలను తొలగించి చర్మ వ్యాధిని తగ్గించాడు.



ఋగ్వేదంలోని ఈ అపాల కథ ద్వారా సోమలతలు నది-వాగు సంగమం ప్రాంతంలో ఉంటాయని, వాటిని సోమయాగ సాధనాల ద్వారా గాని, కరకర నమిలి గాని సోమరసం తీయవచ్చని, సోమరస పానం చేస్తే దీర్ఘకాలిక రోగాలు నయం కావడమే కాకుండా భూమి సారవంతమై పంటలు కూడా పండుతాయని తెలుస్తుంది. సోమపానం చేస్తే కోరిన సంపదలు కూడా కలుగుతాయని, స్వర్గసుఖం లభిస్తుందని ఇతర వేద ఆధారాలు తెలుపుతాయి. సోమరసం అంతటి విలువైనది కాబట్టే ఋగ్వేదంలో ఒక మండలానికే (9 వది) సోమ మండలం అని పేరు పెట్టారు.



ఆ సోమపానం ప్రాధాన్యాన్ని గుర్తించి పలువురు పరిశోధకులు సోమలతను కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. కొన్ని దశాబ్దాల క్రితమే సోమపానమంటే భంగు అని రాహుల్ సాంకృత్యాయన్ సెలవిచ్చారు. ఓ దశాబ్దం క్రితం రాందేవ్ బాబా తాను సోమలతను గుర్తించాను అన్నారు. ఆరేళ్ళ క్రితం రేఖా రావు అనే పరిశోధకురాలు సింధు నాగరిక కుండ పెంకులపై సోమలతను గీసినట్టు, ఆ కుండలలోనే సోమ రసాన్ని తయారు చేసేవారని, దానిని పోలిన సోమలతలను తాను గుర్తించానని బొమ్మలను కూడా ప్రచురించారు. వాటినే ఇటీవల హరప్పన్ ఆర్కియాలజీ అనే వెబ్‌సైటులో పెట్టారు. దీని మీద చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణకు సోమరసపాన విద్య తెలుసా అనే విషయాన్ని చూద్దాం.

ఎక్కువకెక్కువ క్రీ.పూ. 15వ శతాబ్దంలో కురుక్షేత్ర యుద్ధంలో లక్షలాది మంది సైనికులు మరణించిన తరువాత (శ్రీకృష్ణుడూ నిర్యాణం చెందిన తరువాత) కలియుగం ప్రారంభమైందని పలువురు చరిత్రకారులు నిర్ధారించారు. అప్పుడు లక్షలాది మంది పడమర, తూర్పు, దక్షిణ భారత దేశం వైపు వలసలు పోయారు. ఋషులు కూడా ఆయా మార్గాలను అన్వేషించారు. అదే కోవలో అగస్త్యుడు వింధ్య పర్వతాలను దాటి దక్షిణ దేశం వచ్చాడు. అలా దండకారణ్యంలో చెన్నూరు దగ్గరి గోదావరి ఒడ్డున ఒక తడవు విడిది చేసాడు. కాబట్టే అక్కడ ఆయన జ్ఞాపకార్థం అగస్త్యేశ్వర గుడి కట్టారు. ఆయనతో పాటు సోమ విద్య గోదావరి తీరపు తెలంగాణకు వచ్చింది. అలా అని ఎలా చెప్పగలమంటే, ఈ విద్య ఈ ప్రాంతపు గోండ్ గిరిజనులలో కొంత మందికి తెలుసు. అలాంటివారిలో 1930ల నాటి కుంరం భీమ్ ఒకరు. ఆయన ఆనాటి నిజాం అధికారులకు వ్యతిరేకంగా పలువురు గిరిజన యువకులను భూ హక్కుల పోరాటంలో పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చి, పోలీసుల తుపాకీ తూటాలు వారికి తగులకుండా వారి ప్రాణాలను కాపాడడానికి తన దగ్గర సోమ విద్య ఉన్నదని చెప్పేవాడని 2016 నాటికీ బతికి ఉన్న ఒక నాయకపోడ్ గిరిజనుడు నాతో చెప్పాడు. మరో గోండ్ పెద్ద మనిషి ఉట్నూర్ దగ్గరి మత్తడిగూడ కొండ కోనల్లో ఆ సోమలతలు ఉన్నాయని చెప్పాడు. 15 సంవత్సరాల క్రితం నేను గుండాల అనే జలపాతాన్ని వెలుగులోకి తెచ్చినప్పుడు అక్కడి గోండ్ పెద్ద మనిషి ఆ జలపాతం కింద సొరంగంలో ఖండో చెట్టు ఉంటుందని, దాని చెక్క రసంతో విరిగిన బొక్కలు అతికించడం దగ్గరి నుంచి అనేక మొండి వ్యాధులను నయం చేసి దీర్ఘకాలం బతికించవచ్చని చెప్పాడు. అదీ గాక గోదావరి తీర ప్రాంత గిరిజనులు సోమిడి (సోమ) చెక్కతో తయారు చేసిన ఇప్ప సారాను తాగి వందేండ్లకు పైగా బతికేవారు.

ఇలాంటి అద్భుతమైన చెట్లు, మొక్కలు నల్లమల అడవులలో కూడా ఉన్నాయని చెంచు పెద్ద మనిషి తోకల గురువయ్య చెప్పాడు. వాటి తావులను చూపిస్తే స్వార్థపరులు వాటిని విచక్షణా రహితంగా కొల్లగొట్టి వాణిజ్యం చేసుకుంటున్నారని పదేండ్ల కిందటే

వాపోయాడు. ఇప్పటి దుస్థితి ఎట్లా ఉన్నప్పటికీ నల్లమల ప్రాంతానికి సోమ విద్య వచ్చింది నిజమని మళ్ళీ అగస్త్యుని కథనే చెప్తుంది. ఆయన చెన్నూరు–గోదావరి నుంచి సప్తనదీ సంగమ స్థలమైన సోమశిలకు వచ్చాడు. జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ కింది వైపు సోమశిల దగ్గర కృష్ణ నదిలో తుంగభద్రతో పాటు మరో ఐదు స్థానిక నదులు కలుస్తాయి. అక్కడ అగస్త్యుని రాక–విడిదికి గుర్తుగా అగస్త్యేశ్వరం అనే గుడి కట్టారు. ఆయనతో పాటు సోమ విద్య ఇక్కడి ప్రాంతంలో నిలిచిపోయిందని చెప్పడానికి గుర్తుగా ఈ ప్రాంతం పేరే సోమశిల అయింది. సోమశిల ప్రాంతంలో కొత్త రాతి యుగం, అనంతరం బృహత్శిలా యుగం మానవులు జీవించారని చెప్పడానికి నిదర్శనాలు ఎన్నో పురావస్తు శాఖ దృష్టికి వచ్చాయి. సోమశిల ప్రాంతంలో కృష్ణ నది లోతైన ప్రవాహం సమీపంలో సోమలతలను పెంచి ఉంటారు ఋషులు, సిద్ధులు. కృష్ణ నదిలో తుంగభద్రా నది సంగమించే చోట నగ్న యతులు సంచరించేవారని క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు అంబాసిడర్ మెగస్తనీస్ ఇండికా అనే గ్రంథంలో ఉటంకించాడు. అలాంటి సిద్ధులు ఇక్కడ సంచరించినది నిజమనడానికి నిదర్శనంగా ఈ ప్రాంతంలో లభించిన ఒక పొడవాటి ఇటుకపై 'సిద్ధాంతం' అని రాసి ఉంది. మరో ఇటుకపై 'అంధిర లోకం' అని రాసి ఉంది. సమీపంలో హంద్రీ అనే నది ఉండటాన్ని బట్టి ఈ ప్రాంతాన్ని సుమారు రెండున్నర వేల ఏండ్ల క్రితమే ఆంధ్ర లోకము అని పిలిచేవారని, ఇక్కడ సోమపాన విద్య సుమారు మూడు వేల ఏండ్ల క్రితం నుంచే తెలుసని స్పష్టమవుతున్నది.





సోమపానం చేసినవారికి అమరత్వం కలుగుతుంది కనుక అలాంటి ఋషులు నివసించిన గుహలు ఉన్న సోమశిల ప్రాంతానికి అమరగిరి అని పేరు వచ్చింది. అలాంటి ఒకటి రెండు గుహలను పురావస్తు శాఖ గుర్తించగా మరి కొన్నింటిని దశాబ్ద కాలం క్రితం నేను గుర్తించాను. నేను గుర్తించిన చిత్రాల్లో ఈ ప్రాంతం కాని ఋషులు, అమరుల బొమ్మలు కూడా ఉన్నాయి. విచిత్రం ఏమిటంటే, వారు వచ్చినట్లు చెప్పే ఎగిరే పళ్లెంల బొమ్మలు కూడా నా దృష్టికి వచ్చాయి. శ్రీశైలం క్షేత్రానికి ఎదురుగా కృష్ణ నది ఎడమ ఒడ్డు పైకి పౌర్ణమి నాటి అర్ధరాత్రి అమర / దేవకన్యలు వచ్చి ఆడిపాడి పోతారని స్థానిక చెంచులు విశ్వసిస్తారని రెండు వందల ఏండ్ల కిందట కల్నల్ మెకంజీ, వందేండ్ల కింద తహసీల్దార్ సయ్యద్ గౌస్ రాశారు. ఎండా కాలంలో చేసుకునే ఇప్ప సారా పార్టీలలో చెంచులు సోమ చెక్క రసం కలుపుకుని తాగి దీర్ఘకాలం బతికేవారు. క్రీ.శ. 4వ శతాబ్దంలో ఈ అమరగిరి ప్రాంతం నుంచే ఎదిగిన విష్ణుకుండి రాజులు తాము అమరపురీశులమని తమ శాసనాల్లో చెప్పుకున్నారు.

క్రీ.శ. 13వ శతాబ్దంలో భారతం రాసిన తెలుగు కవి తిక్కన సోమ యజ్ఞం చేసి సోమయాజి అయ్యాడు. క్రీ.శ. 14వ శతాబ్దంలో తెలంగాణ కవి నిత్యనాథ సిద్ధుడు 'రసరత్నాకరం' అనే గ్రంథంలో సోమ రసం గురించి రాశాడు. ఈయన తెలంగాణ – ఆంధ్ర సరిహద్దుల్లో నల్లమల అడవుల గుండా పారే కృష్ణ నదీ పరివాహక ప్రాంతంలో జీవించేవాడు. ఆయన కంటే వేల సంవత్సరాల ముందు ఈ ప్రాంతంలో రస విద్యను కనిపెట్టారు. ఆచార్య నాగార్జునునికి రస విద్య తెలిసి చనిపోయినవాళ్లను కూడా బతికించేవాడట. తనూ 500 ఏండ్లు బతికాడని చైనా యాత్రికుడొకడు రాశాడు. అది తెలిసి కుళ్ళుకుని స్థానిక రాజు ఆయనను పిలిచి "నీవు చనిపోయి నీ రస విద్యను నీ శిష్యుల చేత నీ మీద ప్రయోగించుకొని మళ్ళీ బతికి నీ విద్యను నిరూపించు" అని, ఆయన చనిపోగానే శిష్యులు ఎవరూ ఆయనపై రసం పోయకుండా నిర్బంధించి ఆయన మరణానికి కారణమయ్యాడనే ఒక చారిత్రక కథనం ఉంది. ఆచార్య నాగార్జున, అతని శిష్య ప్రశిష్యులు నల్లమల అడవుల్లోనే రస విద్య ప్రయోగాలు చేశారు. ఆ రసవిద్యతో బంగారం తదితర సంపదలను సృష్టించడమే కాకుండా సోమ రసంతో అనేక రోగాలను నయం చేసి దీర్ఘకాలం బతికించేవారు. ఇలాంటి ప్రయోగాలను నల్లమలలోని జలపాత సమీప గుహలలో చేసేవారని, అలాంటి ఒక సిద్ధుని పేరు విశ్వేశ కక్కల అని సలేశ్వరం గుహలో రాసి ఉందని, అదే గుహలో సోమ అనే పదం కూడా రాసి ఉందని నేను 2011లో సలేశ్వర యాత్రా కథనంలో రాశాను. అయితే సోమపాన విద్య తెలంగాణలో రస విద్య కంటే ప్రాచీనమైనదని తెలుస్తుంది. సోమపాన విద్యకు రసవిద్య కొనసాగింపు.

క్రీ.శ. 14వ శతాబ్దం తరువాత కూడా సోమరసపాన విద్య తెలంగాణలో కొంతమందికి... ప్రత్యేకించి నదీ తీర ప్రాంత గిరిజనులకు తెలుసనీ పైన తెలుసుకున్నాము. ఈ సంగతి సమీప మైదాన ప్రాంతపు ప్రజలకు కూడా తెలుసనీ తెలుస్తుంది. నా సొంతూరు (చెగ్యాం) జగిత్యాల జిల్లాలో పారే గోదావరి నది ఒడ్డున ఉంది. ఈ గోదావరిలో కలిసే పైడిపల్లి వాగు ఒడ్డుపై దుస్సవేరు అనే సోమలత వంటి తీగ గడ్డతో పాటు దొరికితే దాని ద్వారా కోరుకున్న సంపద లభిస్తుందని, కష్టాలు తీరుతాయని, ఆరోగ్యాంగా చిరాయువుతో జీవిస్తామని నాకు మా అక్క 40 ఏండ్ల క్రితం చెప్పింది. ఇదే విషయాన్ని మా గ్రామంలో పలువురు అలవోకగా సందర్భోచితంగా చెప్పుకునేవారు. సారా పై నిషేధం విధించిన రెండు మూడు దశబ్దాల కాలం కిందటి నుంచి ఈ మాట విన్పించడం లేదు.

– ద్యావనపల్లి సత్యనారాయణ,
m : 94909 57078
e: dyavanapalli@gmail.com

# బీసీ చైతన్యం ఎందుకు విఫలమవుతోంది? – ఒక సామాజిక తత్వవేత్త ఆవేదన"


ఒక పోస్ట్‌కార్డు రాయలేని జాతి, ఉద్యమాన్ని ఎలా నిర్మిస్తుంది?

**సంభాషణ రూపం: బి.ఎస్.రాములు**

**ప్రశ్న: AI వచ్చాక పుస్తక పఠనం తగ్గిందా? తెలుగులో పరిస్థితి ఏంటి?**

**జవాబు:** ప్రపంచవ్యాప్తంగా వికీపీడియా ట్రాఫిక్ 8% తగ్గింది. ఫ్యాక్చువల్ ఆర్టికల్స్ 33% పడిపోయాయి. కానీ భారతదేశంలో పరిస్థితి భిన్నం. 2025లో పుస్తక మార్కెట్ 28.6% పెరిగింది. ఫిక్షన్ అమ్మకాలు 30.7% పెరిగాయి. Gen Zలో 37% మంది ప్రింట్ పుస్తకాలే కొంటున్నారు. కానీ ఇది అందరికీ వర్తించదు.

హిందీ పుస్తకాల మార్కెట్ కూడా బాగా పెరిగింది. "హిందీ బెల్ట్"లో సాహిత్య ఉత్సవాలు, పుస్తక మేళాలు కిటకిటలాడుతున్నాయి. ఢిల్లీ వరల్డ్ బుక్ ఫెయిర్‌లో హిందీ పుస్తకాల అమ్మకాలు ఏటా 20-25% పెరుగుతున్నాయి. యువతలో "హిందీ నాన్-ఫిక్షన్, ఆత్మకథలు, రాజకీయ విశ్లేషణ" పుస్తకాలకు డిమాండ్ ఎక్కువ. యూపీ, బీహార్, ఎంపీలో దళిత-బహుజన సాహిత్యం హిందీలో లక్షల కాపీలు అమ్ముడవుతున్నాయి. "జై భీమ్" ప్రచురణలు, ఫార్వర్డ్ ప్రెస్ లాంటివి హిందీలో బీసీ-దళిత చైతన్యాన్ని పెంచుతున్నాయి.



కానీ తెలుగులో ఈ ఊపు లేదు. హిందీలో ఉన్నట్టు తెలుగులో సామాజిక-రాజకీయ నాన్-ఫిక్షన్ మార్కెట్ చాలా చిన్నది. అందులోనూ బీసీల వాటా అతి తక్కువ.

**ప్రశ్న: బీసీల పఠనాసక్తి ఎలా ఉంది? మీ అనుభవం ఏంటి?**

**జవాబు:** ఇక్కడే అసలు విషాదం ఉంది. బీసీలు దేశంలో 52% ఉన్నారు. కానీ పుస్తకాలు చదవడం, కొనడంలో దళితుల కన్నా వెనుకబడి ఉన్నారు. 16% ఉన్న దళితులు బీసీల కన్నా రెట్టింపు నాన్-ఫిక్షన్ కొంటున్నారు. 700 రూపాయలు పెట్టి భారత రాజ్యాంగం విరివిగా కొంటున్నారు.

బీసీల గురించి నా స్వానుభవం చెబుతాను. 2004లో "బీసీలు ఏం చేయాలి" పుస్తకం తెచ్చాను. ప్రతి మీటింగ్‌లో అందుబాటులో పెట్టాను. రూ.75 పుస్తకం రూ.25కి ఇచ్చినా రెండేళ్లకు 1000 కాపీలు కూడా పోలేదు. ఇప్పుడు కొత్త తరం కోసం డిజిటల్ ప్రింట్‌లో 100 కాపీలు వేయాలనుకుంటున్నాను. పెద్ద ఆశలు లేవు.

**ప్రశ్న: ఉచితంగా ఇస్తే తీసుకుంటారా?**

**జవాబు:** అదీ జరగలేదు. "ఇండియాలో ఫెడరలిజం" పుస్తకం ఉచితంగా పొందడానికి ఒక్క పోస్ట్‌కార్డు రాయండి అని వాట్సాప్‌లో పెట్టాను. 8 ఉత్తరాలు మాత్రమే వచ్చాయి. 100 మందికి పైగా వాట్సాప్‌లో అడ్రస్ పెట్టి పంపండి అన్నారు.

"ఉత్తరం రాసే ఓపిక లేని వారికి పుస్తకం రాసి, ప్యాక్ చేసి, స్టాంపులు అతికించి పోస్ట్ చేసే శ్రమ దండగ" అని చెప్పాను. అయినా సరే కార్డు రాస్తామన్న వారు లేరు.

**ప్రశ్న: జూమ్ మీటింగ్స్ పెట్టి చైతన్యం తేవచ్చు కదా?**

**జవాబు:** పెట్టాను. కరోనా కాలంలో ప్రతి శనివారం సాయంత్రం జూమ్ మీటింగ్ నడిపాను. 30 నుంచి 70 మంది వచ్చేవారు. కానీ ప్రధాన వక్త ప్రసంగాన్ని వినడానికి కాదు, తాము మాట్లాడే అవకాశం కోసమే కాచుకుని కూర్చునేవారు. "రెండు నిమిషాలు" అని మొదలుపెట్టి పావుగంట తినేవారు. వాళ్లు నేర్చుకోవడానికి, వినడానికి, పని చేయడానికి రాలేదు అనిపించింది. 1990లో ఇలా వుండేది కాదు. ఉత్తేజంతో విన్నారు. పని చేసారు. ముందుకు కదిలారు. కాన్సీరాం స్ఫూర్తి గొప్పగా పని చేసింది. 1990 దశాబ్దిలో దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక (దరకమే) గొప్ప స్ఫూర్తితో.. సామాజిక తాత్విక సాహిత్య రంగాలను మలుపు తిప్పింది.

కరోనా కాలం నాటికి పరిస్థితి మారింది. సింగపూర్‌లో కూలీగా వెళ్లి వంద కోట్లకు ఎదిగిన వారు, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి 1420 మంది ఉద్యోగులతో కంపెనీ పెట్టిన వారు, 30 లక్షలతో అర్బన్ బ్యాంక్ పెట్టి దక్షిణ భారతంలో వేల కోట్ల టర్నోవర్‌తో నంబర్ వన్ చేసిన వారు – ఇలా బీసీల్లో స్వయం శక్తితో ఎదిగిన వాళ్ళతో 53 వారాలు జూమ్ మీటింగ్స్ పెట్టాను.

ఫలితం ఒక ఆర్గనైజేషన్‌గా ఒక్కరూ మాతో కలిసి పని చేయడానికి రాలేదు. ఒక్క పుస్తకం కొనలేదు. వ్యక్తిగతంగా సన్నిహితం కాలేదు. "నువ్వెవరో నేనెవరో" అన్నట్టు వెళ్లిపోయారు.

ఒక జూమ్ మీటింగ్‌కి మూడు రోజులు పని. టాపిక్, వక్త, పోస్టర్, వాట్సాప్ ప్రచారం, ఫోన్లు. ఏడాది పాటు చేసి ఇంత శ్రమ అట్టర్ ఫ్లాప్.

**ప్రశ్న: ఈ సమస్యకు మూలం ఏంటి?**

**జవాబు:** బీసీల స్వభావం. నేర్చుకోవాలి. తెలుసుకోవాలి. సమాజం కోసం పని చేయాలి అనే తత్వం పెరగాలి. "ఎవరో చేయాలి, మనం అనుభవించాలి" అనే తత్వం మారాలి.

జీతాల పెరుగుదలకు సమ్మె చేస్తే సెలవు దొరికింది అని ఎంజాయ్ చేస్తారు కొందరు. వాళ్లే జీతం పెరిగాక బిల్లు పెట్టడానికి ముందుంటారు. కానీ యూనియన్‌కి మెంబర్‌షిప్ కట్టమంటే, ధర్నాకి రమ్మంటే మాయం.

కుల సంఘం అంటే లక్ష మంది వస్తారు. కులంలో లోపలే పెళ్లి చేస్తారు.

అందుకు కుల సంఘాలు కావాలి. బీసీ సంఘం అంటే అన్ని కులాలు కలిసి రావాలి కద. పది లక్షల మందితో మీటింగు జరగాలి కద. రారు. లక్ష మంది రావడం కూడా కష్టం. కుల చైతన్యం బీసీల చైతన్యంగా మారడం లేదు.

బీసీ కమిషన్ చైర్మన్‌గా ఉన్నప్పుడు జరిగిన ఒక అనుభవం చెప్తా. మెడికల్ సీట్లలో ఐదు వందల బీసీ సీట్లు ఓసీలకు పోయాయి. స్లైడింగ్ లోపం. ఆదిలాబాద్‌లో ఓపెన్‌లో వచ్చిన బీసీ విద్యార్థి తరువాత బీసీ కోటాలో హైదరాబాద్‌కు మారారు. ఆదిలాబాద్‌లో ఖాళీ అయిన సీటు బీసీకి ఇవ్వాలి. హైదరాబాద్‌లో బీసీ సీటే. అదిలాబాద్‌లో బీసీయే. కనక ఆ సీటు బీసీలకే ఇవ్వాలి. దీనిపై వీసీ రిజిస్ట్రార్‌లను పిలిపించి అడిగాము. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ప్రకారం చేసామంటారు. దీనిగురించి విద్యార్థులు వారి తల్లితండ్రులు ఫోన్లు చేస్తారు. మెసేజ్ పెడుతారు. వచ్చి ఒక దరఖాస్తు ఇవ్వండి . మిగతా మేం చూసుకుంటాం అంటే ఏ ఒక్కరూ రాలేదు. ఇదీ బీసీల చైతన్యం.

దళితుల్లో "మేము దళితులం" అని గర్వం ఉంది. అణచివేతే ఐడెంటిటీ. "నా జాతి బాగుపడాలి" అనే సామూహిక స్పృహ ఉంది. అంబేద్కర్ ఒక్కడే దేవుడు.

**బీసీలు మేల్కొనకపోతే మరో యాభయ్యేళ్లు బానిసత్వమే. "గులాంగిరి"లో బతుకుతారు. సంఘటితం కండి. ఒకే సమిష్టి నాయకత్వంగా కలిసి పని చేయండి. ఆయా పార్టీలకు రహస్య అనుబంధంతో పని చేస్తూ పైకి స్వతంత్ర బీసీ చైతన్యం అని మఖ్య పెట్టే ఉద్యమాలు ఉద్యమ కారులు నాయకులను ఈ దందా వదిలేయాలని చెప్పండి. అలాంటి వారిని పని కట్టండి. నూతన జెన్ జీ తరం ఎదగాలి. వారి పైనే నా ఆశలు.**

బీసీల్లో "నేను బీసీ" అని చెప్పుకోవడానికి మొహమాటం. "మేము కూడా అగ్రకులాలమే" అనే భ్రమ. వందకు పైగా కులాలు, వేయి నాయకులు. ఐక్యత శూన్యం. "నేను, నా ఫ్యామిలీ సెటిల్ అయితే చాలు" అనే వ్యక్తిగత స్వార్థం.

**ప్రశ్న: మరి పరిష్కారం?**

**జవాబు:** 70 మంది సోదిగాళ్ళు కన్నా 7 మంది సైనికులు ముఖ్యం. అందుకే స్వామి వివేకానంద అన్నారు. నాకు ఐదుగురు ఉక్కు కండరాల యువకులు చాలు. దేశాన్ని ముందుకు నడుపుతాను అని.

వంద కాపీల్లో 99 కాపీలు వేస్ట్ అయినా ఒక్కడు మారితే చాలు. ఆ ఒక్కడే రేపటి ఫూలే. భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు అర్థం చేసుకోవాలి. పదిమందిని కూర్చో బెట్టి అర్థం చేయించాలి. ఊరూరా నలుగురితో నైనా భారత రాజ్యాంగం, భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం అధ్యయనం చేయించాలి. మార్పు వేగ వంతమవుతుంది.

**1. ఫిల్టర్ పెట్టాలి:** పుస్తకం కావాలంటే "ఎందుకు చదవాలి అనుకుంటున్నావో 5 లైన్లు రాయి" అని అడగాలి. శ్రమ పెట్టిన వాడికే విలువ తెలుస్తుంది.

**2. చెప్పడం కాదు, చేయించాలి:** "మీ అనుభవాలు చెప్పండి" అంటే టైమ్ వేస్ట్. "రేపటిలోగా మీ ఊరిలో 5 బీసీ పిల్లలకు కుల సర్టిఫికెట్ అప్లై చేయించు" అని టాస్క్ ఇవ్వాలి. 99% పారిపోతారు. మిగిలిన 1%తో ఉద్యమం సాగుతుంది.

**3. అందుబాటులో ఉన్న హీరో:** సింగపూర్ కోటీశ్వరుడు కాదు, "మన ఊరి సుధాకర్ కానిస్టేబుల్ ఎలా అయ్యాడు" అని చెప్పాలి. బీసీల ఆశలు అంత చిన్నవి.

ఆ 8 ఉత్తరాలు రాసిన వాళ్ళే నిజమైన బీసీ బిడ్డలు. వాళ్ళతోనే మొదలుపెట్టాలి. బుద్ధుడికి 5 మంది శిష్యులే ఉన్నారు. ఫూలే మొదటి స్కూల్‌లో 8 మంది ఆడపిల్లలే ఉన్నారు.

**ముగింపు మాట:** ఇది విమర్శ కాదు, ఆత్మవిమర్శ. బీసీలు మేల్కొనకపోతే మరో యాభయ్యేళ్లు బానిసత్వమే. "గులాంగిరి"లో బతుకుతారు. సంఘటితం కండి. ఒకే సమిష్టి నాయకత్వంగా కలిసి పని చేయండి. ఆయా పార్టీలకు రహస్య అనుబంధంతో పని చేస్తూ పైకి స్వతంత్ర బీసీ చైతన్యం అని మఖ్య పెట్టే ఉద్యమాలు ఉద్యమ కారులు నాయకులను ఈ దందా వదిలేయాలని చెప్పండి. అలాంటి వారిని పని కట్టండి. నూతన జెన్ జీ తరం ఎదగాలి. వారి పైనే నా ఆశలు.

**–డా॥ బి.ఎస్.రాములు,** m : 8331966987

e : bsramulu@gmail.com

# ఆంగ్లేయులు: 1611-1947

(గత సంచిక తరువాయి)

**1632కు** ముందుకాలంలో వచ్చిన మూడేండ్ల కరువు మసులీపటాం మరియు తీరప్రాంతంలోని ఇంగ్లీష్, డచ్ వ్యాపారాలను దెబ్బతీసింది. గోల్కొండ రాజ్యంలో తమ సరుకులకు ఎట్టి సుంకాలు చెల్లించకుండా వ్యాపారం చేసుకోవటానికి డచ్ కంపెనీ, గోల్కొండ దర్బారు అనుమతి తెచ్చుకొంది. ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంగ్లండ్ ప్రతినిధి **'థామస్ జోయస్'** అను ఆంగ్లేయుడు 1634లో కుతుబ్‌షాహి సుల్తాన్ వద్ద, గోల్కొండ రాజ్యంలో పన్నుల ఊసులేని స్వతంత్ర వ్యాపారం చేసుకోవటానికి బంగారు రేకుమీద ఫర్మానా సంపాదించాడు. **బంగారురేకు మీద వ్రాసిచ్చిన ఉత్తర్వును 'గోల్డెన్ ఫర్మానా'** అని అంటారు. సంవత్సరానికి 600 బంగారు పగోడా సొమ్ము సర్కారుకు చెల్లించి మసులీపటాం ఓడరేవుతోపాటు గోల్కొండ రాజ్య రేవుల్లో మరెట్టి పన్నులు చెల్లించకుండా ఇంగ్లీషువారు వ్యాపారం నిర్వహించవచ్చును. ఈ గోల్డెన్ ఫర్మానా ఇంగ్లీషు కంపెనీకు ఊహించిన దానికంటే ఎక్కువ మొత్తం లాభాలు సాధించి పెట్టింది.



ఈస్ట్ ఇండియా కంపెనీ, నవాబుకు 20 వేల పగోడా సొమ్ము బాకీ పడగా, గోల్కొండ నవాబు బాకీ వసూలు పేరుతో మచిలీపట్నం 1639లో సందర్శించాడు. డచ్ కంపెనీ గొప్ప నజరానాలు ఇచ్చుకొని నవాబును సంతుష్టిని చేసింది కాని, ఇంగ్లీషువారు ఈ విషయంలో వెనుకపడి పోయారు. ఇంకేముంది డచ్‌వారు వ్యాపారరీత్యా రెచ్చిపోగా, వారి పోటీకు తట్టుకోలేని ఇంగ్లీషు కంపెనీ ఇతర మార్గాలు వెతుక్కుంటూ, మద్రాసుపటాంలో వ్యాపార స్థావరం నిమిత్తం వెతుకులాట ప్రారంభించింది. **మచిలీపట్నం కౌన్సిల్ సభ్యుడు 'ఫ్రాన్సిస్ డే', హంపీ విజయనగర అవశేష రాజు – చంద్రగిరి ప్రభువు 'దామెర్ల వెంకటాద్రి' నుండి మద్రాసులో వర్తకపుకోట (సెయింట్ జార్జికోట) కట్టుకోవటానికి అనుమతి సంపాదించింది. దీన్ని తెల్లదొరల నివాసం (వైట్ టవున్)గా పిలిచారు. ఈ కోటలాంటి వర్తక గోదాములలో పనిచేయటానికి మసులీపటాం లాంటి చేనేత నగరముల నుండి తెచ్చిన నల్ల కార్మికుల నిమిత్తం వైట్‌టవున్ అనుకొని, కోటకు వెలుపల బ్లాక్ టౌన్ ఒకటి ఏర్పాటయింది. ఇక్కడ బందరు వలస కార్మికుల పేట 'బందరు స్ట్రీట్' నేడు కూడా ఉన్నది.**

1659 డిసెంబరు నెలలో 31వ తేదీన ప్రారంభమైన తుఫాన్ 1660 జనవరి 1వ తేదీ కూడా కొనసాగి మచిలీపట్నాన్ని వరదలో ముంచెత్తింది. 1606, మరియు 1614లలో కూడా బందరు నగరం, మరియు పరిసర గ్రామాలు భారీవర్షాలకు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. 1662లో కూడా బందరు ఉప్పెనకు గురయింది.

**'కుతుబ్‌షాహీల రాజ్యంలో తయారయ్యే కాలికో, మస్లిన్ బట్టలు ఎగుమతి చేసి తీసుకుపోయేందుకు ఏడాది పొడవునా అసంఖ్యాకమైన ఓడలు విశాఖపట్టణం, భీమునిపట్టణం, వాత్తర, పోండి, మసులీపటాం ఓడరేవులకు వస్తుంటాయ'**ని 17వ శతాబ్దం ఉత్తరార్ధంలో బంగళాఖాతం రేవులను దర్శించిన బ్రిటిష్ వర్తకుడు **'బౌరే'** వ్రాశాడు.

సాలీనా 1200 బంగారు పగోడాలు సర్కారుకు చెల్లించే పద్ధతి మీద 1670లో – మద్రాసులో స్వేచ్ఛా వాణిజ్యం జరుపుకునేందుకు కుతుబ్‌షాహీలు ఇంగ్లీషువారిని అనుమతించారు. అప్పటివరకు అమ్మకాలు లేక మసులీపటాం ఫ్యాక్టరీలో పేరుకుపోయిన చేనేత సరుకులు మంచిధరకు బయట అమ్ముడుపోయాయి. **'మద్రాస్‌పటాం ఈస్ట్ ఇండియా వర్తకసంఘం'** అభివృద్ధి చెందటం ప్రారంభమయిన లగాయితూ మసులీపటాం ప్రాభవం తగ్గిపోసాగింది. 1658 నాటికి మద్రాస్ ఫోర్ట్ జార్జ్ కౌన్సిల్, మసులీపటాం కౌన్సిల్‌ని మింగివేసి తూర్పుతీరాల్లోని ఇంగ్లీషు వర్తక స్థావరాలకన్నింటికి హెడ్‌క్వార్టర్స్ అయింది. **1658లో మసులీపటాంతో సహా బెంగాల్, బీహార్, ఒరిస్సా తీరరేవులన్ని మద్రాస్ రేవుకు తాబేదార్ (సబార్డినేట్) రేవులయ్యాయి.**

**1675 ప్రాంతంలో బందరు పట్టణంలో స్థానిక మహిళపై ఒక ఆంగ్లేయుడు అత్యాచారం జరపగా, అతన్ని ప్రజలు వెంటాడారు. నేరస్తుణ్ణి బ్రిటిష్ అధికారులు బందరుకోటలో దాచిపెట్టారు. కాని ప్రజలు అతన్ని వెంటాడి వేటాడి, ముక్కలు ముక్కలుగా నరికిచంపారు. ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురయి, బందరుకోటకు నీటి సరఫరా బందు చేశారు.** ప్రతీకారంగా ఆంగ్ల సైనికులు బందరు పట్టణంపై ఫిరంగులతో కాల్పులు జరిపారు. **ఆంగ్లేయులపై బహిష్కరణ ఉద్యమం ఎత్తేసుకొనే వరకు బందరు పట్టణం మీద ఆంగ్లేయులు సైనికచర్య జరుపుతూనే ఉన్నారని ఫ్రేయర్ వ్రాశాడు.** (ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర, కంభంపాటి సత్యన్నారాయణ).

1676లో ఈస్ట్ ఇండియా కంపెనీ డైరెక్టర్లు, దేశంలోని బ్రిటిష్ ఉద్యోగులు, వివాహితులు అందరూ కంపెనీ ఏర్పాటుచేసిన గృహాలలోనే నివాసముండాలని నిర్దేశించారు. **పెండ్లికాని వారు మాత్రం ఒకచోట ఉమ్మడిగా నివసించాలని ఆదేశించారు. తమ ఉద్యోగులు నైతిక విలువలు కలిగి ఉండాలని, పనివేళలలో మద్యం ముట్టుకొనరాదని, చర్చి ప్రార్థనలకు తప్పనిసరిగా వెళ్ళాలని, బందరుకోట దాటి బయటకు వెళ్ళరాదని మొదలగు ఆదేశాలు జారీచేశారు.** ఇంగ్లీషువాళ్ళంతా బందరుకోటలోని వసతిగృహాలలో ఉండేవారు. 1809లో మసులీపటాం

**'ఇంగ్లీషు కంపెనీ అధికార్ల తిరుగుబాటు'** తరువాత బందరుకోట నివాస పరిస్థితులు మారినవి. కంపెనీ అధికార్లు, సైన్యాధికార్లు బందరు పట్టణం వివిధ సివార్లలోని ఇసుకదిబ్బలమీద నిర్మించిన ఇండ్లకు నివాసాలు మార్చటం జరిగింది. ఈ క్రమంలోనే 1810–20 మధ్యకాలంలో బందరు పట్టణం ఫ్రెంచ్‌పేటలో **యూరోపియనుల రిక్రియేషన్ నిమిత్తం 'మెస్ హవుస్ కం దాన్స్ క్లబ్' ఏర్పడినది.** అదే నేటి ఫ్రెంచ్‌పేటలోని **'కాస్మోపాలిటన్ క్లబ్'.** "Probably of this period (1810-1820) was built the Mess House with its small Theatre now used as a Club by the Europeans of this (Masulipatnam) station" అంటుంది గోర్డెన్ మెకంజీ కిష్ణాజిల్లా మాన్యువల్. బ్రిటిష్ ఇండియావారి **'బ్రిగేడ్ కోర్టు'** వారి రికార్డుల ప్రకారం **– మసులీపటాంలో 1827లో ఒక యువ ఆర్మీ అధికారి మెస్–కం–క్లబ్ బిలియర్డ్స్ ఆటబోర్డు మీద, బంతులు తోసేందుకు ఉపయోగించే బిల్లియర్డ్ క్యూ స్టిక్‌తో, నాడు జరిగిన చిన్నపాటి తగాదాకు గాను, కోపోద్రిక్తుడై మరొక యూరోపియన్ అధికారిని పొడిచి చంపిన కేసు నమోదైంది.**

1672 ఫ్రెంచ్ సైన్యం మచిలీపట్నం పట్టణాన్ని సైనిక దిగ్బంధం చేస్తే తప్ప గోల్కొండ సర్కారు కండ్లు తెరవలేదు. ఓడరేవు ప్రదేశంలో సరుకు నిల్వ గోదాములు ఉండేవి కనుక **బందరుకోటలో 'బార్ టౌన్' రక్షణ కోసం నడుం బిగించి మట్టిగోడలతో ముతకకోట గోల్కొండ సర్కారు నిర్మించింది.** సరుకుతో పడవలు ప్రయాణించే నాగులేరు ఏటి ఒడ్డున, నరికిన తాడిచెట్లు పడవేసి పడవల్లోకి సరుకులు ఎగుమతి దిగుమతుల నిమిత్తం ఒక నాటు వార్ఫ్ ఏర్పాటు చేసింది.



ఓడరేవుకెళ్ళే దారిలోని వంతెన ముఖద్వారం వద్ద, కోట చిన్నగేటు (చేపకన్ను దర్వాజా) వద్ద, రెండుమైళ్ళ బ్రిడ్జి ముఖద్వారంలోని **'ద గ్రేట్ గేటు'** వద్ద, పట్టణంలోని కష్టమ్స్ షెడ్ వద్ద ఫిరంగి దిబ్బలు ఏర్పాటుచేసి కొంతమేర రక్షణ చర్యలు గోల్కొండ సర్కారు చేపట్టింది.

1679, అక్టోబరు 22వ తేదీన ప్రారంభమయిన గాలివాన తుఫాన్‌గా మారి, పెను ఉప్పెన రూపంలో పట్టణం మీద, సివార్లమీద పడింది. పట్టణంకు ఉత్తరదిక్కున మాచవరం ఇండ్లలోకి 12 అడుగుల ఎత్తుననీరు ప్రవహించింది. పట్టణంలోని రెండు గొప్ప చెక్కబ్రిడ్జిల మీద చెక్కలు గాలి ఉధృతికి ముక్కలు చెక్కలయినాయి. 18 వేలమంది ఈ ఒక్కరోజు ఉప్పెనలో చనిపోయారని, ప్రజల ఆస్థినష్టం, పశునష్టం గొప్పస్థాయిలో జరిగిందని డచ్ దేశస్థుడు **'దానియేల్ హవార్డ్'** తన నివేదికలో పొందుపర్చాడు.

ఈస్ట్ ఇండియా కంపెనీకు ఆరోజుల్లో ఇంగ్లీషు / తెలుగు తెలిసిన దుబాసి (ద్విభాషి – రెండుభాషలు తెలిసినవాడు) **'కుల్‌సుమ్ పీరా'** అను ముసల్మాను, అతని సహాయకుడిగా **'కానుకొలను భగవాన్లు'** అనే బ్రాహ్మణ వ్యక్తి ఉండేవారు. వీరిద్దరూ మద్రాసు ఇంగ్లీషు కంపెనీ అధికార్లకు **'దివిసీమను వెంటనే ఆక్రమించుకొనేందుకు'** ప్రేరేపిస్తూ ఉత్తరాలు వ్రాస్తుండేవారు.

1749లో **'అంబారు'** యుద్ధంలో కర్ణాటక నవాబు ఓడిపోయాడు. నైజాం నవాబు నాజర్‌జంగ్ యుద్ధంలో ఓడి చంపబడ్డాడు. అతని స్థానంలో నిజాం మనవడు ముజఫర్ జంగ్ నైజాం నవాబయ్యాడు. ముజఫర్ నవాబవటానికి ఫ్రెంచ్‌వారు సహాయం చేసినందుకుగాను 1749లో ముజఫర్, ఫ్రెంచ్‌వారికి పాండిచ్చేరి దగ్గర కొన్ని గ్రామాలు, **మచిలీపట్నం మరియు చుట్టుప్రక్కల ప్రదేశం, కొండపల్లి సర్కారు బహుమతిగా ఇచ్చాడు.** అప్పటినుండి ఫ్రెంచ్ గవర్నరు డూప్లే మరియు సైనికాధికార్లు బందరులోని ఫ్రెంచ్‌పేటలో కలెక్టరు గారి బంగళా నానుకొని ఉన్న నేటి ఎన్.జి. వోస్ కాలనీ (మాజేటి మాన్యుమెంట్స్ భూమి)లో సాయుధ పహారా మధ్య నివసించారు. **1759లో గోల్కొండ దర్బారు అధికార్లు ఫ్రెంచ్ అధీనంలోని మచిలీపట్నం ఫ్రెంచ్ ఫ్యాక్టరీని స్వాధీనపర్చుకోగా, 1751లో ఫ్రెంచ్ సైన్యం బందరు ఓడరేవును, పట్టణాన్ని పరిసర రాజ్యంతోసహా స్వాధీనం చేసుకొన్నది. "ఫ్రెంచ్ సేనలు ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండానే, అకస్మాత్తుగా సముద్రం మీదుగా మసులీపటాం భూభాగం మీద ప్రత్యక్షమయి బందరు నవాబు సైన్యాన్ని ఎదిరించి పట్టణాన్ని – ఓడరేవును స్వాధీనం పర్చుకోవటంలో తప్పకుండా ఎంతో కొంత కుట్రదాగి ఉంటుంది" అంటున్నది గోర్డెన్ మెకంజీ విరచిత కిష్ణాజిల్లా మాన్యువల్.**

1759లో బ్రిటిష్ సైనికాధికారి కల్నల్‌ఫోర్డ్ బందరుకోటను ఫ్రెంచ్‌వారి నుండి యుద్ధంలో స్వాధీన పర్చుకున్నాడు. 1756లో నాటి బ్రిటిష్ ఇంజనీర్ స్టీవెన్స్' వేసిన అంచనాల ప్రకారం 1,82,274 మద్రాసు పగోడాల సొమ్ము ఖర్చుపెట్టి బందరుకోట గోడలు, 11 బురుజుల మరమ్మత్తు జరిగింది. మంచినీటి చెర్వులనుండి కోటలో అవసరమైన చోట్లల్లా త్రాగునీటి సరఫరాకు పట్టణం నుండి 1767 తూములు, కోట రహదారి పొడవునా వేసి నీటిసరఫరా చేశారు. 1772లో మసులీపటాం ఈస్ట్ ఇండియా కౌన్సిల్ ముఖ్యుడు సముద్రపు ఆటుపోటుల సమయంలోనూ, వర్షపుకాలంలోనూ బందరుపేట నుండి కోటకు వెళ్ళే రహదారి మునిగిపోవటం గమనించి రహదారి రెండుమైళ్ళ పొడవున, రెండువైపులా ఇటుకరాతి రిటైనింగ్ గోడ కట్టించాడు. ఈ రహదారి గోడ ఈనాటికి కూడా రోడ్డుకిరువైపులా నిశితంగా పరిశీలిస్తే దర్శన మిస్తూనే ఉంటుంది.

**'ఉత్తర సర్కారులకు మచిలీపట్నం కేంద్రం. అటు నైజాం సైన్యదాడుల నుండి ఇటు మరాఠా దాడుల నుండి, అవసరమైతే ఫ్రెంచ్‌సైన్య దాడులనుండి కూడా మసులీపటాం మరియు దాని పరిసరాలను కాపాడుకోవాలి'** అనే ధృఢ నిశ్చయానికొచ్చిన ఆనాటి బ్రిటిష్ పాలకులు మసులీపటాం మీద తలకుమించిన సొమ్ము ఖర్చుపెట్టి బందరుకోటను పటిష్ఠ పరిచారు.

–మహమ్మద్ సిలార్
మెంబర్, ఇంటాక్ మచిలీపట్నం చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 9985564946

# గ్రాఫైట్ ఖనిజం యొక్క నిక్షేపాలు మరియు ఉపయోగాలు



గ్రాఫైట్ ఖనిజం

గ్రాఫైట్ ఖనిజం కేంద్ర ప్రభుత్వం ద్వారా నోటిఫై చేయబడిన క్రిటికల్ మినరల్స్‌లో ఒకటి. వీటినిక్షేపాలు ఉన్నప్పటికి మన అవసరాలకు సరిపడాలేనందువల్ల వేరే దేశాల నుండి దిగుమతి చేసుకోవలసి వస్తున్నది. వీటి ఉపయోగాలు చాలా ఎక్కువ ఉండటం వల్ల దీని నిక్షేపాల నిర్ధారణకై విస్తృతంగా అన్వేషణ కొనసాగిస్తున్నారు.

గ్రాపైట్ కార్బన్ మూలకం యొక్క అల్లీట్రాఫిక్‌ఫార్మ్. దీనిలో గ్రాఫీన్ యొక్క ఎన్నో పొరలు కట్టకట్టినట్టు ఉంటాయి. గ్రాఫైట్ సహజరూపంలో కార్బన్ స్టేబుల్‌గా స్టాండర్డ్ కండీషన్స్‌లో దొరుకుతుంది. న్యాచురల్ మరియు సింథటిక్ గ్రాఫైట్ చాలా పెద్ద మొత్తంలో ఉపయోగించబడుతుంది. (1.3 మిలియన్ మెట్రిక్ టన్స్ సంవత్సరానికి- 2022లోని డేటా) ఇది ఎన్నో క్రిటికల్ పరిశ్రమలలో ఉదాహరణకు రిఫ్రాక్టరీస్ (50%) లిథయం ఐన్ బ్యాటరీలలో (18%), ఫౌండరీస్ (10%) మరియు లూబ్రికెంట్స్‌లో (5%), ఇతర పరిశ్రమలలో (17%). గ్రాఫైట్ చాలా ఎక్కువ టెంపరేచర్స్ ప్రెషర్స్‌కు లోనైనప్పుడు ఇది డైమండ్‌గా మారుతుంది. దీని యొక్క తక్కువ కాస్ట్ మరియు థర్మల్, కెమికల్ ఇనర్టనెస్ మరియు హీట్ మరియు ఎలక్ట్రికల్ కండక్టివిటి ప్రాపర్టీస్ ఉండటం వల్ల ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నది.

గ్రాఫైట్ న్యాచురల్‌గా శిలలో ఖనిజాల రూపంలో నిక్షేపాలు దొరుకుతుంది. సరిపోను సహజ నిక్షేపాలు లేనందున దీనిని సింథటిక్ రూపంలో ఉత్పత్తి చేస్తున్నారు.

గ్రాఫైట్ సహజంగా ఓర్స్‌లో అమార్ఫస్ రూపంలో (మైక్రోక్రిస్టలైన్) లేదా క్రిస్టలైన్ (ఫ్లాక్, లంప్, చిప్) రూపంలో దొరుకుతుంది. చాలా వరకు గ్రాఫైట్ సహజంగా దొరికే నిక్షేపాలు కార్బొనేశియస్ సెడిమెంటరీ శిలలు మెటమార్ఫిసంకు లోనైనప్పుడు ఏర్పడుతుంది. దీని యొక్క ముఖ్యమైన సోర్స్‌కోల్. ఎందుకంటే ఇది థర్మల్‌మెటమార్ఫిసంకు లోనైనప్పుడు గ్రాఫైట్ పార్మ అవుతుంది.

క్రిస్టలైన్ ఫ్లేకిగ్రాఫైట్ కార్బొనేశియస్ మెటమార్ఫిక్ శిలల నుండి మైన్ చేయబడుతున్నది. లంప్, చిప్ గ్రాఫైట్ వీన్స్ రూపంలో హైగ్రేడ్ మెటమార్ఫిక్ శిలల నుండి మైన్ చేస్తున్నారు.

సింథటిక్ గ్రాఫైట్‌లో హై ప్యూరిటి ఉంటుంది. దీనిని హైడ్రోకార్బన్ మెటీరియల్స్‌ను $2100^{0}C$ టెంపరేచర్స్‌తో థర్మల్ గ్రాఫిటైజేశన్‌కు గురిచేసి ఉత్పత్తి చేస్తారు. ఈ పక్రియను అచేసన్ ప్రాసెస్ అంటారు.

సహజ గ్రాఫైట్‌ను ఎక్కువగా రిఫ్రాక్టరీలు, బ్యాటరీలు, ఉక్కు తయారీ, విస్తరించిన గ్రాఫైట్, బ్రేక్‌లైనింగ్‌లు, ఫౌండ్రీఫేసింగ్‌లు మరియు కందనెల కోసం ఉపయోగిస్తారు.



ఖోండలైట్, శివగంగలో గ్రాఫైట్ అధికంగా ఉన్న భాగాలు



గ్రాఫైట్‌తో కూడిన గార్నెట్-సిల్లిమనైట్ నైస్

రిఫ్రాక్టరీ పదార్థంగా గ్రాఫైట్ 1900 సంవత్సరం నుండి ఉపయోగించడం మొదలైంది.

2017 సంవత్సరం వచ్చే సరికి ప్రాముఖ్యత సంతరించుకున్నది. కార్బన్ - మాగ్నసైట్ ఇటుక, మొనోలిథిక్ గ్రన్నింగ్ మరియు రామింగ్ మిశ్రమాలు ఆపై క్రూసిబుల్స్, బ్లాస్ట్‌ఫర్నేస్ లైనింగ్‌లు.

1970 సంవత్సరం నుండి బ్యాటరీలలో గ్రాఫైట్ వాడకం పెరిగింది. ప్రధాన బ్యాటరీ సాంకేతికతలలో ఎలాక్ట్రాడ్‌లను నిర్మించడానికి సహజ గ్రాఫైట్ మరియు సింథటిక్ గ్రాఫైట్‌ను యానోడ్ పదార్థంగా ఉపయోగిస్తారు. గ్రాఫైట్ ఈరోజు లిథియం అయాన్ బ్యాటరీలలో యానోడ్ పదార్థం. ఉక్కు తయారీలో సహజ గ్రాఫైట్ ప్రధానంగా కరిగిన ఉక్కులో కార్బన్ శాతాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది. భారీ వాహనాల యొక్క బ్రేక్ షూతో బ్రేక్ లైనింగ్స్‌లో సహజ అమార్ఫస్ మరియు సన్నని రేకుల గ్రాఫైట్‌ను ఉపయోగిస్తారు. మరియు ఆస్బెస్టాస్‌కు ప్రత్యామ్నాయం అవసరం కావడంతో దీనికి ప్రాముఖ్యత పెరిగింది.

ఫౌండ్రి ఫేసింగ్ మోల్డ్ వాష్ అనేది నిరాకార లేదా సన్నటి రేకుల గ్రాఫైట్‌తో తయారు చేయబడిన నీటి ఆధారిత పేయింట్.

16వ శతాబ్దం నుండి అన్ని పెన్సిళ్లను ఇంగ్లీష్ సహజ గ్రాఫైట్ లెడ్‌లతో తయారు చేశారు. పైన్‌వుడ్ డెర్బీలలో గ్రాఫైట్ బహుశా అత్యంత ఎక్కువగా ఉపయోగించే కందెన. ఇవి కాకుండా సహజగ్రాఫైట్‌ను జింక్ కార్బన్ బ్యాటరీలలో, ఎలక్ట్రిక్ మోటార్ బ్రష్‌లలో మరియు వివిధ ప్రత్యేక అనువర్తనాలలో ఉపయోగిస్తారు. చైనా ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిలో అగ్రగామిగా ఉండడమే కాకుండా సుమారు 100 మిలియన్ మెట్రిక్ టన్నుల అంచనాతో ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద గ్రాఫైట్ నిల్వలు కలిగిన దేశం కూడా.


మనదేశంలో గ్రాఫైట్ నిక్షేపాలు అరుణాచల్‌ప్రదేశ్, తమిళనాడులో శివగంగాలో గ్రాఫైట్ బెల్ట్ మరియు ఆంధ్రప్రదేశ్‌లో తూర్పుగోదావరి జిల్లాలోని బూరుగు బండ తపసికొండ గ్రాఫైట్ బెల్ట్ కలదు. ఈ ఖనిజం సామాన్యంగా గ్రాన్యులైట్స్‌లో కొండలైట్ గ్రూప్‌కు చెందిన గార్నేటీపెరస్ సిల్లీమనైట్ నైస్‌లో దొరుకుతుంది. శిస్ట్‌లో నైస్‌లో దొరికే గ్రాఫైట్ సాధారణంగా అమార్ఫస్ వెరైటీగా ఉంటుంది. అదే పెగ్మటైట్స్, క్వార్ట్ వీన్స్‌లో ఫ్లేకి గ్రాఫైట్ వెరైటీ దొరుకుతుంది. ప్రస్తుతం మన దేశంలో 8.6 మిలియన్ టన్నుల సహజగ్రాఫైట్ ఉత్పత్తి చేసే దేశాలలో మన దేశం టాప్ పది దేశాలలో ఒకటి. అయినప్పటికి దీనికున్న డిమాండ్‌కి కొంత శాతమే ఉత్పత్తి చేయగలుగుతున్నాము. ఈ కారణంగానే చాలా వరకు ఎక్కువ శాతం దిగుమతి చేసుకుంటున్నాము. మన దేశంలోని నిక్షేపాలు అరుణాచల్ ప్రదేశ్‌లో 43 శాతం, జమ్ము-కశ్మీర్‌లో 37 శాతం, జార్ఖండ్‌లో 6 శాతం, తమిళనాడులో 5 శాతం, ఒడిశాలో 3 శాతం ఉన్నవి.

- కమతం మహేందర్ రెడ్డి

m : +91 90320 12955

e : mahikam.reddy0@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com



# దక్కన్ సుల్తానేట్ కట్టడాలు, కోటలు

UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2014

Serial Nomination for MONUMENTS AND FORTS OF THE DECCAN SULTANATE INDIA

Karnataka and Andra Pradesh Province or Region India. Category: Cultural

**యునెస్కోకు సమర్పించిన తేదీ:** 2014 ఏప్రిల్ 15

**ప్రామాణికాలు:** (ii)(iii)


**వర్గం:** సాంస్కృతికం

**సమర్పించింది:** యునెస్కోలో భారతదేశ శాశ్వత ప్రతినిధి బృందం

**రాష్ట్రం, ప్రాంతం లేదా విభాగం:** కర్ణాటక, తెలంగాణ

**సూచన సంఖ్య:** 5887

'దక్కన్ సుల్తానేట్ స్మారక చిహ్నాలు' అనేది ఒక సీరియల్ ప్రాపర్టీ. ఇందులో భారతదేశంలోని దక్కన్ సుల్తానేట్ స్మారక చిహ్నాలకు అత్యంత ప్రాతినిధ్యం వహించే, అత్యంత ప్రామాణికమైన, ఉత్తమంగా సంరక్షించ బడిన నాలుగు భాగాలు ఉన్నాయి. ఈ శ్రేణి, ఇస్లామిక్ వాస్తుశిల్పంలోని జాతీయ, అంతర్జాతీయ శైలుల అద్భుత సమ్మేళనాన్ని, అలాగే ప్రస్తుత కర్ణాటక, తెలంగాణలోని దక్షిణ భారతదేశంలో ఆ కాలంలో ప్రబలంగా ఉన్న హిందూ వాస్తుశిల్పంతో వాటి సంబంధాలను ప్రదర్శిస్తుంది.



గుల్బర్గా, బీదర్, బీజాపూర్, హైదరాబాద్‌లలో నిర్మించిన ఐకానిక్ ఇండో ఇస్లామిక్ స్మారక కట్టడాలతో భారత దేశ కళలు, వాస్తుశిల్పానికి దక్కన్ సుల్తానేట్ చేసిన కృషి ఆకట్టుకుంటుంది. ఈ ప్రదేశాలు దక్కన్ సుల్తా నేట్‌ల ముఖ్యమైన మధ్యయుగ కోటలుగా, గోడలతో కూడిన నగరాలుగా ఆవిర్భవించాయి. సుల్తానేట్ శక్తి వంతమైన కొత్త నిర్మాణ శైలితో ఇది ఆ కాలంలోని దక్కన్ హిందూ కళాత్మక సమ్మేళనాలతో ఉద్భవించింది. వీటిలో ప్రతి ఒక్కటి కూడా విడిగా సుల్తానేట్ చరిత్ర ముఖ్యమైన అంశాలను కవర్ చేస్తుంది, గుల్బర్గా తన అద్భుత కోటలు, జామీ మసీదు, రాజ సమాధులతో సహా సామాన్య శకం 14వ శతాబ్దం మధ్యలో బహమనీ రాజ్యాల మొదటి రాజధానిగా అభివృద్ధి చెందింది. సా.శ.15వ శతాబ్దం మధ్యలో తదుపరి బహమనీ రాజ ధానిగా బీదర్ నిలిచింది. ప్రపంచ చరిత్రలో 2వ అతిపెద్ద గోపురంగా నిలిచిన గోల్ గుంబాజ్ వంటి బీజాపూర్ లోని స్మారక కట్టడాలలో ఆదిల్ షాహీ రాజవంశం ద్వారా దక్కనీ సుల్తానేట్ శైలి మరింత పరిణామం చెందింది. హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, సమాధులు, చార్మినార్‌లోని కుతుబ్ షాహీ స్మారక కట్టడాలలోని శైలి చివరి వైవిధ్యం, అభివ్యక్తిగా నిలిచింది.

**దక్కన్ సుల్తానేట్ వివరాలు:**

- కర్ణాటకలోని గుల్బర్గా వద్ద బహమనీ కట్టడాలు
- కర్ణాటకలోని బీదర్ వద్ద బహమనీ, బరీద్ షాహి కట్టడాలు
- కర్ణాటకలోని బీజాపుర్‌లోని ఆదిల్ షాహి కట్టడాలు
- తెలంగాణ లోని హైదరాబాద్ వద్ద కుతుబ్ షాహీ స్మారక చిహ్నాలు





### గుల్బర్గాలోని బహమనీ స్మారక చిహ్నాలు

కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలో ఉన్న 14వ శతాబ్దపు బహమనీ కట్టడాలలో ప్రధానంగా గుల్బర్గా కోట, ఆ కోటలోని 'గ్రేట్ మసీదు' (జామా మసీదు), ఏడు సమాధులతో కూడిన 'హఫ్ట్ గుంబద్' సముదాయం ఉన్నాయి. ఇవి భారత పురావస్తు శాఖ సంరక్షణలో ఉన్నాయి.

బహమనీ రాజవంశం మొదటి రాజధానిగా గుల్బర్గాలో ఒక కోట ఉండేది. నగరం దీర్ఘవృత్తాకార కోటకు వాయువ్య దిశలో అత్యంత పురాతనమైన పట్టణం ఉంది. దానిలో షా బజార్ మసీదు ఉంది. ఇది గుల్బర్గా జామీ మసీదుగా ఉండేది. సమాధులు, దర్గాలు, వాటికి అనుబంధంగా ఉన్న జలాశయాలు, నగరం రెండు భాగాలను చుట్టుముట్టి, కోట చుట్టూ భావనాత్మక 'రక్షణాత్మక' వలయాలుగా పనిచేసేవి. ఒకప్పుడు వరం గల్ పాలకులకు సామంతుడిగా ఉండిన రాజా గుల్‌చంద్ నిర్మించిన కోట, ఎటువంటి సహజ రక్షణలు లేని ఒక 'నర దుర్గం'. అంటే ఇది పూర్తిగా సైనికుల బలంపై ఆధారపడి ఉండేది. తరువాత అలావుద్దీన్ బహ మనీచే పూర్తిగా పునరుద్ధరించబడి, పునర్నిర్మించబడిన ఈ కోట, ఆ కాలంలో ఒక ఇంజనీరింగ్ అద్భుతం. దీనికి 50 అడుగుల మందంతో కూడిన రెండు గోడల నిర్మాణం ఉంది, ఇందులో లోపలి గోడ బయటి దాని కంటే ఎత్తుగా ఉంటుంది. మూడు మైళ్ల పొడవైన దాని కోట గోడలను పూర్తిగా చుట్టుముట్టి ఉన్న 90 అడు గుల వెడల్పు గల కందకం, ఎత్తగల వంతెనలతో ఇది దాదాపు అభేద్యమైన రక్షణ వ్యవస్థను ప్రదర్శిస్తుంది. పదిహేను బురుజులు, 26 ఫిరంగులు దీనిని అన్ని కోటలలోకెల్లా అత్యంత శక్తివంతమైనదిగా నిలిపాయి. దీని బ్రహ్మాండమైన పశ్చిమ ప్రవేశ ద్వారానికి నాలుగు గేట్లు, నాలుగు ప్రాంగణాలు ఉన్నాయి. వాటిలో ప్రతి ఒక్కటీ ఎంత పటిష్టంగా నిర్మించబడిందంటే, దేని గుండా అయినా సురక్షితంగా దాటడం అసాధ్యం. ఇది సైనిక నిర్మాణ శైలికి ఒక అద్భుతమైన ఉదాహరణ. లోపల పెద్ద భవనాలు, దేవాలయాలు, అనేక అందమైన ప్రాంగ ణాల అవశేషాలు ఉన్నాయి. విశాలమైన, గంభీరంగా కనిపించే బాలా హిస్సార్‌ను రాజ నివాసంగా, నిస్సం దేహంగా చివరి ఆశ్రయంగా ఉపయోగించారు.

గుల్బర్గాలోని ఇతర కట్టడాలలో జామీ మసీదు, 'హఫ్ట్ గుంబజ్' (ఏడు సమాధుల సముదాయం) ఉన్నాయి. 1367లో నిర్మించబడిన జామీ మసీదు 38,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండి అద్భుతంగా కనిపి స్తుంది; పైకప్పుతో కూడిన నిర్మాణం కావడం వల్ల, ఇది ఈ ప్రాంతంలోనే ఒక ప్రత్యేకమైన సామూహిక ప్రార్థనా ప్రాంగణంగా నిలుస్తుంది. హఫ్త్ గుంబజ్ సమాధులలో బహమనీ వంశానికి చెందిన ముజాహిద్ షా, దావూద్ షా, గియాసుద్దీన్ షా, షంషుద్దీన్ షాల సమాధులు ఉన్నాయి.

### బీదర్‌లోని బహమనీ, బరీద్ షాహీ కట్టడాలు

15వ శతాబ్దం చివరి నుండి 16వ శతాబ్దం ప్రారంభం వరకు నిర్మించబడిన బీదర్‌లోని బహమనీ, బరీద్ షాహీ కట్టడాలలో బీదర్ కోట, మదర్సా మహమూద్ గవాన్, అష్టూర్‌లోని బహమనీ సమాధులు, బరీద్ షాహీ సమాధులు ఉన్నాయి.

బీదర్‌లోని క్రమరహిత, వృత్తాకార కోట, దాని దక్షిణ భాగంలో చతుర్భుజాకార నగరానికి అనుసంధానించబడి ఉంది. రాజభవనాలు ఈ కోటలోనే ఉన్నాయి. ఆరు మైళ్ల పొడవైన ఈ కోట గోడ, ఎర్రటి లాటరైట్ రాతితో చేసిన భారీ దిమ్మెలతో నిర్మించబడింది. ఇది 37 బురుజులతో పటిష్టంగా ఉండేది. దీనికి ప్రహరీ గోడలతో కూడిన అనేక ద్వారాలు ఉన్నాయి. కోట లోపల, జామి మసీదు, సోల్హా ఖుంబా మసీదు అనే రెండు పెద్ద మసీదులు కూడా నిర్మించబడ్డాయి. ఈ మసీదులోని పదహారు స్తంభాలు ఎత్తైన డోమ్ కు ఆధారాన్ని అంది స్తాయి. బీదర్‌లోని ఒక ముఖ్యమైన ఘనత ఏమిటంటే, అధునాతనమైన ద్వారాలు, తూముల వ్యవస్థను ఏర్పాటు చేయడం. అవసరమైనప్పుడు కోట కందకంలోని కొన్ని భాగాలను నీటితో నింపి, తద్వారా నీటిని నిల్వ చేయడానికి ఈ వ్యవస్థను ఉపయోగించే వారు.

మహమూద్ గవానా మదర్సా 68 మీటర్ల పొడవు, 60 మీటర్ల వెడల్పు గల దీర్ఘచతురస్రాకార నిర్మాణంలో ఉంది. మధ్యలో ఒక చతుర్భుజాకార ప్రాంగణాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం ఉనికిలో లేని ప్రధాన ప్రవేశ ద్వారం తూర్పు వైపు ఉండేది. ఇది మధ్యలో పన్నెండు భుజాల నీటి తొట్టితో ఉన్న చతుర్భుజాకార ప్రాంగణంలోకి దారితీసేది. అష్టూర్‌లోని బహమనీ పాలకుల 12 సమాధులను 1436 నుండి 1535 మధ్య నిర్మించారు. అహ్మద్ షా I సమాధికి ఉన్న డోమ్ 30






మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుతో అత్యంత ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ చతురస్రాకార సమాధుల లోపలి పైకప్పులపై అందమైన రంగులు, బంగారు పూతతో కూడిన చిత్రాలు ఉన్నాయి. అలీ బరీద్ సమాధికి 25 మీటర్ల ఎత్తైన డోమ్ ఉంది. ఇది సౌష్టవాకృతిలోని నాలుగు చతురస్రాల తోట మధ్యలో ఉంది.

### బీజాపూర్‌లోని ఆదిల్ షాహీ స్మారక చిహ్నాలు

బీజాపూర్‌లోని ఆదిల్ షాహీ స్మారక చిహ్నాలు 15వ శతాబ్దం చివరి నుండి 17వ శతాబ్దం చివరి కాలం నాటివి. ఇవి కోటలు, ద్వారాలు, నీటి వ్యవస్థలు, చెరువులు, అనేక మసీదులు, సమాధులు, రాజభవన నిర్మాణాలతో సహా 80 చిన్నా, పెద్ద స్మారక చిహ్నాల సముదాయం. బీజాపుర్ రెండు వలయాల కోటల మధ్య ఉంది. భారీ ఫిరంగి దళాలను ఉంచడానికి, ఆరు మైళ్ళకు పైగా విస్తరించి ఉన్న బయటి నగర గోడలను, 100 బురుజులతో పటిష్టం చేయబడిన విస్తృతమైన కందకాలతో నిర్మించారు. దీని ప్రవేశ ద్వారాలను భారీ వంపులు గల వంతెనల మీదుగా చేరుకోవచ్చు, వాటిలో కేవలం రెండు మాత్రమే ఇప్పుడు మిగిలి ఉన్నాయి.



ఈ కోట పరిధిలోని అత్యంత విశిష్టమైన కట్టడాలలో గోల్ గుంబజ్, దాని రక్షిత ప్రాంతంలోని ఇతర నిర్మాణా లు, ఇబ్రహీం రౌజా, జహాన్ బేగం సమాధి, ఐనాపూర్, ఐన్-ఉల్-ముల్క్ సమాధి, అలీ II రౌజా (బారా కమా న్), చాంద్ బావడి, గగన్ మహల్, సంగీత్, నారీ మహల్స్, నవరాస్‌పూర్, జామీ మసీదు, అసర్ మహల్, అలీ I రౌజా, దక్కనీ ఈద్గా, హైదర్ బుర్జ్, నీటి టవర్లు, కరీముద్దీన్ మసీదు, మక్కా మసీదు, రామలింగ ట్యాంక్, గుమ్మట బావడి, ఇబ్రహీంపూర్ బావి, 'మహల్ ఇన్ ఫీల్డ్' (పొలంలోని భవనం) వంటివి ఉన్నాయి. జామీ మసీదు భారతదేశంలోని అత్యుత్తమ మసీదులలో ఒకటి. దీని ప్రాంగణం మొదట 9,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండేది, తర్వాత ఇది 11,000 చదరపు అడుగులకు విస్తరించబడింది; ఇది 5,000 మందికి సరిపడా స్థలాన్ని కలిగి ఉండేలా రూపొందించబడింది. నిస్సందేహంగా, గోల్ గుంబజ్ ప్రపంచం లోనే రెండవ అతిపెద్ద డోమ్. ఇది ముహమ్మద్ ఆదిల్ షా సమాధి. దీని చతురస్రాకారపు పునాదిపై సుమారు 150 అడుగుల ఎత్తు, 100 అడుగులకు పైగా వ్యాసం కలిగిన భారీ డోమ్ నిర్మించబడింది. ఇది విశాలమైన హాలును కప్పి ఉంచుతుంది. ఇక్కడి అనేక కట్టడాలు, రాజభవనాలలో సున్నితమైన కుడ్య చిత్రాలు, అద్భుత అలంకరణలు కనిపిస్తాయి.

### హైదరాబాద్‌లోని కుతుబ్ షాహీ కట్టడాలు

గోల్కొండ కోట, కుతుబ్ షాహీ సమాధులు, చార్మినార్‌లు కుతుబ్ షాహీ వంశానికి ప్రతీకలుగా నిలిచే ముఖ్య మైన కట్టడాలు. గోల్కొండ అనేది ఒక పటిష్ఠ కోట. కుతుబ్ షాహీ వంశం ప్రారంభ రాజధాని నగరం. ఇది సైనిక నిర్మాణాలు (కోట గోడలు, ద్వారాలు, బురుజులు, ఆయుధశాల), మతపరమైన కట్టడాలు (మసీదు లు, ఆలయాలు), నివాస భవనాలు (రాజభవనాలు), నీటి వ్యవస్థల (కాలువలు, ఫౌంటైన్లు, అందమైన ఉద్యానవనాలు) సముదాయం. కుతుబ్ షాహీ సమాధుల ప్రాంగణం ఒక రాజ సమాధి క్షేత్రం; ఇందులో రాజ కుటుంబానికి చెందిన 30 సమాధులు, అలాగే ఒక స్నానపు గృహం (మృతుల స్నానానికి వాడేది), మసీదులు ఉన్నాయి. ఈ సమాధులు 1543 నుండి 1672 వరకు సాగిన 130 ఏళ్ల కాలంలో పాలించిన కుతుబ్ షాహీ వంశపు పాలకులకు చెందినవి.


ప్రతిష్ఠాత్మకమైన చార్మినార్, క్రీ.శ. 1591లో హైదరాబాద్ స్థాపనను పురస్కరించుకుని నిర్మించిన ఒక ఉత్సవ ముఖద్వారం. ఏడు కిలోమీటర్లకు పైగా పొడవున్న తన రాతి ప్రాకారాల లోపల, గోల్కొండ కోట ఒక మధ్యయుగ ఇస్లామిక్ నివాస ప్రాంతాన్ని ఆవరించి ఉంది. ఇక్కడి చారిత్రక కట్టడాలలో సైనిక, రక్షణ నిర్మా ణాలు, శ్మశాన స్నానశాలలు, ధాన్యాగారాలు, మసీదులు, తోటలు, నివాస గృహాలు, మండపాలు, రాజ దర్బారులు ఉన్నాయి. ఇవి భారతదేశంలోని ఒక మధ్యయుగ కోట పట్టణంలో జీవనానికి అవసరమైన అన్ని రకాల నిర్మాణాలను ప్రదర్శిస్తాయి. ఈ కోట లేదా బాలా హిసార్ లోపల శిలా ఖానా, నగిన బాగ్, అంబర్ ఖానా, అక్కన్న-మాదన్న కార్యాలయాలు, రామదాస్ జైలు, దర్బార్ హాల్, బారాదరి, హమామ్‌లు, మహల్‌లు, రాజ దర్బారులు ఉన్నాయి.

### అత్యుత్తమ సార్వత్రిక విలువకు సమర్థన

'దక్కన్ సుల్తానేట్ కట్టడాలు' భారతదేశంలోని దక్కన్ సుల్తానేట్ కట్టడాలకు ప్రాతినిధ్య ఉదాహరణలుగా నిలుస్తాయి. ఈ శ్రేణి, జాతీయ, అంతర్జాతీయ ఇస్లామిక్ వాస్తుశిల్ప శైలుల అద్భుత సమ్మేళనాన్ని, అలాగే ప్రస్తుత కర్ణాటక, తెలంగాణలోని

దక్షిణ భారతదేశంలో ఆ కాలంలో ప్రబలంగా ఉన్న హిందూ వాస్తు శిల్పంతో వాటి సంబంధాలను ప్రదర్శిస్తుంది.

**ప్రమాణం (II):** 14-17వ శతాబ్దాల మధ్య, దక్షిణ-మధ్య భారతదేశంలోని దక్కన్ పీఠభూమి అనేక ముఖ్య మైన, అత్యంత సంస్కారవంత ముస్లిం రాజ్యాలకు నిలయంగా ఉండేది. ఇరాన్, పశ్చిమ ఆసియా, దక్షిణ భారతదేశం, కొన్నిసార్లు ఐరోపా, అలాగే దక్షిణ, ఉత్తర భారతదేశం నుండి వచ్చిన ప్రభావాలను సూక్ష్మంగా మిళితం చేస్తూ, ఈ దక్కన్ సుల్తానేట్‌ల క్రింద ఉత్పత్తి చేయబడిన కళలు భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల కళల నుండి, ముఖ్యంగా మొఘల్ పోషణలో సృష్టించబడిన వాటి నుండి స్పష్టంగా భిన్నంగా ఉంటాయి. 1565లో శక్తివంతమైన విజయనగర సామ్రాజ్యాన్ని జయించిన తరువాత ఈ సుల్తానేట్ రాజ్యాలు ఒక నూతన శక్తిగా ఆవిర్భవించాయి. వారి సాంస్కృతిక మార్పిడి ఫలితంగా వారు సుల్తానేట్ వాస్తుశిల్ప శైలుల ఒక ప్రత్యేకమైన మిశ్రమాన్ని అభివృద్ధి చేశారు. ముస్లిం, హిందూ రాజ్యాల మధ్య చేతివృత్తి నిపుణులు, కళాకారుల గణనీయమైన రాకపోకలు ఉండేవి, ఇది ఉమ్మడి సాంస్కృతిక, వాస్తుశిల్ప సంప్రదాయాలకు దోహద పడింది. ఇది ఒక ప్రత్యేక దక్కనీ వాస్తుశిల్ప శైలి అభివృద్ధికి దోహదపడింది. పశ్చిమ, మధ్య ఆసియా, అలాగే తూర్పు ఆఫ్రికాలోని ఇస్లామిక్ సంప్రదాయాల నుండి కూడా అదనపు ప్రభావాలు ఉన్నాయి.



మొదట బీదర్‌లో కనిపించి, ఆ తర్వాత రాజధానులలో అనుకరించబడిన, నీటితో ముడిపడి ఉన్న భారీ, మూడు భాగాలుగా విభజించబడిన రాజభవన నిర్మాణాల ఆవిర్భావం, స్థానిక సంప్రదాయాల ప్రభావానికి నిదర్శనం. తన రాజధానిని బీదర్‌కు మార్చడం ద్వారా, గుల్బర్గాలో ప్రబలంగా ఉన్నట్లు కనిపించే వివిధ ముస్లిం వర్గాల నుండి తన పాలనను దూరం చేసుకోవడానికి అహ్మద్ షా ప్రయత్నించాడు. గతం నుండి ఈ దూరం, తన రాజ్యం నుండి ఒక కొత్త గుర్తింపును సృష్టించాలనే అతని ఉద్దేశం, అతను ఎంచుకున్న కొత్త వాస్తుపరమైన శక్తి-చిహ్నాలలో మరింతగా వ్యక్తమైంది. హిందూ మెజారిటీని పరిపాలిస్తున్న ముస్లిం ఉన్నత వర్గంగా ఉన్న దక్కన్ సుల్తానుల రాజకీయ వాస్తవికవాదాన్ని ఇవి ప్రతిబింబించాయి.

భారతదేశంలో, ముఖ్యంగా దక్కన్ ప్రాంతంలో మధ్యయుగ కాలాన్ని వర్ణించిన చైతన్యవంతమైన విశ్వజనీ నతకు కుతుబ్ షాహీ స్మారక చిహ్నాలు ఒక విశిష్టమైన సాక్ష్యాన్ని అందిస్తాయి. రాజవంశ స్థాపకుడు, ముఖ్య ప్రభువులు ఇరాన్ నుండి వలస వచ్చినవారు కావడం, దక్కనీ ముస్లింలతో, స్థానిక తెలుగు మాట్లాడే హిందూ ఉన్నత వర్గాలతో వారి ఏకీకరణ, ఈ బహుళ జాతి సమాజపు విజయవంతమైన ఏకీకరణ నుండి వెలువడిన పర్షియన్, భారతీయ సంస్కృతుల వినూత్న, స్ఫూర్తిదాయక సమ్మేళనంలో ప్రతిబింబించింది.

**ప్రమాణం (III):** దక్కన్ సుల్తానుల కట్టడాలు సైనిక వాస్తుశిల్పానికి అత్యుత్తమ ఉదాహరణలు. ఇవి అభేద్య రక్షణ యంత్రాంగం, విశిష్టమైన నీటి సరఫరా, పంపిణీ వ్యవస్థ, అలాగే విశిష్టమైన మురుగు నీటి పారుదల యంత్రాంగాలు, అసాధారణమైన ధ్వని వ్యవస్థను కలిగి ఉన్నాయి. ఇవి దక్కన్ వాస్తు చరిత్రలో, దక్షిణ ఆసియా సైనిక వాస్తుశిల్పంలో సాటిలేనివి. బహమనీలు, వారి వారసుల కోటలను వాటి స్థానాన్ని బట్టి సరిహద్దు, ప్రాదేశిక, మహానగర కోటలుగా వర్గీకరించవచ్చు. కోటలు దాదాపు శాశ్వత సైనిక శిబిరాలుగా ఉండేవి. ప్రాకార నగరాలు రక్షణ, ప్రతిష్ఠ కోసం ఉద్దేశించబడ్డాయి. అందువల్ల, వారు ఆకట్టుకునే రాతి కోటలు, రాజభవనాలను నిర్మించారు. తమ ప్రజల ఊహలో తమను దైవిక శక్తి ప్రతినిధులుగా చూపించే ఉత్సవా లను ప్రోత్సహించారు. ఈ ప్రాంతాలలో ఐదు రకాల రాజసభ నిర్మాణాలు నమోదు చేయబడ్డాయి, ఇది తొలి బహమనీ ఉత్సవ పద్ధతులలో ప్రాముఖ్యతలో ఒక వ్యూహంతో కూడిన క్రమశ్రేణిని సూచిస్తుంది. పాలకుడు, అతని ప్రతినిధుల ప్రైవేట్ సముదాయాలు మూడు భాగాలుగా విభజించబడిన ప్రణాళికలు, ముఖ భాగాలతో విలక్షణ కట్టడాలతో గుర్తించబడ్డాయి.

ఈ స్మారక చిహ్నాలు, కోటలు ఆ కాలపు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సాంకేతిక స్వరూపానికి ఒక విశిష్ట సాక్ష్యంగా నిలుస్తాయి. అలాగే, దక్షిణ భారతదేశంలోని ఇస్లామిక్ సుల్తానేట్ మతపరమైన, కళాత్మ క వికాసానికి ఇవి ప్రత్యేకమైన వ్యక్తీకరణలు. ఈ స్మారక చిహ్నాలతో పాటు, కళ, వాస్తుశిల్పం, భాష, సాహి త్యం, సంగీతం, వంటకాలు, వస్త్రధారణ వంటి రంగాలలో సమ్మేళన రూపాలు కూడా అభివృద్ధి చెందాయి. ఈ అభివృద్ధి ఆ కాలపు సూక్ష్మ చిత్రకళ, వాస్తుశిల్పం, షియా సంస్కృతిలో సూక్ష్మంగా కానీ స్పష్టంగా ప్రతిఫలించింది.

ఇప్పటికే పేర్కొన్న దీర్ఘచతురస్రాకార, అర్ధ వంపులు గల మండపాలతో బహమనీ హమామ్‌లకు ఉన్న సన్నిహిత సంబంధాలు, ఈ స్నానశాలలు మరింత అధికారిక విధులను కలిగి ఉండేవని సూచిస్తున్నాయి. ఆ తర్వాత బీదర్, బీజాపూర్‌లో, సాధారణంగా 'పర్షియన్ చక్రం' అని పిలువబడే మరొక పరికరాన్ని ప్రవేశపెట్టి, కొన్ని జలాశయాల వద్ద ఉపయోగించారు. 17వ శతాబ్దంలో బీజాపూర్‌లో మూడో పరికరం కూడా కనుగొన బడింది. ఫౌంటైన్‌లకు అధిక పీడనంతో నీటిని తీసుకురావడానికి ఈ పరికరాన్ని కనుగొన్నారు. 16వ శతాబ్దం ద్వితీయార్ధంలో దక్కన్‌లో, సుదూర ప్రాంతాల నుండి ఒక రాజభవనానికి లేదా నగరానికి నీటిని సరఫరా చేయడానికి మరొక నూతన ఆవిష్కరణ ప్రవేశపెట్టబడింది.



బీజాపుర్, దాని రాజభవనాలు లేదా తోటలకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న జలాశయాలు లేదా సెల యేళ్ల నుండి పాక్షికంగా నీటిని అందించేవారు. 15వ శతాబ్దం వరకు, చెక్కిన రాళ్లతో చేసిన వాస్తు నిర్మాణ చట్రాలలో జలాశయాలను ఏర్పాటు చేసేవారు. ఇరాన్, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన నీటి నిపుణులు, భౌగోళిక, భౌతిక వాస్తవాలను దాదాపు శాస్త్రీయ దృక్పథంతో చూస్తూ నూతన పద్ధతులను ప్రవేశపెట్టారు. ఈ నిపుణులకు పునరుత్పాదక వనరుల నుండి ఎక్కువ నీటిని పొందే అనుభవం అప్పటికే ఉంది. సున్నపు మోర్టార్ వాడకం వల్ల వారు జలనిరోధక ఆనకట్టలను నిర్మించి, సుదూర ప్రాంతాలకు నీటిని రవాణా చేయగలిగారు.

తన వాస్తుశైలిలో విశిష్టమైన చార్మినార్, ఇస్లామిక్ వాస్తుశిల్పంలో ఒక గుర్తింపు పొందిన కళాఖండంగా నిలిచిపోయింది. కుతుబ్ షాహీ వాస్తుశిల్పం బహమనీల పునాదులతో ప్రారంభమై, దక్కనీ నమూనాలో ఒక అధునాతన వాస్తు సౌందర్యంగా పరిణామం చెందింది. ఇది దక్షిణ భారతదేశంలోని ఇస్లామిక్ సుల్తానేట్ వాస్తుశిల్పానికి పరాకాష్టగా నిలిచింది. చార్మినార్ అత్యంత ఆకర్షణీయమైన లక్షణం దాని అపూర్వ రూపకల్పనలోని మౌలికత. ఇది దక్కనీ వాస్తుశిల్పం తదుపరి అభివృద్ధిపై శైలిపరంగా ప్రగాఢ ప్రభావాన్ని చూపింది.



కార్యాచరణ పరంగా, ఇది ఇండో–ఇస్లామిక్ ప్రపంచంలోని ఏ సుపరిచితమైన భవన రకాలకు అనుగుణంగా లేదు, కానీ హైదరాబాద్ కు చెందిన, నాలుగు భాగాలుగా విభజించబడిన నిర్మాణంలో కేంద్ర బిందువుగా పనిచేస్తుంది. చార్మినార్ అనేది నాలుగు ప్రధాన మార్గాల కూడలిని సూచిస్తూ, అద్భుత దృశ్యాల శ్రేణిని అందించే చౌబారా లేదా 'నాలుగు మడతల ఇంటి'కి ఒక నమూనా. ఇది ఒక విశిష్టమైన స్మారక చిహ్నం, ఎందుకంటే ఇది మునుపటి నిర్మాణాలలో కనిపించని ఒక విశిష్టమైన రూపకల్పన, ఆలోచనలను కలిగి ఉంది.

## ప్రామాణికత/సమగ్రతకు సంబంధించిన ప్రకటనలు

సీరియల్ నామినేషన్‌లోని నాలుగు అంశాలు వాటి అసలు రూపాన్ని, రూపకల్పనను చాలా వరకు కాపాడుకున్నాయి. ఈ స్మారక కట్టడాల పరిరక్షణ పనులు 100 ఏళ్లకు పైగా జరిగాయి, అందువల్ల అవి మంచి పరిరక్షణ స్థితిలో ఉన్నాయి, ఉన్నత స్థాయి సమగ్రతను కలిగి ఉన్నాయి. ఈ లక్షణాన్ని ఈ ప్రదేశ సంరక్షణ చూస్తున్న భారత పురావస్తు శాఖ చాలా జాగ్రత్తగా కాపాడింది.

బీదర్, గుల్బర్గాలోని కట్టడాలు, బీజాపుర్‌లోని ప్రధాన స్మారక కట్టడాలు వాటి భౌతిక సమగ్రతను కాపాడు కున్నాయి. వాటి అమరికలు మార్పు లేకుండా ఉన్నాయి. బీజాపుర్‌లోని గోల్ గుంబజ్, నాలుగు వందల ఏళ్లుగా ఉన్నట్లే ఇప్పటికీ నగరంపై ఆధిపత్యం చెలాయిస్తోంది. దీనిని చుట్టుపక్కల ప్రాంతాల నుండి చూడ వచ్చు. దృశ్య ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి, కొనసాగించడానికి వీక్షణలను కాపాడుకోవడం చాలా కీలకం. అన్ని స్మారక కట్టడాల నిర్మాణానికి ప్రధానంగా రాతి, సున్నం, ప్లాస్టరింగ్ సామగ్రిని ఉపయోగించారు. పునరుద్ధరణ కోసం అదే రకమైన సామగ్రిని ఉపయోగించి, కనీస జోక్యంతో వీటిని అలాగే ఉంచారు. అసలు చిత్రాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. పంతొమ్మిదవ శతాబ్దం ప్రారంభం నుండి నమోదు చేయబడిన అనేక చిన్నపాటి నిర్మాణ మరమ్మతులు, సాధారణ నిర్వహణ మినహా, ఈ భవనాలు ఇప్పటికీ వాటి అసలు నిర్మాణ స్వరూపాన్ని, రూపకల్పనను ప్రదర్శిస్తున్నాయి. వాటి భౌతిక నిర్మాణం పరంగా, ఈ భవనాలు సున్నపురాయి, చెక్కిన పరక వంటి సంప్రదాయ నిర్మాణ సామగ్రిని ఉపయోగిస్తాయి.

ఈ వరుస నామినేషన్‌లోని నాలుగు అంశాలు ఏఎస్ఐ, రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో రక్షించబడు తున్నాయి. ప్రస్తుతం పర్యాటక ప్రదేశాలుగా ఉన్నాయి. అనేక మసీదులు, మదర్సాలు స్థానిక సమాజానికి మతపరమైన ప్రదేశాలుగా పనిచేస్తూనే ఉన్నాయి. బీజాపుర్, గుల్బర్గా, బీదర్‌లోని అనేక మసీదులు వాటి అసలైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను, సంబంధిత ఉత్సవాల వినియోగాన్ని నిలబెట్టుకున్నాయి. జాతీయ చట్టం శిప్రాచీన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాలు (సవరణ ఉ ధ్రువీకరణ) చట్టం, 2010ం సంరక్షణ సమయంలో, స్థానికంగా ప్రబలంగా ఉన్న సంప్రదాయ మతపరమైన పద్ధతులను కొనసాగించ డానికి చట్టబద్ధంగా అనుమతిస్తుంది, ఇది వాటి చారిత్రక వినియోగం, పనితీరును నిర్వహించడానికి సహాయ పడుతుంది. ఈ వరుస





నామినేషన్‌లోని నాలుగు అంశాలు దక్షిణ భారతదేశంలోని దక్కన్ పీఠభూమి సమగ్ర భౌగోళిక అమరికలో వాటి అసలైన చారిత్రక ప్రదేశంలో చెక్కుచెదరకుండా ఉన్నాయి.

ప్రాంతీయ స్థాయిలో, దక్కనీ సుల్తానేట్ కాలానికి చెందిన అత్యంత ప్రాతినిధ్య కట్టడాలైన గుల్బర్గా, బీదర్, బీజాపుర్, గోల్కొండలలోని స్మారక చిహ్నాలు ఈ ప్రతిపాదిత 'సీరియల్ ప్రాపర్టీ' (క్రమానుగత వారసత్వ సంపద సమూహం)లో భాగంగా ఉన్నాయి. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ (నిజాం షాహీ), కర్ణాటకలోని బెరార్ ప్రాంతాలకు చెందిన నిర్మాణాలు కూడా ఈ శ్రేణికి సరితూగేవి అయినప్పటికీ, వీటిని ఈ జాబితా నుండి మినహాయించారు. ఎందుకంటే, అహ్మద్‌నగర్‌లోని నిజాం షాహీల కట్టడాలు, కోటలు, రాజభవనాలు, మసీదులు తమ అసలు రూపాన్ని కోల్పోయాయి; అలాగే కర్ణాటకలోని బెరార్ ప్రాంతంలో ఉన్న ఇమాద్ షాహీ కట్టడాలతో పోలిస్తే బీదర్, బీజాపుర్ కట్టడాలు ఆ కాలపు నిర్మాణ శైలికి మరింత మెరుగైన ప్రాతినిధ్యాన్ని వహిస్తాయి.

### ఇతర సారూప్య వారసత్వ సంపదలతో పోలిక

జాతీయ స్థాయిలో ఈ దక్కనీ శ్రేణికి సమకాలీనమైన సుల్తానేట్ కాలపు నిర్మాణాలలో, ఢిల్లీ కేంద్రంగా పాలిం చిన ఐదు ముస్లిం రాజవంశాల (బానిస వంశం 1206-1290; ఖిల్జీ 1290-1320; తుగ్లక్ 1320-1414; సయ్యద్ 1414-45; లోదీ 1451-1526) లతో పాటుగా బెంగాల్ (1336-1576), జౌన్‌పూర్ (1394-1479), మాల్వా (1401-1531), గుజరాత్ (1396-1583), కశ్మీర్ (1346-1589) వంటి ప్రాంతీయ సుల్తానేట్ల నిర్మాణాలు ఉన్నాయి. ఈ సుల్తానేట్ల కట్టడాలలో, ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న వాటితో పోల్చదగినవి ఢిల్లీలోని కుతుబ్ మినార్, గుజరాత్‌లోని చంపనేర్-పావ్‌గఢ్. జాతీయ స్థాయిలో గుర్తించదగిన మొఘల్ కాలపు కట్టడాలలో ఆగ్రాలోని ఎర్రకోట, తాజ్ మహల్, అలాగే ఫతేపూర్ సిక్రి, ఢిల్లీలోని ఎర్రకోట ముఖ్యమైనవి. ఇవి కనుమరుగైన మొఘల్ సామ్రాజ్య నాగరికతకు అద్భుత, పరిపూరకర సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఎర్రకోట మొఘల్ సృజనాత్మకతకు పరాకాష్ఠగా పరిగణించబడుతుంది. ఈ రాజభవన నిర్మాణం ఇస్లామిక్ నమూనాలపై ఆధారపడి ఉన్నప్పటికీ, ఇందులోని ప్రతి భవన భాగం (పెవిలియన్) పర్షియన్, తిమురిడ్, హిందూ సంప్రదాయాల సమ్మేళనంతో కూడిన మొఘల్ నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తుంది.

### అంతర్జాతీయ స్థాయి:

ప్రపంచ వారసత్వ జాబితాలోని పోల్చదగిన ఇస్లామిక్ స్మారక చిహ్నాలు, మధ్యయుగ కాలం నాటి రాజవంశ పరిణామాలతో అనుబంధించబడిన తాత్కాలిక జాబితా: బాల్ఖ్ నగరం (ఆఫ్ఘనిస్తాన్), బాలు హిసార్; మెర్వ్ ఒయాసిస్ నగరాలు, వాటి కోటలు, తుర్క్‌మెనిస్తాన్‌లోని వాటి పట్టణ లేఅవుట్‌లు. అల్బేనియాలోని బెరాట్, గ్జిరోకాస్ట్రా ఒట్టోమన్ కాలం నాటి నిర్మాణ లక్షణానికి అరుదైన ఉదాహరణలుగా ఉన్నాయి; సిరియాలోని అలెప్పో కోటలో మసీదులు, ప్యాలెస్, స్నానపు భవనాల అవశేషాలు ఉన్నాయి. ఇరాన్‌లోని అర్దబిల్‌లో షేక్ సఫీ అల్-దిన్ ఖనేగాహ్, ష్రైన్ వర్గం. ఇరాన్‌లోని సోల్తానియే: మంగోలులచే స్థాపించబడిన ఇల్ఖానిద్ రాజవంశం రాజధాని అయిన సోల్తానియే నగరంలో 1302-12లో ఓల్జయితు సమాధి నిర్మించ బడింది. ఎలాం రాజ్యం పవిత్ర నగరం శిధిలాలతో ఇరాన్‌లోని త్చోఘా జాన్‌బిల్. ఇరాన్‌లోని ఫార్స్ ప్రావిన్స్ (బిషబ్ పూర్, ఫిరౌజాబాద్, సర్వేస్తాన్)లోని హిస్టారికల్ ససానియన్ నగరాల వర్గం. సౌదీ అరేబియాలోని అద్-దిరియాలోని అట్-తురైఫ్ జిల్లా, అనేక రాజభవనాల అవశేషాలు, అద్-దిరియా ఒయాసిస్ అంచున నిర్మించ బడిన పట్టణం వర్గం; బహ్లా, ఒమన్ మధ్యయుగ ఇస్లామిక్ కాలం నాటి పటిష్ఠ ఒయాసిస్ స్థావరం. బంగ్లాదేశ్ లోని చారిత్రాత్మక మసీదు నగరం బాగర్‌హాట్; తట్టా (పాకిస్తాన్)లో అనేక సమాధులు ఉన్నాయి.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఇస్లామిక్ వాస్తుశిల్పం, ప్రణాళిక పరిణామం, అభివృద్ధి, ప్రాంతీయ / ప్రాంతీయ సమ్మేళనాలను గుర్తించే ప్రపంచ వారసత్వ ప్రదేశాల యొక్క పైన పేర్కొన్న పరిధి, ప్రపంచ వారసత్వ జాబితాలో దక్షిణ భారతదేశం నుండి దక్కన్ సుల్తానేట్ అత్యంత ప్రాతినిధ్య, ఉనికిలో ఉన్న ఇస్లామిక్ స్మారక చిహ్నాలను చేర్చవలసిన అవసరాన్ని నిర్ధారిస్తుంది. దక్షిణాసియాలో, 14-18వ శతాబ్దాల నాటి ఇస్లామిక్ వాస్తుశిల్పం మొఘల్ వాస్తుశిల్పంతో ఆధిపత్యం చెలాయించింది. దక్కన్ సుల్తానేట్ సీరియల్ వంటి ఇతర ప్రాంతీయ వివరణలు ఒక ముఖ్యమైన కౌంటర్ కథనాన్ని అందించాయి.

- అనువాదం: ఎన్. వంశీమోహన్
m : 98489 02520
e: vamsiglobal@gmail.com

# బడికి సింగారం బాటసింగారం ప్రాథమిక పాఠశాల టీచర్లు

**"ఉపాధ్యాయులందరు ఒక విషయం గమనించాలి ప్రభుత్వ బడులకు వస్తున్న పేద వర్గాలకు చెందిన పిల్లలు 'టీచర్లకు బోధించే అవకాశాన్ని బోధించే హక్కును కల్పిస్తున్నారు'. తరతరాల వెనుకబాటు తనాన్ని గండి కొట్టే అవకాశం లభిస్తుంది. ఈ మార్పుకు చరిత్రలో ఈ తరగతి గదులు సాక్ష్యం గా నిలిచాయి నిలుస్తాయి. ఇలాంటి అవకాశం ఏ ప్రైవేటు కార్పొరేట్ బడుల టీచర్లకు లభించదు. పేద వర్గాల పిల్లలే మన బడులకు వస్తున్నారనే నిరాశ నుండి బయటపడి ముందు తరాలను గౌరవప్రదమైన జీవితాలను తీర్చిదిద్దే యజ్ఞంలో ఉన్నామని గర్వపడాలి. బాల్యానికి బాసటగా నిలిచి భరోసానివ్వాలి. ఈ యజ్ఞం లో ఉన్న బాటసింగారం ఉపాధ్యాయులను కలిసే అవకాశం కలిగినందుకు కృతజ్ఞతలతో,"**

బడి అంటే భద్రత బడి అంటే విశ్వాసం బడి అంటే సమానత్వం, బడి అంటే భయం లేని స్థలం బడి అంటే ప్రేమ బడి అంటే తెగి పోనీ బంధం ఇవన్నీ సాధ్యమేనా అంటే అవుననే అంటున్నారు బాటసింగారం విద్యా నిపుణులు. టీచర్లు అనకుండా. విద్య నిపుణులు ఎందుకు అంటున్నానంటే టీచర్లు పాఠాలు చెప్తారు, క్రమ శిక్షణ నేర్పుతారు కానీ ఇక్కడ పనిచేస్తున్న టీచర్లు టీచర్ల నిర్వచనాన్ని బడి నిర్వచనాన్ని పునర్నిర్వచించారు. ఈ టీచర్లను కలిసిన ఆనందం అద్భుతం. అందరూ మహిళా టీచర్లే. యాదృచ్ఛికమే కానీ ఇలాంటి పనిచేసే వాతావరణం లో ఎవరైనా ఇలాగే ఉంటారని నా నమ్మకం.



నేను ఉన్న రెండు గంటలలో కొన్ని అద్భుతాలు జరిగాయి. నాకు అవి అద్భుతాలే. బడి వీడి ఉన్నత పాఠశాలలో చదువు తున్న విద్యార్థి టీచర్ల కు తన బడి గురుంచి చెప్పుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయి ఇంటి దగ్గర దుఖంలో ఉన్న తన బిడ్డను ఓదార్చే చోటు తన బిడ్డ ప్రాథమిక స్థాయిలో చదివిన ఊర్లో ఉన్న బడే అని ఒక తల్లి తన బిడ్డను టీచర్ల దగ్గరకు తీసుకొస్తే ప్రధానోపధ్యాయురాలు కనపడగానే ఆ అమ్మాయి దుఃఖం కట్టలు తెంచుకున్నది. వచ్చిన అమ్మాయే కాదు ప్రధాన ఉపాధ్యాయురాలుతో పాటు ఆ టీచర్లు అందరూ దుఃఖంలో మునిగారు. ఈ దృశ్యం ఇంకా కళ్ళలో మెదులుతూనే ఉంది. కొన్ని మంచి మాటలతో ధైర్యం చెప్పిన కొన్ని నిమిషాలలో నే ఆ అమ్మాయి నవ్వుతూ కనిపించింది. తల్లి సంతోషానికి అవధులు లేవు. హాస్పిటల్‌కి అనారోగ్యంతో వచ్చి ఆరోగ్యంగా సంతోషంగా ఇంటికి వెళ్తున్నట్లు అనిపించింది ఆ తల్లీబిడ్డలు ఇంటికి వెళ్ళిన దృశ్యం. ఈ రోజు బడి చేసిన సహాయం మరువగలరా ఆ తల్లి బిడ్డలు. తమ బడిలో ఉన్న ప్రతి బిడ్డ భద్రత ఎంత ముఖ్యమో కొన్ని సంఘటనలు చెప్తూ భావోద్వేగానికి గురయ్యారు టీచర్లు..

అందుకే ఈ టీచర్లు బడి నిర్వచనాన్ని తిరగ రాశారు అనిపించింది. పిల్లలతో గడిపే సమయం పాలనా పనుల వల్ల చాలా సార్లు బోధన చేసే అవకాశం కోల్పోతామని వాళ్ళలో బాధ కనిపించింది. ప్రతి సంవత్సరం పిల్లలను టూర్ తీసుకెళ్లడం ఎన్జీఓలతో సంప్రదించి అదనపు బోధన సామగ్రి ల్యాబ్‌లు సమకూర్చుకోవడంతో పిల్లలలో ఆసక్తి కలిగిస్తున్నారు. అన్నీ బడులలాగే మౌలిక వసతుల సమస్యలు ఈ బడికి ఉన్నాయి. స్థానికంగా ప్రజా ప్రతినిధులతో ఇతర సామాజిక సంస్థలతో వ్యక్తులతో బడి సమస్యలను తీర్చుకోవడంలో చొరవ తీసుకుంటున్నారు. ఇంకా చాలా అవసరాలే ఉన్నాయి. ఇటువంటి బడుల సమస్యలను తీర్చడానికి విద్యాశాఖ ప్రాధాన్యత నివ్వాలి.

ప్రీ స్కూల్ అనుమతి లభించినందుకు సంతోషంలో ఉన్నారు. ప్రీ స్కూల్ గది పెయింటింగ్ వివరాలు టీచర్లకు వదిలేస్తే స్థానిక పిల్లల అవసరాల కనుగుణంగా వేయించుకుందుమన్నారు. మన వ్యవస్థలో అంత స్వేచ్ఛ వాతావరణం లేదని మళ్ళీ వెంటనే అమ్మో ఇస్తే మళ్ళీ అదనపు పని కూడా అనుకున్నారు.

టీచర్ల మీద ప్రభుత్వ బడి మీద ఈ సంవత్సరం జరిగినంత చర్చ మరెప్పుడు జరగలేదు. విద్యా శాఖ మొత్తానికి ప్రతినిధులుగా సమాజంలో ప్రతి రోజు కనిపించేది టీచర్లు. వ్యవస్థ లోపాలు మోసేది టీచర్లే. అనేక ప్రతికూల పరిస్థితులలో పనిచేస్తున్నా కూడా




ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో చివరన ఉన్నందు వలన విధాన నిర్ణయాల జాప్యము విధాన లోపలా వల్ల సమాజంలో టీచర్ల పట్ల సానుకూల దృక్పథ లోపం కనిపిస్తూ ఉంటుంది. ఎవరికి చెప్పుకోలేక చెప్పినా వినే వారు ఉండరని మౌనంగా భరిస్తుంటారనిపించింది.

సానుకూలత ఉన్నా లేకున్నా మడమ తిప్పని ఉపాధ్యాయులు ఉన్నారు కాబట్టే అతి పేద వర్గాలకు ప్రభుత్వ బడి అంటే విశ్వాసం తో ఉన్నారని బాటసింగారం పాఠశాల వెళ్తే అక్కడ పనిచేస్తున్న టీచర్లను కలిస్తే అర్థం అవుతుంది. రాష్ట్రంలో ఇలా చాలా బడులు ఉంటాయి. ఇటువంటి బడులను సందర్శించడం టీచర్లతో మనసు విప్పి మాట్లాడుకోవడం చాలా ముఖ్యం. ఈ టీచర్లతో గడిపినంత సేపు వాళ్ళ బడి పిల్లలకు న్యాయం చేయమనే తపన తప్ప ఒక్క విషయం కూడా టీచర్ల అవసరాల గురించి అడుగలేదు. బడికి గదులకు పేయింట్ వేసి రంగు రంగుల బొమ్మలు ఉంటే మా పిల్లలు సంతోషంగా ఉంటారని, సరిపడ శౌచాలయాలు కావాలని డైనింగ్ హాల్ ఉంటే బాగుంటుందని అడిగారు. విద్యా శాఖ ఇటువంటి పాఠశాలలను గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఎవరైనా దాతలు కూడా ఇటువంటి బడులకు సహాయం చేస్తే బాగుండు అనిపించింది. బడులను మూసివేయడం కాదు ఉన్న వాటిని కాపాడుకోవడం ముఖ్యం అని ప్రభుత్వ పెద్దలు గ్రహించాలి. మా బడి సమస్యలు లేని బడి అని టీచర్లు తల్లి దండ్రులు సమాజం గర్వంగా చెప్పుకునే విధంగా ఉండాలి. చివరగా..

విద్య ద్వారానే విముక్తి అని ఇప్పుడు అతి పేద వర్గాలు కూడా నమ్మి పిల్లలను బడులకు పంపుతున్నారు. మా లాగా మా పిల్లల బ్రతుకులు ఉండొద్దని వారి భవిష్యత్తును కలలు కంటున్నారు. ఆ కలల సాకారం కేవలం మీ లాంటి టీచర్ల వల్లనే సాధ్యం అని నమ్మాలి. బడి అంటే సామాజిక న్యాయం కోసం ఏర్పడిన సంస్థ. ఉపాధ్యాయులందరు ఒక విషయం గమనించాలి ప్రభుత్వ బడులకు వస్తున్న పేద వర్గాలకు చెందిన పిల్లలు 'టీచర్లకు బోధించే అవకాశాన్ని బోధించే హక్కును కల్పిస్తున్నారు'. తరతరాల వెనుకబాటు తనాన్ని గండి కొట్టే అవకాశం లభిస్తుంది. ఈ మార్పుకు చరిత్రలో ఈ తరగతి గదులు సాక్ష్యంగా నిలిచాయి నిలుస్తాయి. ఇలాంటి అవకాశం ఏ ప్రైవేటు కార్పొరేట్ బడుల టీచర్లకు లభించదు, పేద వర్గాల పిల్లలే మన బడులకు వస్తున్నారనే నిరాశ నుండి బయటపడి ముందు తరాలను గౌరవ ప్రదమైన జీవితాలను తీర్చిదిద్దే యజ్ఞంలో ఉన్నామని గర్వపడాలి. బాల్యానికి బాసటగా నిలిచి భరోసా నివ్వాలి. ఈ యజ్ఞంలో ఉన్న బాట సింగారం ఉపాధ్యా యులను కలిసే అవకాశం కలిగినందుకు కృతజ్ఞతలతో.

–ఆర్.వెంకటరెడ్డి
m : +91 9949865516
e : venkatmvf@gmail.com

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన



**పెద్దలు రాసిన పిల్లల కథలు**

**(ఉమ్మడి పది జిల్లాలు)**

10 పుస్తకాల సెట్ ధర రూ.350.
తగ్గింపు ధర రూ.300

**ప్రతులకు**


అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్
నెం.12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
**ఫోన్ : 9030 6262 88**
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com

## తన న్యూక్లియర్ ఫిజిక్స్ పరిశోధనలను క్యాన్సర్ చికిత్సకు మళ్లించిన

# డా. ఎమ్. ఆర్. రాజు

క్యాన్సర్ వ్యాధి చికిత్సకు న్యూక్లియర్ పార్టికల్స్ పరిశోధన మరింత దోహదపడాలని అమెరికాలో శోధించి, తిరిగి వచ్చి తన పుట్టిన గడ్డపై 30 ఏళ్లకు పైగా ఎం.జి.ఎం. ట్రస్టు ద్వారా సేవ చేసిన గాంధేయవాది, ప్రఖ్యాత శాస్త్రవేత్త స్వామి జ్ఞానానంద దగ్గర ఏడు సంవత్సరాలు పరిశోధన చేసి డి.ఎస్సి. పట్టా పొందిన సాధకుడు, రాష్ట్రపతిగా రాణించిన శాస్త్రవేత్త ఎ.పి.జె.అబ్దుల్ కలాం క్లాస్‌మేట్, 2013 సం. పద్మశ్రీ గ్రహీత డాక్టర్ ఎమ్.ఆర్.రాజు.

1931 జులై 15న జన్మించిన రామకృష్ణంరాజు మద్రాసులోని ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఎస్సీ. ఆ తర్వాత ఫిజిక్స్‌లో ఎం.ఎ. చేశారు. పిమ్మట ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్త బి.ఆర్.రావు వద్ద ఎం.ఎస్సీ. (బై రీసెర్చ్) పూర్తిచేసిన తర్వాత, ప్రఖ్యాత న్యూక్లియర్ సైంటిస్ట్ స్వామి జ్ఞానానంద (1896-1969) వద్ద డాక్టర్ ఆఫ్ సైన్స్ పూర్తి చేశారు. తొలుత యోగిగా జీవితాన్ని కొనసాగించి, ఐన్ స్టీన్ సాపేక్షతాసిద్ధాంతం కారణంగా న్యూక్లియర్ సైంటిస్ట్‌గా మారిన జ్ఞానానంద ప్రపంచ విజ్ఞాన చరిత్రలోనే చాలా ప్రత్యేకమైన వ్యక్తి. తండ్రి తర్వాత ఈ పరిశోధక గురువు ప్రభావం రాజు మీద చాలా ఉంది. కనుకనే 1961లో క్యాన్సర్ చికిత్సకు న్యూక్లియర్ పార్టికల్స్ ఏ రకంగా తోడ్పడగలవని పరిశోధన కోసం ముదుండి రామకృష్ణంరాజు అమెరికా వెళ్లారు. అదే సంవత్సరంలో వారికి సుభద్రతో వివాహమైంది. ప్రఖ్యాతమైన మసాచుసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జనరల్ హాస్పిటల్, ఇంకా హార్వర్డ్‌లలో మరింత పరిశోధన చేసి తొలుత పదేళ్లు బర్కిలీలోని లారెన్స్ రేడియేషన్ లేబరేటరీలో జి.హెచ్. లారెన్స్‌తో కలిసి శ్రమించారు. తర్వాత 1971లో లాస్ ఆల్మోస్ నేషనల్ లాబోరేటరీలో బయోఫిజిస్ట్‌గా 23 ఏళ్ల పరిశోధనాజీవితం గడిపారు. 1981లో 3000 మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లలో ఎంపిక చేయబడిన 25 మందిలో ఒకరుగా గుర్తింపు పొందారు. దాదాపు అదే సమయంలో తన ఉద్యోగం చేసే పరిశోధనాశాలలో 'విజ్ఞాన శాస్త్రంలో సృజనాత్మకత' గురించి ప్రఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తితో ప్రసంగం; అటు తర్వాత శాస్త్రవేత్తలతో వారి ముఖాముఖీ సంభాషణ ఏర్పాటు చేసి, విభిన్నమైన చరిత్రకు శ్రీకారం చుట్టారు. దంపతులు ముదుండి సుభద్ర, రామకృష్ణంరాజు మూడు దశాబ్దాలకు పైగా అమెరికా జీవితం గడిపి 1994లో భారతదేశం తిరిగి వచ్చారు.



స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడమే కాకుండా, 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించిన ఘడియలను దుర్గాబాయి దేశముఖ్‌తో కలిసి పంచుకున్న అదృష్టం సుభద్రది. గ్రామీణ ఆరోగ్యం కోసం ఆమె 1976లో మహాత్మా గాంధీ మెమోరియల్ మెడికల్ ట్రస్ట్‌ను పెద్ద అమిరంలో ప్రారంభించి కంటి చూపు, మహిళల సాధారణ ఆరోగ్యం, సర్వికల్ క్యాన్సర్ వంటి సమస్యల పరిష్కారాల పట్ల దృష్టి పెట్టారు. అటు శాస్త్ర ప్రగతి, ఇటు భారతీయ గ్రామీణ ఆరోగ్యం ఈ రెండింటి మధ్య ఉన్న తీవ్రమైన అంతరాన్ని రామకృష్ణంరాజు జీర్ణించుకోలేకపోయారు. మరీ ముఖ్యంగా గ్రామీణ మహిళలు తమ జీవితాలను కుటుంబానికి అర్పించి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడం గమనించి వారు భరించలేక పోయారు. 1994లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని భీమవరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద అమిరం గ్రామంలో ఉన్న ట్రస్టు కార్యక్రమాలను గ్రామీణారోగ్యం, గ్రామీణ విద్య, పల్లె ప్రాంతాల్లో క్యాన్సర్ సమస్య నివారణ వైపుగా మరింత విస్తృత పరిచారు ఈ దంపతులు. తన పరిశోధనతో ముడిపడి ఉన్న సంస్థలు, శాస్త్రవేత్తల సహకారంతో ఎమ్.ఆర్. రాజు దంపతులు 'రూరల్ క్యాన్సర్ సెంటర్' ను 2006 జనవరి 9న అప్పటి రాష్ట్రపతి, ప్రొఫెసర్ ఎ.పి.జె. కలామ్‌తో ప్రారంభింపజేశారు. గ్రామీణ ప్రాంతాలకు రేడియేషన్ చికిత్స, సైన్స్ అండ్ సోషల్ సర్వీస్ వంటి అంశాల మీద శాస్త్రవేత్తలకు అవగాహన కల్పించే రీతిలో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేసిన సదస్సులలో అటమిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్లు అనిల్ కకోద్కర్, శ్రీ కుమార్ బెనర్జీ పాల్గొనడం విశేషం. రూరల్ క్యాన్సర్ సెంటర్ లో నమోదైన 3200 మంది పేషంట్లలో 1400 మంది రేడియేషన్ థెరపీ పొందారు. స్థానిక అధికారులతో తనతో పని చేసిన శాస్త్రవేత్తల సహకారంతో మహాత్మా గాంధీ మెమోరియల్

మెడికల్ ట్రస్ట్ చాలా రకాల సేవలు మూడు దశాబ్దాలుగా చేస్తోంది. కాలిఫోర్నియాలో 20 సంవత్సరాలు దాకా శాస్త్రవేత్తగా పరిశోధన చేసిన విఘ్నేశ విజయ్ కుమార రాజు కొన్ని రోజుల తర్వాత ఈ ట్రస్టు కార్యక్రమాల్లో అంతర్భాగం అయ్యారు. ఇప్పుడు వీరి నిర్వహణలోనే ఈ సంస్థ ప్రస్తుతం పని చేస్తోంది.

వాస్తవాలను ఖాతరు చేయకుండా ఇతరులు చేసిన విమర్శలు, పొగడ్తలు వంటి ట్రాష్ ను గుర్తుపెట్టుకోవడానికి మన మెమరీని వాడుతున్నామని భావించే డాక్టర్ ఎమ్.ఆర్.రాజు అమెరికాలో మూడు దశాబ్దాలకు పైగా జీవనం గడిపినా ఆల్కహాల్ ముట్టలేదు. అంతేకాదు అంతకుముందున్న ధూమపానాన్ని కూడా త్యజించిన సద్గుణాల పోగు ఎం ఆర్. రాజు. న్యూక్లియర్ పార్టికల్స్ వాటి ఉపయోగాలకు సంబంధించిన రేడియేషన్ ఫిజిక్స్, రేడియో బయాలజీ విభాగాలలో 140 పరిశోధనా పత్రాలతో పాటు ఎన్నో సమీక్షా వ్యాసాలు, అధ్యయనాంశాలు రాసిన డా. ఎమ్.ఆర్. రాజు 'హెవీ పార్టికల్ రేడియో థెరపీ' అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అలాగే క్యాన్సర్ సంబంధించి మంచి అవగాహన కలిగించే పుస్తకం ఇంగ్లీషు, తెలుగు భాషల్లో వెలువడి ప్రాచుర్యం పొందింది. పరులకు ఉపయోగపడే పనులు మాత్రమే చేసే తండ్రిని చూసి స్ఫూర్తి పొందిన ముదుండి రామకృష్ణంరాజు తన 94 ఏళ్ల వయసులో భీమవరానికి దగ్గర ఉన్న పెద్ద అమిరం గ్రామంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ మెడికల్ ట్రస్ట్



డాక్టర్ ఎం.ఆర్. రాజు (మధ్యలో), సెల్ఫ్ హెల్ప్ ఇంక్. డైరెక్టర్ దయాన్ స్మోగోర్ (ఎడమవైపు) మరియు చిరకాల స్నేహితురాలు కోనీ పచేకోలతో

భవనంలో తృప్తిగా 2025 జూన్ 24న సేవలో ఐక్యమయ్యారు. పదహారేళ్ళ వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన తన సహచరి సుభద్రారాజు జీవితంలో, సేవాకార్యక్రమాలలో పెద్ద తోడుగా ఉండి అంతకు మూడేళ్ల క్రితం మరణించడం డా.ఎమ్.ఆర్. రాజును తీవ్రంగా కలచి వేసింది.

**– డా. నాగసూరి వేణుగోపాల్,** m : 9440732392
e : venunagasuri@gmail.com

# గురు పూర్ణిమ



జులై 10న

**గు**రు పూర్ణిమ అనేది ఆధ్యాత్మిక మరియు విద్యా గురువులకు అంకితం చేయబడిన ఒక పవిత్రమైన పండుగ. దీనిని హిందూ మాసం ఆషాఢ మాసంలో (జూన్-జూలై) వచ్చే పౌర్ణమి రోజున జరుపుకుంటారు. ఇది అజ్ఞానపు చీకటిని పారద్రోలే 'గురువు'ను గౌరవిస్తుంది. హిందూ, బౌద్ధ, జైన సంప్రదాయాలలోని గంభీరమైన మైలురాళ్లను స్మరించుకుంటుంది. "గురువు" యొక్క అర్థంసంస్కృత పదం 'గురు'కు జీవిత మార్గాన్ని ప్రకాశింపజేసే అంతిమ మార్గదర్శి అని అర్థం. గు: చీకటిని లేదా అజ్ఞానాన్ని సూచిస్తుంది. రు: ఆ చీకటిని తొలగించేవాడిని సూచిస్తుంది. శిష్యుని హృదయంలోని ఆధ్యాత్మిక అజ్ఞానాన్ని తొలగించి, ఆత్మసాక్షాత్కారం వైపు నడిపించే వ్యక్తిగా గురువును భావిస్తారు. సంప్రదాయాల అంతటా ప్రాముఖ్యత గురు పూర్ణిమ అనేది మూడు ప్రధాన మతాలు పంచుకునే కృతజ్ఞత, భక్తితో కూడిన రోజు.

**హిందూమతం:** వ్యాస పౌర్ణమి అని కూడా పిలువబడే ఈ రోజు, నాలుగు వేదాల సంకలనకర్త, మహాభారత రచయిత ఋషి వేద వ్యాసుడిని గౌరవిస్తుంది. ఆది గురువైన (మొదటి గురువు) శివుడు సప్తఋషులకు యోగ రహస్యాలను బోధించడం ప్రారంభించిన రోజుగా కూడా దీనిని జరుపుకుంటారు.

**బౌద్ధమతం:** ఉత్తర ప్రదేశ్‌లోని సారనాథ్‌లో నాలుగు ఆర్య సత్యాలు, అష్టాంగ మార్గాన్ని వివరిస్తూ తన మొట్టమొదటి ఉపన్యాసాన్ని ఇచ్చిన బుద్ధ భగవానుడి గౌరవార్థం బౌద్ధులు ఈ రోజును జరుపుకుంటారు.

**జైనమతం:** భగవాన్ మహావీర్ తన మొదటి శిష్యుడైన గౌతమ స్వామిని చేర్చుకుని, తన ఆధ్యాత్మిక అనుచర వర్గాన్ని స్థాపించిన సందర్భంగా జైనులు ఈ రోజును గుర్తిస్తారు.

**ఎలా పాటిస్తారు:** జీవితంలోని ముఖ్యమైన పాఠాలను నేర్పిన ఉపాధ్యాయులు, మార్గదర్శకులు, తల్లిదండ్రులందరికీ కృతజ్ఞతలు తెలియజేయాల్సిన సమయం.


**ఆధ్యాత్మిక సమావేశాలు:** భక్తులు తమ ఆధ్యాత్మిక గురువుల ఆశీర్వాదం పొందడానికి పూజలో నిమగ్నమవుతారు.

**చాతుర్మాసం:** సన్యాసులు, తపస్వులకు ఈ రోజు చాతుర్మాసం ప్రారంభాన్ని సూచిస్తుంది. ఇది వర్షాకాలంలో నాలుగు నెలల పాటు ఒకే చోట స్థిరపడటం, తీవ్రమైన అధ్యయనం, ధ్యానానికి అంకితం చేయబడిన కాలం.

**– దక్కన్ న్యూస్**

# న్యాయవ్యవస్థ... నైతికతలను ప్రశ్నించే కవితలు

సుప్రీంకోర్టు చరిత్రలోనే అత్యంత సున్నితమైన, సుదీర్ఘమైన కేసు అయోధ్య కేసు. ఈ తీర్పు వెలువరించి ఆ సమస్యకు అంతిమ పరిష్కారాన్ని సుప్రీంకోర్టు దేశానికి ఇచ్చింది. అయితే ఆ తీర్పు తరువాత న్యాయమూర్తులు ఐదుగురు కలిసి ఒకరి చేతులు ఒకరు కలుపుకుంటూ ఓ ఫోటో దిగారు. ఆ తరువాత అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ 'జస్టిస్ ఫర్ జడ్జి' అన్న పుస్తకాన్ని రాశారు. అందులో అయోధ్య తీర్పు వెలువరించిన ఎన్.ఎ.బొబ్డె, డి.వై.చంద్రచూడ్, అశోక్ భూషణ్, ఎస్. అబ్దుల్ నజీర్, రంజన్ గొగోయ్‌లతో పాటు వున్న ఫోటోని ఆ పుస్తకంలో ప్రచురించారు. ఆ ఫోటో దేశంలోని న్యాయకోవిదులని ఆందోళనకి గురిచేసింది. రాజస్తాన్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన శ్రీమతి అంజనా మిశ్రా ఆ ఫోటోపట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తపరుస్తూ 'వైర్' వెబ్ జర్నల్‌లో ఓ ప్రత్యేకమైన వ్యాసాన్ని ప్రచురించారు.




ఆ ఫోటో చూసిన ఓ తెలుగు కవి 'సయోధ్య' అన్న కవితని రాశారు. ఆ ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులు కలసి దిగిన ఓ ఫోటో చుట్టూ ఆ కవిత తిరుగుతుంది. న్యాయవ్యవస్థలో తీర్పు అనేది ఓ రాజ్యాంగ బద్ధమైన విధి నిర్వహణే తప్ప అది ఎవరి వ్యక్తిగత విజయం కాదు. ఆ ఐదుగురు న్యాయమూర్తులు ఉమ్మడి చిత్రం లౌకిక రాజ్యాంగ విలువలకి సరిపోతుందా? అని ప్రశ్నని కవి తన కవితలో సంధిస్తాడు. ప్రతి తీర్పు వారి న్యాయచతురతకు అద్దం పడుతుంది. **'ఒక్క కేసు చాలు'** అన్న కవితా సంపుటిలో వున్న ఈ కవిత ఇలా కొనసాగుతుంది.

*'ఆ ఐదుగురు న్యాయమూర్తుల చిత్రం*
*కలవరపెట్టింది*
*నన్నే కాదు*
*ఎందరినో...*
*ఇది మన రాజ్యాంగ విలువలకు*
*నిజంగా సరిపోతుందా..?*
*తీర్పు తీర్పే కదా!*
*ఉత్తర్వు ఉత్తర్వే కదా!*
*మరి*
*ఉత్సవంలా జరుపుకోవడానికి ఏముందీ*
*అవును... అది*
*దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న వివాదమే!*
*కానీ అదొక్కటే కాదు కదా!*
*అలా పెండింగ్‌లో లక్షా తొంభై కేసులు*
*వున్నాయి కదా..?*
*మరి ఉత్సవం ఎందుకు..?*
*అదేమన్నా*
*న్యాయమూర్తుల వ్యక్తిగత విజయమా?*
*న్యాయమూర్తికి ప్రతి తీర్పు వేడుకే*
*ప్రతి ఉత్తర్వూ వాళ్ళ న్యాయచతురతకు దర్పణమే!*
*ఓ తీర్పుని వేడుక చేసుకోవడం*
*ఒక వినోదంలా కన్పిస్తుంది.*
*పూర్వ భావనలు వున్నట్టు అన్పిస్తుంది.*
*అది చిత్రం కాదు*
*ఒక విచిత్రం..!'*

దేశంలో లక్షలాది కేసులు పెండింగ్‌లో వున్నప్పుడు ఒక నిర్దిష్టమైన వివాద పరిష్కారాన్ని మాత్రమే 'ఉత్సవం'లా జరుపుకోవడాన్ని కవి ప్రశ్నిస్తాడు. ఇది దేనికి సంకేతం అని నిలదీస్తాడు.

న్యాయదేవత కళ్ళకు గంతలు నిష్పాక్షితకు ప్రతీక. కానీ తీర్పును ఒక వ్యక్తిగత విజయంగానో, వేడుకగానో మార్చడం 'చిత్రం కాదు, ఒక విచిత్రం' అంటూ కవి చేసిన కవితా వ్యాఖ్య న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తిపై ఆందోళనను వ్యక్తపరుస్తుంది.

## తీర్పరి ప్రేరణ

అప్పటి (2024) భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ న్యాయ మూర్తులను ఉద్దేశిస్తూ చేసిన ప్రసంగంలో దేవాలయాల 'ధ్వజస్తంభం' నుండి స్ఫూర్తి పొందాలని మాట్లాడుతారు. ఆ వ్యాఖ్యలను ఆక్షేపిస్తూ రాసిన కవిత **'తీర్పరి ప్రేరణ'.**

లిఖిత రాజ్యాంగం వున్న లౌకిక దేశంలో రాజ్యాంగంలోని ప్రవేశిక మాత్రమే స్ఫూర్తి కావాలి. కానీ మతపరమైన ధ్వజస్తంభాలు కాదు. మతాన్ని **'తీర్పరి ప్రేరణ'** కవిత హెచ్చరిస్తుంది. ఆ కవిత ఇలా కొనసాగుతుంది.

*'ధ్వజస్తంభం మిమ్మల్ని*
*ఎంతగానో ప్రేరేపించి వుండొచ్చు.*
*గొప్ప దేవాలయాల నుండే కాదు*
*ధ్వజస్తంభాల నుంచి కాదు*
*తీర్పరి ప్రవేశిక నుంచి కదా స్ఫూర్తి పొందాలి.*

ధ్వజస్తంబం నుంచి స్ఫూర్తి పొందాలని
అనడం వల్ల
ప్రజల విశ్వాసం పెరుగుతుందా
తరుగుతుందా
'ధ్వజం' నుంచి మనం
స్ఫూర్తి పొందాలని అన్నారు
ఇంతకి
'మనం' అంటే ఎవరు..?
మెజారిటీ ప్రజలా..?
మైనారిటీ ప్రజలా..?
చాలా మంది 'మెజారిటీ' ప్రజలకి
ఇప్పటికీ
దేవాలయాల్లోకి ప్రవేశం లేదు కదా
వాళ్ళు ధ్వజాన్ని ఎక్కడ చూస్తారు.
లౌకిక దేశంలో
లిఖిత రాజ్యాంగం వున్న దేశంలో
ప్రవేశిక నుంచి కదా
రాజ్యాంగం నుంచి కదా
స్ఫూర్తిని పొందాలి
ఎటు ప్రయాణం చేయమంటున్నారో
తెలియన సందిగ్ధ స్థితి
ఇది ధ్వజమా..
ధ్వజమెత్తడమా..!!'

లిఖిత రాజ్యాంగం వున్న లౌకిక దేశంలో ప్రవేశిక, రాజ్యాంగం మాత్రమే స్ఫూర్తి కావాలి. మతపరమైన ధ్వజస్తంభాలు కాదు. దాని వల్ల సమాజంలో అశాంతి, అభద్రత కలిగిస్తుందని ఈ కవిత హెచ్చరిస్తుంది.

'మనం' అంటే ఎవరు? అన్న ప్రశ్న చాలా నిశితమైనది. భారతదేశంలో ఇప్పటికీ ఎందరో మెజారిటీ దళిత, బహుజన ప్రజలకు దేవాలయాల్లో ప్రవేశం లేదు. ఈ సామాజిక వాస్తవాన్ని కవి ఈ కవితలో గుర్తు చేస్తారు.

ధ్వజం నుండి స్ఫూర్తి పొందడం అంటే.. అది ధర్మధ్వజమా లేక భిన్నాభిప్రాయాలపై 'ధ్వజమెత్తడమా' అన్న శ్లేషతో ఈ దేశ ప్రయాణం ఎటువైపు సాగుతుందోనన్న భయాందోళనలని కవి వ్యక్తపరిచాడు.

### దైవత్వపు ముసుగులో పరిష్కారం

అయోధ్య వివాదంలో దేవుడే తనకు దారి చూపించాడంటూ అక్టోబర్ 2024లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై సంధించిన వ్యంగ్యాస్త్రం కవి రాసిన మూడవ కవిత **'పరిష్కారం'**. ఆ కవిత ఇలా కొనసాగుతుంది.

దేవుడు
దారి చూపి పరిష్కారాలు
మనతో చేయిస్తాడు
ఆ దేవుడే పదవులను కూడా ఇస్తాడు.
అవును కొన్ని సార్లు
శాసనం చెయ్యలేని పనులని
దేవుడు మనతో చేయిస్తాడు.
అవి తీర్పులు కావొచ్చు
పదవులు తీసుకోవడం కావొచ్చు
ఇంతకీ ఆ దేవుడెవరు..?

కొన్నిసార్లు శాసనం చెయ్యలేని పనులని దేవుడు మనతో చేయిస్తాడు అనే తర్కం ప్రమాదకరమైనది. న్యాయమూర్తులు దైవనిర్ణయాల ప్రకారం కాకుండా, రాజ్యాంగ నిబంధనలు సాక్ష్యాధారాల ఆధారంగానే తీర్పులు చెప్పాలి.



### ఆ దేవుడెవరు..?

దేవుడే తీర్పులు చెప్పిస్తాడు, దేవుడే పదవులని ఇస్తాడు. ఇంతకీ ఆ తీర్పుల వెనుక పదవుల వెనుక వున్న ఆ అసలైన దేవుడెవరు? అన్న ఒక నిగూఢమైన, శక్తివంతమైన ప్రశ్నతో ఈ కవిత ముగుస్తుంది. ఈ క్విడ్‌ప్రోకో విధానాలను ఎవరికి వారే ఊహించుకోవాల్సి వుంటుంది.

ఈ మూడు కవితలు కేవలం సమకాలీన పరిణామాలపై రాసినవి మాత్రమే కాదు. ఇవి న్యాయవ్యవస్థ ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరే హెచ్చరికలు. తీర్పులు వేడుకలుగా మారినప్పుడు లౌకితత్వం కంటే మత సంకేతాలకు ప్రాధాన్యత పెరిగినప్పుడు రాజ్యాంగ నైతికత స్థానంలో దైవిక ప్రేరణలు చోటు చేసుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఈ కవితలు స్పష్టం చేస్తున్నాయి.

అత్యున్నత పీఠాల మీద వున్నవారు రాజ్యాంగానికి మాత్రమే జవాబుదారిగా వుండాలి.

**-డా॥ మంగారి రాజేందర్ (జింబో)**
m : 9440483001
e : rajenderzimbo@gmail.com



బెక్కెం త్రికూటాలయం

# పండితారాధ్య మల్లికార్జునుని ప్రస్థాన స్థానం బెక్కెం

బెక్కెం వనపర్తి జిల్లా చిన్నంబావి మండల గ్రామం. నేలబిల్కు, పెద్దబిల్కు, గొల్ల గూడెం అనే మూడు గ్రామాలు కలిసి ఏర్పడ్డ పెద్ద గ్రామం బెక్కెం.

**బెక్కెం:** ఈ గ్రామ పూర్వనామం నరసింగయ్యపల్లె. పూర్వం ఈ గ్రామంలో బిడాల నారసింహ్మ ఆలయం ఉండేదట అందుకే నరసింగయ్యపల్లె అని గ్రామం పేరు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ఊరికి బెక్కెం అనే పేరు రావడానికి స్థానికులు ఒక కథ చెప్తారు. అక్కడి తాటివనంలోని పుట్ట మీద ఒక ఆవు పాలు కురిపిస్తుంటే పిల్లి ఆ పాలు తాగడం చూసినవారు పుట్టను తవ్విచూస్తే శివలింగం బయటపడ్డది. ఆ లింగానికే 'బెక్కేశ్వరుడ'ని పేరుపెట్టి పూజించారు. అక్కడొక శివాలయం నిర్మించారు. బెక్కేశ్వరుడున్న నరసింగయపల్లె బెక్కెం అయింది. కన్నడంలో బెక్కు అంటే పిల్లి అని అర్థం. ఈ గ్రామాలు శ్రీశైలం ప్రాజెక్టు ముంపుప్రాంతాలై నీటిలో మునిగిపోతే అవే పేర్లతో కొత్తగ్రామాలను ఒడ్డున కట్టుకున్నారు గ్రామస్తులు. ప్రాచీన గ్రామంలో జనమేజయ ప్రతిష్ఠగ చెప్పబడే శివ కేశవాలయాలు, చెన్నకేశవాలయం ఉండేది.



బెక్కేశ్వరి

నరసింగయ్యపల్లెనే బెక్కెం అయింది. చెరువు తవ్వించబడ్డది. కాలాంతరంలో కాశినుంచి రెండు లింగాలు తెప్పించి, మోక్షేశ్వరుడని, సాక్షీశ్వరుడని బెక్కేశ్వరుని జతలో ప్రతిష్ఠించి, మూడు ఆలయాలకు విమానగోపురం కట్టించారని అందువల్ల త్రికూటాలయ మయిందని, ఈ బెక్కెంకు అటు, ఇటు కపిలేశ్వరం, మల్లేశ్వరం, సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, సోమేశ్వరం అనే పంచేశ్వరాలున్నాయి కాబట్టి ఇది కూడా బెక్కేశ్వరం. బెక్కేశ్వర త్రికూటం ముందు పుష్కరిణి ఉంది.

**పండితారాధ్య మల్లికార్జునుని ప్రస్థానం:**

పండితారాధ్యుడు పానుగంటిలో ఉదయన మహారాజు శివభక్తుణ్ణి అవమానించినందుకు అతనిని శపించి, అక్కడ ఉండలేక, బసవేశ్వరుని సేవించి, శ్రీశైలాన్ని దర్శించటానికి బయలుదేరి 'వనిపురం' (వనపర్తి) చేరారు. అక్కడికి చేరేనాటికి బసవేశ్వరుడు లింగైక్యం చెందాడని తెలిసి మల్లికార్జునుడు దుఃఖపడ్డాడు. తనవెంట ఈ ప్రాంతం వారు గంగాపురం బసవయ్య, మియాపురం సత్తెమ్మ, వనిపురి శంకరయ్య, వెల్లగొండ మహదేవయ్యలు ఉన్నారు. బాధపడుతున్న పండితుణ్ణి మహదేవయ్య తమ గ్రామానికి కొనిపోయాడు. శ్రీశైలానికి ప్రయాణమైన మల్లికార్జున పండితారాధ్యుడు బెక్కెం సమీప గ్రామం వెలటూరు చేరేవరకు శ్రీశైలం తనకు లింగంగా దర్శనమిచ్చింది. దానితో తానా కొండపై పాదం మోపనని, అక్కడే వుండిపోయి తన శిష్యుడు దోనమయ్యను శ్రీశైలం వెళ్ళి మొక్కులు చెల్లించి రమ్మన్నాడు. ఈ మధ్య గడువులో పండితునికి బెక్కెంవాసి శాంతరామయ్య అనే మహేశ్వరునితో పరిచయం ఏర్పడింది. శాంతరామయ్య ఆహ్వానాన్ని మన్నించి బెక్కెం చేరాడు మల్లికార్జునుడు. సమీపంలోని గొల్లగూడెంలో నెలకొనివున్న మూక(11)గుళ్ళను దర్శించాడు. గ్రామం వెలుపల పండితుడు తన కుటుంబంతో సహా నివాసం ఏర్పరచుకున్నాడు. సా.శ. 1170 కాలంలో అక్కడే శివైక్యం చెందిన పిదప పండితారాధ్యునికి సమాధి చేసారు. శాంతరామయ్య మొదలైన శిష్యులు అతని కొడుకు కేదారయ్యకు పీఠాభిషేకం చేసారు. ఆ సమాధిని 'మల్లెదేవర' సమాధి అని పిలుస్తారు బెక్కెం ప్రజలు.


బెక్క శాసనం


బెక్కేశ్వరి


మల్లన్న దేవుడు


సప్తమాతృకలు


గజలక్ష్మి


నాగ శిలలు

**మఠం రామయ్య:**

పండితారాధ్యుణ్ణి బెక్కెంకు తీసుకొచ్చిన శాంతరామయ్య. (మఠం రామయ్య) తన జీవితకాలంలో ఎన్నెన్నో మహిమలు చూపించారు. రామయ్య తన జీవిత చరమాంకంలో సజీవ సమాధిని పొందారు. అతనిని నదీ తీర శివాలయప్రాంగణంలోనే సమాధి చేసారు. ప్రతియేట మార్గశిర మాస శుద్ధ పాడ్యమి రోజు నందికోల సేవ, రథోత్సవం జాతర చేస్తారు ప్రజలు. నూతన గ్రామాలు రూపొందిన తరువాత బెక్కెం,పెద్ద దగడలో వీరి పేర ఆలయాలు నిర్మించారు. (కపిలవాయి లింగమూర్తిగారు– బిక్కవోయిన బెక్కెం కథ, భారతి)

పాలకుర్తి సోమన్న రాసిన 'పండితారాధ్య చరిత్ర'లోని కథాంశానికి, కపిలవాయి రాసిన విషయం సమానంగా ఉంది. అందువల్ల మల్లికార్జున పండితారాధ్యుని ప్రస్థానక్షేత్రం బెక్కెమేనని నిర్ధారించవచ్చు.

**కైఫీయతు:**

బెక్కెం కృష్ణానది ఒడ్డున ఉన్న ప్రాచీనగ్రామం. ఒకప్పుడు కృష్ణా, భీమా, తుంగభద్ర నదీతీరాలలోని కొన్ని గణతంత్ర రాజ్యాలు నందరాజులకు విధేయంగా వుండేవట. బెక్కెం కూడా గణతంత్రరాజ్యంగా వుండేదని తెలుస్తున్నది. 'బిక్కు' పదం బౌద్ధధర్మ భిక్షుస్థానం సూచిస్తుందనే అభిప్రాయంతో సాతవాహనుల కాలంలో బెక్కెం బౌద్ధారామ విహారంగా, వర్తక, వాణిజ్య కేంద్రంగా వుండేదన్నారు చరిత్రకారులు.(మహబూబ్ నగర జిల్లా సర్వస్వం–బి.యన్ శాస్త్రి)

**చారిత్రక ఆధారాలు:**

త్రైలోక్యమల్ల 1వ సోమేశ్వరుడు పాలకుడుగా ఉన్నపుడు కేతరస, రాజరసలనే వారు క్రీ.శ.1065 జూలై 11న బెక్కేశ్వరుని అర్చనాదులకు... ళప్ప కాశ్మీరపండితునికి ధారాపూర్వకంగా 2 మర్తురుల గద్దె భూదానం చేసారు.

(మహబూబునగర్ శాసన సంపుటి–1, సం.76,పే.120)

బెక్కెం సంపన్నంగా వున్న కాలంలో కోట,పేట అనే రెండు భాగాలుగా పేరుపొందింది. కోటకు పది బురుజులుండేవి. జొన్నల బురుజు వద్ద రామమందిరం, తమిదల బురుజు వద్ద శ్రీసీతారామాంజనేయ గ్రంథాలయం, అరకల బురుజువద్ద పెద్దమ్మ గుడి, ఈశాన్యం బురుజు వద్ద కోట మైసమ్మ గుడి వున్నాయి.

త్రిభువనమల్లుని సామంతుడు బిజ్జరసు ఇక్కడి నుండే పాలించాడని ఒక కథనం. ఇతడు బర్హివాహన వంశీయుడని, జీమూతవాహన వంశీయుడని అంటారు. ఇతని పేరు మీదున్న బిజ్జనపల్లి నాగర్ కర్నూలు జిల్లాలో ఒక మండలం. బిజ్జరసును 'ఉదగార' పోషణుడంటారు. ఉదకారులంటే నీటిపారుదల ఉద్యోగులై వుండవచ్చు. వారికి అధిపతి బిజ్జరసుడై వుంటాడు. కళ్యాణీచాళుక్య రాజు త్రిభువనమల్లదేవుని సామంతుడు బిజ్జరస ఆలంపురంలో వేయించిన దాన శాసనంలో 'బెక్కువద' అని బెక్కెం ప్రస్తావించబడ్డది.

**బెక్కెం గుళ్ళు:**

ప్రస్తుతం బెక్కెం చెరువులో ఒక త్రికూటాలయం కనిపిస్తున్నది. దేవాలయంలో మూడు గుడుల ద్వారాలకు రెండువైపుల ఇద్దరిద్దరు శైవద్వార పాలకులు త్రిశూలం, సర్పసహిత ఢమరుకం, గదలు, అభయహస్తాలతో ఉన్నారు. దేవాలయ ద్వారపతంగం మీద ఏనుగులు అభిషేకిస్తున్న దేవత గజలక్ష్మి ఉన్నది. గుడిలోని స్తంభాలు రాష్ట్రకూట, ఎర్లీ చాళుక్యశైలిలో వున్నాయి. కీర్తిముఖాల కుడులతో, లతలతో, ముత్యాలసరాలతో అలంకరించబడి వున్నాయి. ఈ స్తంభాలకు పైన పోలికలు లేవు. ఇది రాష్ట్రకూటశైలి.

ఒక గర్భాలయంలో అడుగున్నర ఎత్తైన వేదికవంటి పానవట్టంలో ఛత్రోపరితల శిరోవర్తన సమలింగం ప్రతిష్ఠబడి వుంది. మరొక గర్భగుడిలో క్షితిజసమాంతరంగా ఉన్న పానవట్టంలో అమర్చిన శివలింగం లక్షణోద్ధారరేఖతో కనిపిస్తున్నది. ప్రధాన గర్భగుడిలో శివలింగం మిగిలిన రెండు లింగాలకన్నా పాతది, పెద్దదిగా కనిపిస్తున్నది. లింగం ఒక వైపు ఉబ్బెత్తుగా ఉంటుంది.దానిని కొప్పుగా(జట) భావిస్తారు స్థానికులు.

త్రికూటంలోని ప్రతి గర్భాలయానికి ఎదురుగా నంది శిల్పాలున్నాయి. బాదామీ చాళుక్య శైలిలో ఒకటి, చాళుక్యశైలిలో ఒకటి నందులు వేర్వేరు కాలాలకు చెందినవి. ఒక నంది మెడగంటల కింద శివలింగం ఉండడం ప్రత్యేకం.అక్కడి తూర్పు ముఖ ద్వారమున్న శివాలయ కుడ్యానికానుకొని సప్తమాతృకల శిల్పఫలకం భిన్నమైనది రాష్ట్రకూటశైలిలో ఉంది.

**బెక్కేశ్వరి:**

దేవాలయం గోడలో గూటివంటిచోట పద్మంలో, ఉత్కుటాసన భంగిమలో కూర్చొని ఉన్న ద్విభుజి, కుడిచేతిలో తామరపుష్పంతో కనిపిస్తున్న దేవతకు కుడిపక్క వింజామరతో పరిచారిక ఉన్నది. ఆమె


బెక్కెం గణపతి


శైవ ద్వారపాలకులు


వీరగల్లులు


బెక్కెం నందులు



బెక్కం పుష్కరిణి



బెక్కం నదీతీరం



బెక్కం లింగాలు

పార్వతి దేవత. ఈ దేవత కింద మార్జాలవాహనం మీద అర్ధపద్మాసనంలో కూర్చున్న దేవత మార్జాలముఖంతోనే కనిపిస్తున్నది. ఆమె కుడిచేతిలో గదవంటి ఆయుధం అగుపిస్తున్నది. ఒకే విగ్రహంలో ఇద్దరు దేవతలుండడం అరుదు. మార్జాలవాహిని చతుష్షష్టి యోగినులలో ఒకతె అనిపిస్తుంది. బెక్కు(పిల్లి)రూపంలోని ఈ దేవత కారణంగానే బెక్కంకు ఆ పేరు వచ్చింది. శివాలయంలోని శివుడు బెక్కేశ్వరుడని,ఈ దేవత బెక్కేశ్వరిగా పిలువబడుతున్నారు.

**బెక్కంలో మరిన్ని శిల్పాలు, ఆలయాలు:**

ఈ త్రికూటాలయానికి సమీపంలో పుష్కరిణి ఉంది. స్థానికంగా లభించే పలకరాళ్ళతో కట్టిన ఈ పుష్కరిణి వేయేండ్ల నాటిది. శిథిలావస్థలో ఉన్నది. గుడిగోడలకు ఆనించిపెట్టిన నాగశిల్పాలు ఉన్నాయి. గుడి వెలుపల ఒక బాదామీచాళుక్య శైలిలో చెక్కిన ఎత్తైన ఇసికరాతి శివలింగం ఉంది. దీనికి బ్రహ్మ, రుద్రభాగాలు రెండేవున్నాయి.

నేటి గ్రామ నందగోపాల యాదవ సంఘ భవనం ప్రాంగణంలో అరుగు పై ఉన్న ఎరుపురంగు ఇసికరాతిలో చెక్కిన గంటలనంది బాదామీచాళుక్యుల శైలిలో వుంది.ఇక్కడే ప్రతిష్ఠించి ఉన్న జంట శిల్పాలను స్థానికులు మల్లమ్మ, మల్లన్న దేవులుగా కొలుస్తుంటారు. అందులోని స్త్రీమూర్తిశిల్పం పరహస్తాలలో ఢమరుకం, త్రిశూలం, ముందుచేతుల్లో ఖడ్గం, రక్తపాత్రలతో ఉన్న లక్షణాలను బట్టి చాముండి దేవత. రెండవది అవే ప్రతిమా లక్షణాలతో కనిపించే పురుషమూర్తి శిల్పం. నల్లగొండ జిల్లా శాసనాలలో ప్రచురించబడివున్న కాకతీయుల కాలపు నడిగూడెం శాసనంలో 'మైలారదేవుని' ప్రతిమాలక్షణం వివరించబడ్డది. దాని ప్రకారం ఈ శిల్పం మైలారుదేవుడు లేదా మల్లన్న శిల్పమే. స్థానిక ప్రజలు కూడా మల్లన్నదేవునిగానే పూజిస్తున్నారు. ఇటువంటి శిల్పాలు కాకతీయుల కాలంలో ఎక్కువగా అగుపిస్తాయి. ఈ జంట శిల్పాలు కాకతీయశైలిలో ఉన్నాయి.వీటిని నీటిమునకకు గురైన ప్రాచీన బెక్కం మల్లెదేవరబావి దగ్గర నుండి తెచ్చి ఇక్కడ భద్రపరిచారు స్థానికులు.

నేటి బెక్కం గ్రామంలో 20 సంవత్సరాల క్రితం రామలింగేశ్వర స్వామి ఆలయం కట్టించారు. ఆ ఆలయం వెలుపల ఉంచిన విగ్రహం గణపతి చతుర్భుజుడు. పరహస్తాలలో ఢమరుకం, త్రిశూలాలు, ముందు కుడిచేతిలో విరిగిన దంతం, ఎడమచేతిలో తొండంతో తీసుకుంటున్న కుడుము ఉన్నాయి. 9, 10 శతాబ్దాల శిల్పశైలి.

చెరువు కట్ట దగ్గర చౌడేశ్వరి దేవి ఆలయం ఉంది.తొగటవీర క్షత్రియులు ప్రతి సంవత్సరం అమ్మవారికి ఉత్సవాలు చేస్తారు.

**వీరగల్లులు:**

నీటి మునకకు గురైన ప్రాచీన గ్రామంలో, నేటి గ్రామంలోని వివిధ గుడి ప్రాంగణాలలో వేర్వేరు కాలాలకు చెందినవి. వీరగల్లులు అనేకం ఉన్నాయి. ఒక వీరగల్లులో వీరుడు బల్లెంపట్టుకుని డాకాలు మోపి, యుద్ధరంగంలో ఉన్నట్టు కనపడుతున్నాడు. తలవెనక దూసుడుముడితో సిగ, చెవులకు కుండలాలతో ఉన్న ఆహార్యాన్నిబట్టి ఇతడు కాకతీయశైలి వీరుడు. ఇది ఇతని స్మారకశిల. రెండవ వీరగల్లులో స్త్రీ, పురుషులిద్దరున్నారు. స్త్రీ కుడిచేతిని పైకెత్తి అరచేయిని చూపిస్తున్నది. ఎడమచేతిలో జలపాత్రను ధరించింది. అలంకార భూషితురాలై వున్నది. పక్కన పురుషుడు రెండుచేతుల్లో కత్తులు ధరించాడు. కుడిచేతిలోని కత్తిమొన నేలవైపున్నది. ఎడమచేతిలోని కత్తితో ప్రహారం చేస్తున్నట్టు న్నాడు. డాకాలు ముందుమోపి, నిల్చున్నాడు. నడినెత్తిన సిగ, మెడలో కంటె వుంది. హస్తభూషణాలు, కాళ్ళకు కడియాలున్నాయి. స్త్రీ యుద్ధంలో మరణించిన వీరపతితో ప్రాణత్యాగం చేసింది. అందువల్ల ఇది సతిశిల. సతిశిలలు అరుదైనవి. వైవిధ్యభరితమైనవి. రాజవంశాల చరిత్రకు సమాంతర చరిత్ర వీరగల్లులది.

**ఇటీవలి బెక్కం చరిత్ర:**

ఆయా రాజవంశాల అనంతరం ఈ గ్రామం జటప్రోలు సంస్థానాధీశుల ఏలుబడిలోకి వచ్చింది. ఈ గ్రామం ఒకప్పుడు రాజధాని. సురభి మాధవరాయల కుమారుడు తిరుమలరావు ఈ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని పెద్ద సోదరుడైన నారాయణరావుకు సంస్థాన పాలనా బాధ్యతలలో తోడుగా ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రాచీన బెక్కం గ్రామం అన్ని కులాలకు,వృత్తులకు చెందిన నిపుణులు, నిష్ణాతులు, అసామాన్యులకు నిలయం.

బ్రాహ్మణులలో జోస్యం, పత్రి, ప్రతాపగిరివారు చెప్పదగిన వారు. వీరిలో కవి, పండితులు, జ్యోతిష్కులున్నారు. క్షత్రియులలో కొత్త, చల్లకొండ, జూపెల్లి, రంగినేని అనే వెలమ కుటుంబాలు ప్రసిద్ధం. జూపెల్లివారు ఆయా కాలాల్లో సేనాపతులుగా వున్నట్లు తెలుస్తుంది.

కృష్ణానది తీరంలో ఉన్న ప్రాచీన బెక్కం చరిత్ర తెలుసుకోవడానికి ప్రయత్నించినపుడు ప్రస్తుత గ్రామంలో లభిస్తున్న బాదామి చాళుక్యుల, రాష్ట్రకూటుల, కళ్యాణి చాళుక్యుల, కాకతీయుల, విజయనగరరాజుల కాలం నాటి శిల్పాలు, శాసనాలు, కట్టడాలు, స్థానికుల కథనాలు మాత్రమే తెలుసుకోగలుగుతున్నాం, చరిత్రకు అందని, లిఖించబడని మరెంతో చరిత్ర నదీగర్భంలో, కాలగర్భంలో కలిసిపోయిందని చెప్పక తప్పదు.

**ధన్యవాదాలు:** ఈ వ్యాసరచనలో ఉపయుక్తమైన కపిలవాయి లింగమూర్తి గారి రచనలు 'పాలమూరు దేవాలయాలు, బిక్కవోయిన బెక్కం కథ(భారతి)లకు క్షేత్రపరిశోధన, విషయ సేకరణ, రచనలో తోడ్పడిన కొత్త తెలంగాణ చరిత్రబృందం పరిశోధకులు **బైరోజు చంద్రశేఖర్, డా. బైరోజు శ్యామసుందర్** గార్లకు.

– శ్రీరామోజు హరగోపాల్,

m : 99494 98698

e: akshara25@gmail.com



సిధ హారీతీపుతస కుమారస అక(కు)సిరి మితస ఐం దఖ మితం

# సీతమ్మలొద్ది ప్రాముఖ్యత

## శిలా చిత్రాలు మరియు శాసనాలు

సీతమ్మలొద్ది తెలంగాణలోని ఒక ముఖ్యమైన పురావస్తు ప్రదేశం. వేల సంవత్సరాల నాటి పురాతన రాతి చిత్రాలు మరియు శాసనాలతో ఇది ప్రత్యేకతను సంతరించుకుంది.

ఈ ప్రదేశం తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో గల గట్టుసింగారం అడవిలోని ఒక కొండపై ఉంది. ఈ ప్రదేశం 2024లో వెలుగులోకి వచ్చింది. ఇందులో 1000 అడుగుల పొడవు, 50 అడుగుల ఎత్తు గల ఒక పెద్ద శిలాఆశ్రయం (రాక్ షెల్టర్) ఉంది. స్థానిక సంప్రదాయం ప్రకారం, ఈ రాతి ఆశ్రయం అనేక తరాలుగా సీతమ్మలొద్దిగా ప్రసిద్ధి చెందింది.

ఈ రాతి ఆశ్రయం గోడలపై చిత్రాలు మరియు చెక్కడాలు రెండూ ఉన్నాయి. ఇవి ప్రాచీన శిలాయుగం నుండి చారిత్రక కాలం నాటివి. ఈ చిత్రాలలో ఒకదానిపై ఒకటి చిత్రించినవి కూడా ఉండటం వలన, ఈ ప్రదేశంలో సాంస్కృతిక క్రమం కొనసాగిందని ఇవన్నీ తెలియజేస్తాయి. ఈ చిత్రాలను ప్రధానంగా ఎరుపు రంగులతో వేశారు; తెలుపు మరియు పసుపు రంగులను కూడా ఉపయోగించారు. ఈ ఆశ్రయంలో చెక్కిన చిత్రాలతో పాటు, సుమారు పన్నెండు వందలకు పైగా రంగులతో వేసిన చిత్రాలు ఉన్నాయి. ఈ చిత్రాలలోని విషయాలు మానవులు, జంతువులు, డిజైన్లు మరియు బ్రాహ్మీ శాసనాలతో విభిన్నంగా ఉన్నాయి.

ఈ చిత్రాలలో నిలబడి విల్లు బాణాలు పట్టుకున్న, నాట్యం చేస్తున్న మానవ రూపాలు, మూపురం ఉన్న ఎద్దులు, అడవి పిల్లి, నక్క, జింక, కృష్ణజింక, బబూన్లు, కోతులు, ఉడుములు, తాబేళ్లు, తేనెగూళ్లు, వృత్తాలు, డిజైన్లు మరియు మానవరూపాల లాంటివి, చెక్కిన సింహం మరియు ఎద్దు మొదలైనవి ఉన్నాయి. వివిధ పరిమాణాలలో ఉన్న పాదముద్రలు మరియు చేతిముద్రలు కూడా కనుగొనబడ్డాయి. ఎరుపు, తెలుపు మరియు పసుపు రంగులలో సుమారు 300 చేతిముద్రలు ఉన్నాయి. రూపాలు ఒకదానిపై ఒకటి అతివ్యాప్తి చెందడం మరియు ఒకదానిపై ఒకటి ఏర్పడటం సాధారణంగా గమనించవచ్చు.


ముఖ్యంగా, ఈ ప్రదేశంలో చెక్కబడిన మరియు ఎరుపు రంగులో వ్రాయబడిన పది తొలి శతాబ్దాల శాసనాలు లభించాయి. తెలంగాణలోనే కాకుండా భారతదేశంలోనే ఈ స్థాయిలో ఇటువంటి ఆవిష్కరణ జరగడం ఇదే మొదటిసారి. చెక్కబడిన బ్రాహ్మీ అక్షరాలు ఎరుపు రంగుతో నింపబడి ఉండటం ఒక ప్రత్యేక లక్షణం. ఈ శాసనాలు బ్రాహ్మీ లిపి, ప్రాకృత భాష, మరియు తొలి తెలుగు అక్షరాలు, భాషలో ఉన్నాయి. ఇవి వరుసగా శాతవాహన కాలంలోని క్రీ.పూ. మరియు క్రీ.శ. తొలి శతాబ్దాలకు, మరియు క్రీ.శ. 5వ-6వ శతాబ్దాలకు చెందినవిగా చెప్పబడుతున్నాయి.

ఈ శాసనాలన్నీ రాతి చిత్రాలతో పాటు ఒక శిలా ఆశ్రయంలో కనుగొనబడటం ఇక్కడి ముఖ్యమైన అంశం.

విశేషమేమిటంటే, ఈ ఆశ్రయంలోని రెండు శాసనాలు ఒక చారిత్రాత్మక ఆవిష్కరణ అయిన కుమార అకుసిరి (హకుసిరి)ని సిద్ధ హారితిపుత్రుని స్నేహితుడిగా పేర్కొంటున్నాయి. ఈ అకుసిరి/హకుసిరి శాతవాహన రాజవంశానికి చెందిన నాగానిక మరియు శాతకర్ణిల కుమారుడైన ఒక శాతవాహన యువరాజుగా గుర్తించబడ్డాడు. హారితిపుత్రుడు ఒక ప్రముఖ వ్యక్తి లేదా బౌద్ధ భిక్షువై ఉండవచ్చు.



మనుషులు, నృత్యం చేస్తున్న వారు



హకుగరుస గ్రభయా



మానవ రూపాలు



నక్క, దుప్పి



తెలుపు, ఎరుపు చేతి గుర్తులు



సీతమ్మలొద్దిశిలాశ్రయం

ఈ ప్రదేశం నుండి తెలిసిన ఇతర పేర్లు కుమార శకసిరి, దవన, వక్రచందు మొదలైనవి.



సూక్ష్మ రాతి పనిముట్లు

ఈ రెండు శాసనాలు, ముక్కట్రావుపేటలో అంతకుముందు కనుగొనబడిన శాసనంతో కలిసి, చారిత్రాత్మకంగా పదహారు మహాజనపదాలలో ఒకటైన అస్మక ప్రాంతంలో హకుసిరి పరిపాలనకు సాక్ష్యాలను అందిస్తున్నాయి. ఈ శాసనాలలో చాలా వరకు తొలి శతాబ్దాలకు చెందినవి మరియు ఈ ప్రాంతంలో శాతవాహనుల ఆధిపత్యాన్ని సూచిస్తున్నాయి. ఈ రాతి ఆశ్రయంలో లభించిన శాసనాలు, వివిధ కాలాలకు చెందిన విభిన్న లిపులు మరియు భాషలలో వ్రాయబడి ఉండటం, సాంస్కృతిక మరియు మతపరమైన ప్రభావాల మధ్య ఉన్న సంక్లిష్టమైన పరస్పర చర్యను తెలియజేస్తున్నాయి. ఒకే రాతి ఆశ్రయంలో ప్రాకృత మరియు తొలి తెలుగు భాషలు రెండూ లభించడం, ఒక చారిత్రక వారసత్వ నిధిగా దీనికున్న నిరంతర ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది.

అంతేకాకుండా, ఈ ప్రదేశంలో చాల్సెడోనీ మరియు అగేట్ వంటి రాళ్లతో చేసిన చంద్రవంక ఆకారపు కత్తులు (lunates), వెన్నున్న కత్తులు (backed knives), బాణం మొనలు (arrow points) వంటి రాతి పనిముట్లు కూడా కనుగొనబడ్డాయి. శిలాజ రాళ్లు కూడా లభించాయి.

రాతి చిత్రకళ, రాతి పరిశ్రమ మరియు శాసనాల ద్వారా లభించిన ఆధారాలు, ఈ ప్రాంతంలో మానవ కార్యకలాపాలు పాత రాతి యుగం (paleolithic) నుండి తొలి చారిత్రక (early historic) కాలం వరకు కొనసాగి ఉండవచ్చని సూచిస్తున్నాయి. ఇటువంటి ఆవిష్కరణలు ఈ ప్రదేశం యొక్క విశేషమైన ప్రాచీనతను తెలియజేస్తూ, ఈ ప్రాంతంలో తొలి మానవ ఉనికిని మరియు సాంస్కృతిక వికాసాన్ని అర్థం చేసుకోవడంలో దీని ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి. ఈ ఆవిష్కరణ తెలంగాణ ప్రాంతం యొక్క గొప్ప చారిత్రక వారసత్వాన్ని చాటిచెబుతూ, దానికి గణనీయమైన పురావస్తు విలువను చేకూరుస్తుంది. ఈ చిన్నవ్యాసం ఆ ప్రదేశంలో జరిగిన అధ్యయనానికి సంబంధించిన స్థూల సమాచారం.

శ్రీ శ్రీరామోజు హరగోపాల్, ఈ 'దక్కన్ ల్యాండ్' మాసపత్రిక మార్చి 2024 సంచికలో, ఈ ప్రదేశానికి సంబంధించిన ప్రయాణ వివరాలను, సందర్శన అనుభవాలను; అలాగే అక్కడి శిలా ఆశ్రయంలోని విశిష్టమైన రాతి చిత్రకళ మరియు శాసనాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని పొందుపరిచారు.

-డా. బండి మురళీధర్ రెడ్డి
m: 7093378522
e: drbmreddy@yahoo.co.in
-దుగ్గెంపూడి రవీందర్ రెడ్డి
m: 9866332244
e: ravistudios@gmail.com

ద



హకవారు - సిధ హారీతిపుతస



# గ్రహాంతర జీవుల ఉనికి

ప్రపంచ UFO (Unidentified Flying Objects – గుర్తు తెలియని ఎగిరే వస్తువులు) దినోత్సవం జాతీయ దినోత్సవ క్యాలెండర్‌లో జూన్ 24 మరియు జూలై 2 అనే రెండు వేర్వేరు తేదీలను స్మరించుకుంటుంది. జూన్ 24వ తేదీ 1947లో విమానయాన నిపుణుడు కెన్నెత్ ఆర్నాల్డ్ ద్వారా విస్తృతంగా నివేదించబడిన మొదటి UFO దర్శనాన్ని గుర్తిస్తుంది. జూలై 2వ తేదీ, అదే సంవత్సరం న్యూ మెక్సికోలోని రోస్‌వెల్‌లో జరిగిన సంఘటనను స్మరించుకుంటుంది.

**వరల్డ్‌దూడే:** ప్రపంచవ్యాప్తంగా, ఆకాశంలో కనిపించే అసాధారణ కాంతిపుంజాలు లేదా వింత సంఘటనలు, గ్రహాంతర జీవుల గురించి తెలుసుకోవాలనే కుతూహలాన్ని మానవులలో ఎల్లప్పుడూ రేకెత్తిస్తాయి. సినిమాలు, టెలివిజన్ సీరీస్‌లు కూడా మన ఊహాశక్తిని ఉత్తేజపరుస్తూనే ఉంటాయి. UFOల విషయానికి వస్తే కుట్ర సిద్ధాంతాలు ప్రముఖంగా ఉండటంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచ UFO దినోత్సవం, మరో కోణంలోని జీవం గురించి మనకున్న కుతూహలాన్ని గుర్తిస్తుంది. 1947కి ముందు, మనుషులు UFOలను చూసినట్లుగా రాతపూర్వక ఆధారాలు చాలా అరుదుగా ఉండేవి. కానీ ఆకాశంలో వివరించలేని వస్తువులు మాత్రం ఉండేవి. ఆర్నాల్డ్, రోస్‌వెల్ సంఘటనల తర్వాత, నివేదికలు నాటకీయంగా పెరిగాయి. ఫలితంగా, ఈ అసాధారణ దృశ్యాల దర్యాప్తులకు ఒక స్కేల్‌పై రేటింగ్‌లు ఇవ్వబడ్డాయి.

ఖగోళ శాస్త్రవేత్త జోసెఫ్ అలెన్ హైనెక్ ఆకాశంలో కనిపించే వింత దృశ్యాలను అధ్యయనం చేయడం ప్రారంభించి, చివరికి తన UFO పరిశోధన గురించి అనేక పుస్తకాలు రాశారు. వాస్తవానికి, హైనెక్ 'ది హైనెక్ స్కేల్'ను రూపొందించారు. ఇది దృశ్యాలను వాటి సామీప్యత ఆధారంగా 'రాత్రిపూట వెలుగులు' నుండి 'మూడవ రకం సమీప ఎదుర్కోవడాలు' వరకు వర్గీకరిస్తుంది.

20వ శతాబ్దంలో, ఆకాశంలోని వస్తువుల పట్ల ప్రపంచపు ఆసక్తి ఖచ్చితంగా పెరిగింది. 1947లో ఆ వస్తువులు కనిపించడానికి ముందు, హెచ్.జి. వెల్స్ ఒక కథను ప్రచురించారు. అది తరువాత రేడియో నాటకంగా మారింది. రేడియో తరంగాల ద్వారా దాని ప్రసారం కొన్ని భయానక ఫలితాలను ఇచ్చింది! 1898లో ప్రచురించబడి, తరువాత 1938లో రేడియో ద్వారా ప్రసారం చేయబడిన 'ది వార్ ఆఫ్ ది వరల్డ్స్', రేడియో శ్రోతలలో చాలామంది తమపై అంగారక గ్రహవాసులు దాడి చేస్తున్నారని నమ్మేలా చేసింది. ఓర్సన్ వెల్స్ వ్యాఖ్యానంతో, ఈ నాటకం ప్రజల ఊహాశక్తిని రేకెత్తించింది.

### ప్రపంచ యూఎఫ్ఓ దినోత్సవాన్ని ఎలా పాటించాలి

ఆకాశం వైపు చూసి, మీరు "గుర్తించబడని ఎగిరే వస్తువు"ను గుర్తించగలరేమో చూడండి. ఆకాశంలో కనిపించే వివరించలేని వస్తువుల వీడియోలు, ఫోటోలను సమీక్షించి, వాటికి శాస్త్రీయ కారణం ఏదైనా ఉందో లేదో చూడండి. ఈ లోకానికి సంబంధం లేని ఒక సినిమా చూడండి. బహుశా, ఏలియన్ థీమ్‌తో ఉన్న రెస్టారెంట్‌లో భోజనాన్ని ఆస్వాదించండి. అనేక UFO మ్యూజియంలను సందర్శించండి, ముఖ్యంగా న్యూ మెక్సికోలోని రోజ్‌వెల్‌ను సందర్శించండి.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com



# “అల్లకొండ, వల్లకొండ @ బాల్కొండ”

**1059లో** అల్లయ్య, కొండయ్యల చేత ఏర్పడిన ఆల్లకొండ, వల్లకొండ @ బాల్కొండలో చరిత్రాత్మిక ఖిల్లా నిజామాబాదు జిల్లాలో ఉంది. “మా ఊరు – మా చరిత్ర – చారిత్రాత్మక కట్టడాల సంరక్షణ” లో భాగంగా నిజామాబాద్ జిల్లా బాల్కొండలో పురాతన మైన కట్టడాలపై చెట్లుతో కూడుకొని ఉంది. దీని వలన పురాతన కట్టడాలని పగుళ్లు వచ్చి శిథిలావస్థలో చేరు కుంటున్నాయి. పూర్వ అల్లకొండ పాలనలో (3) మూడంచెలా వ్యవస్థలో భాగంగా ముళ్ల పొదలు, ఎత్తు పల్లాలు అలాగే అగ్ని కంచెలు ఉండేదని తెలుస్తుంది. అల్లకొండ ఖిల్లా కోట నిర్మాణం శైలి, కోట గోడలపై ఉన్న నిర్మాణాలను బట్టి ఇది రాష్ట్ర కూటుల కాలం నాటిదని తెలుస్తుంది. కోటలో ఆలయాల లక్షణాలు, శిల్ప సంపద ఎత్తైన కొండలపై భూరుజులు, సాయంత్రం కాగానే కోట నుంచి కొండపై నిర్మించిన భూరుజుల్లోకి సిపాయిలు వెళ్లడానికి సొరంగ మార్గాలు, శత్రువులు ఖిల్లా లోనికి రాకుండా (06) సింహ



ద్వారాలు వీటికి సీసం కర్రతో పెద్దపెద్ద దర్వాజాలు వీటికి ఎత్తడానికి ఏనుగుల సహాయం తీసుకునే వారట. ఊరికి ఆరు దర్వాజాలకు మొదటి దర్వాజా దూదేకుల బేస్ ఊరికి ప్రధాన రహదారి ఉన్నత పాఠ శాల వద్ద కందకాని ఆనుకొని ఉండేది. దీనితో పాటు ఆర్మూర్ బేస్, నాందేడ్ బేస్, జలాల్పూర్ బేస్, నిర్మల్ బేస్, ప్యాట్ల బేష్లు ఉండేవి. ఇందులో ప్రస్తుతము నాందేడ్ బేస్, ఆర్మూర్ బేస్ మాత్రమే మిగిలి ఉంన్నాయి. ఖిల్లా నిర్మాణము పడమర వైపు పెద్ద చెరువుని ఆనుకొని దక్షిణ భాగంలో ఎత్తైన నల్లరాజు గుట్టలు ఉత్తరములు చెరువు ఆనుకొని కోట, కోట నిర్మాణం చుట్టూ కందకం ఉండేదట. అలాగే పూర్వ  అల్లకొండ రాజరిక పాలనలో ఖిల్లాతో పాటు ఖిల్లాతో ఊరు చుట్టూ కందకాలు ఉన్నాయన డానికి నేటికీ ఆధారాలు ఉన్నాయి. ఈ కందకాల నిర్మాణం గురించి ఈ ఊరి ముస్లిం మతానికి చెందిన ముశీస్పే యొద్దీన్ సిద్ధిఖి తారీక్ – ఈ – అల్లకొండ (బాల్కొండ) అను ఉర్దూ గ్రంథములో, బాల్కొండ పూర్వ చరిత్రను ప్రముఖ చరిత్ర కారులైన సిద్దసాయు రెడ్డి గారు రచించిన “నిజామాబాదు జిల్లా చారిత్రక వైభవం” పుస్తకంలో వివరించారు. ఖిల్లా కోటతో పాటు ఊరు చుట్టూ “కంద కాలు” ఇందులో విష సర్పాలు ఉంచే వారట.

ఖిల్లాలో ఆనాటి కట్టడాలు నిర్మాణాలు ఇప్పటికీ ధ్వంసం అవుతున్నాయి. వీటిని కూలిపోకుండా కాపాడ వలసిన బాధ్యత ప్రభుత్వం, ప్రజలపై ఉంది.

### ఖిల్లా ప్రత్యేకతలు:

అల్లయ్య, కొండయ్య రాజులు సోమక్షత్రయుల సైనికులుగా





పనిచేశారు. కుస్తాపురంలో శివాలయం ఉంది. ఇక్కడ శ్రీ సీతారామ లక్ష్మణులు వనవాసంలో ఉన్నప్పుడు శివలింగాన్ని ప్రతిష్టించారు – శ్రీ నిమిషంబ దేవి ఆలయం 524 సంవత్సరాల క్రితం నిర్మించబడింది. స్వయంభూ లింగమయ్య ఆలయం ఉంది. వీసాలు ఇచ్చే వీరాంజనేయ ఆలయం ఉంది. పడాల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఉంది. ప్రతి ఏటా మహా శివరాత్రి రోజున వైభవంగా జాతరలు, ఉత్సవాలు జరుగుతాయి.

**అత్త కోడళ్ళ బావి**

అత్త కోడళ్ళ బావి నిర్మాణ శైలి ఒకే బావిలో ఒకవైపు మంచినీరు, మరోవైపు ఉప్పునీరు ఉండటం విశేషం. ఇలా ఒకే బావిలో రెండు రకాల నీరు ఆనాడు కాలంలో లభించిందని చరిత్ర ఆధారాలు ద్వారా తెలుస్తోంది.

**గుమ్మటాలు**

గూఢచారి వ్యవస్థలో ఖిల్లా అనుబంధంగా ఎత్తైన ప్రదేశాల్లో ఖిల్లాకు నలువైపులా ఆ నాటి రాజులు నాలుగు గుమ్మటాలను నిర్మించారు. వాటిల్లో నేడు రెండే మిగిలి ఉన్నాయి. ఒకటి ఆర్మూర్ బెస్ (కమాన్) కు కొద్ది దూరంలో దక్షిణ బాగం వైపు అంటే శుక్రవారం దేవి ఆలయం సమీపంలో ఉంది. రెండోది పెద్దమ్మ ఆలయం వెనుక భాగంలో ఉంది. పూర్వం రాజుల కాలంలో ఈ గుమ్మటాల్లో ప్రధానంగా సైనికుల్లో ఉన్నత శ్రేణి గూఢాచారునికి తోడుగా మరో నలుగురిని వంతుల వారిగా ఊరిని 24 గంటలు పాటు కాపలా కాస్తూండే వారట.

**నెహ్రూ మెచ్చిన అల్లకొండ**

1963లో భారత తొలి ప్రధాని పండిత్ జవహర్లాల్ నెహ్రూ గారు పోచంపాడు ప్రాజెక్టు శంకుస్థాపన చేయడానికి వచ్చారు. ఆయన రోడ్డు మార్గంలో వెళ్తూ అల్లకొండ గుట్టలపై నిర్మితమైనటువంటి బురుజులను చూసి నెహ్రూ కారు దిగి బురుజులను చూసి ఆచ్చర్య పోయారట. ఆయనతో పాటు ఉన్న అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, కాసు బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి తదితర ప్రముఖ నాయకులును "అల్లకొండ" గ్రామం చరిత్ర గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయారు. అల్లకొండ చరిత్రకు ఇంత ప్రాముఖ్యత ఉందా అన్నారట. పాత బస్టాండ్ వద్ద వున్న నిర్మించిన "సన్రైఫ్" కమాన్ చూసి ఆశ్చర్యపోయారు. నిర్మల్ కొయ్య బొమ్మలను నెహ్రూకు బహూకరించారట. నెహ్రూగారు ఆ నిర్మల్ బొమ్మల తయారీ నైపుణ్యాన్ని చూసి అబ్బురపడి మెచ్చుకున్నారట.

**దేశంలోనే 2వ రాజధాని లాగా పేరు ఉన్న రాజ్యం**

బాల్కొండ ఒకప్పుడు దేశంలోనే 2వ రాజధాని (రాజ్యం) లాగా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. పూర్వ ఉమ్మడి తెలుగు రాష్ట్రమైన మద్రాస్ హైకోర్టు ప్లీడర్ ఏనుగుల రామస్వామి "కాశీ యాత్ర" పాదయాత్రలో భాగంగా హైదరాబాద్, బిక్క నూరు, కామారెడ్డి, మల్లు పేట్, రామారెడ్డి, ఇందల్వాయి, ఆరా మూరు, అల్లకొండలో పర్యటించారు. పర్యటనలో భాగంగా మూడు రోజుల పాటు అల్లకొండ లోనే విడిది చేశారు. ఇక్కడి వ్యసాయ ఉత్పత్తులు, వ్యాపార లావాదేవీలు దేశాంలోని ఇతర ప్రాంతాలకు ఎగుమతులు అయ్యేవని అయన వ్రాసుకున్న డైరీలో అభిప్రాయ పడ్డారు.

**బాల్కొండ ఖిల్లా ప్రజల కోరికలు**

1. మా బాల్కొండ ఖిల్లాకు మరమ్మత్తులు చేయాలి.
2. ఖిల్లాను పర్యాటక కేంద్రంగా గుర్తించాలి.
3. చెరువు మధ్యలో రుద్రమదేవి విల్లుని ఎక్కు పెట్టి ఉంది. చెరువు కట్ట నుండి రుద్రమదేవి విగ్రహం వరకు వంతెన నిర్మాణం చేస్తే పర్యాటక రంగంలో అభివృద్ధి చెదుతుంది.
4. ఖిల్లా కందకాల్లో 75% కబ్జాలకు గురై ఇల్ల నిర్మాణాలు జరిగి పోయాయి. మిగిలిన 25' కందకాలు ఖిల్లా ఆనుకొని "సైది నాభి ఘోరి" వద్ద ఉంది. దీనికి కంచె ఏర్పాటు చెయ్యాలి.
5. 1977 వరకు ఖిల్లాకు చౌకి దార్ ఉండేవారు. వెంటనే చౌకి దార్ను నియమించాలి.

–బ్రాహ్మ రౌతు నర్సింగ్ రావు
m: 9666759297
e : brnraoncc.rao@gmail.com






# అతుల్య కేవీ

## భారతదేశపు మొట్టమొదటి మహిళా కమర్షియల్ డైవర్

మన ఇళ్లలో ఇంటర్నెట్ కనెక్షన్, మన వంటగదులలో గ్యాస్ సిలిండర్, మన వాహనాల్లో ఇంధనం అంతరాయం లేకుండా మనకు చేరుతుంటే, సముద్రపు అగాధపు చీకటిలో తెర వెనుక ఒక మహిళ ఊపిరి బిగబట్టి, అపారమైన ప్రమాదాలను ఎదుర్కొంటూ పనిచేస్తోంది. ఆమె అతుల్య కేవీ.

కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో ఉన్న పట్టాంబి అనే చిన్న గ్రామంలో జన్మించిన అతుల్య, ప్రపంచంలోని లోతైన సముద్రాలలోకి సాహసయాత్ర చేసి చరిత్ర సృష్టించిన ఒక మలయాళీ మహిళ. ఆమె భారతదేశపు మొట్టమొదటి మహిళా కమర్షియల్ డైవర్.



సాధారణంగా స్కూబా డైవింగ్ అనేది సముద్ర సౌందర్యాన్ని అన్వేషించడానికి ఆనందించే ఒక వినోద కార్యకలాపం కాగా, అతుల్య చేసే పని చాలా ప్రమాదకరమైన వాణిజ్య డైవింగ్ రంగానికి సంబంధించినది.

సముద్రం అడుగున ఉన్న ప్రధాన చమురు, గ్యాస్ పైప్‌లైన్‌లు లేదా ఇంటర్నెట్ కేబుల్స్ దెబ్బతిన్నప్పుడు, మరమ్మతులు, వెల్డింగ్ మరియు నిర్వహణ పనులను చేపట్టడానికి అతుల్య సముద్రంలోకి డైవ్ చేస్తుంది. అంతేకాకుండా, ఇటువంటి కార్యకలాపాలను నిర్వహించడానికి అవసరమైన వాణిజ్య లైసెన్స్ ఉన్న భారతదేశంలోని ఏకైక మహిళ కూడా ఆమెనే.

మనలో చాలామంది ఎన్నడూ చూడని లోతైన సముద్ర ప్రపంచంలోని అనేక ప్రాంతాలను ఆమె సందర్శించారు. తిరువనంతపురంలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయం వెనుక సముద్రం అడుగున, అతుల్య అసాధారణమైన గుహల వంటి నీటి అడుగున నిర్మాణాలను కనుగొన్నారు.

అదేవిధంగా, కోజికోడ్ తీరంలో డైవింగ్ చేస్తున్నప్పుడు, కుంజాలి మారక్కర్ దాక్కున్న ప్రదేశంగా భావించే ఒక ప్రాంతంలో ఆమె పురాతన పడవలను, ఫిరంగి గుండ్ల వల్ల ఏర్పడ్డాయని నమ్మే గుర్తులను కనుగొన్నారు.

ఇలాంటి ఆవిష్కరణలను సరిగ్గా నమోదు చేసి, చరిత్రలో భాగంగా భద్రపరచాలనేది అతుల్య యొక్క చిరకాల స్వప్నాలలో ఒకటి.

ఆమె శక్తివంతమైన నీటి అడుగున ప్రవాహాలను, స్టోన్‌ఫిష్, స్టింగ్రేల వంటి ప్రమాదకరమైన సముద్ర జీవులను ఎదుర్కొంటూ ఈ మిషన్లను పూర్తి చేస్తుంది.

అతుల్య ప్రకారం, సముద్ర గర్భంలో ఉన్నది ఏదీ నిజంగా మనకు చెందినది కాదు. అక్కడ నివసించే జీవులు కూడా మనలాంటి ప్రాణులే. వాటికి ఇబ్బంది కలిగించకుండా, మనం వాటి ప్రపంచంలో భాగమై, వాటిని గౌరవించి, అభినందించాలి.

సముద్రపు అగాధంలో కీలకమైన జాతీయ మౌలిక సదుపాయాలను, చారిత్రక అవశేషాలను కాపాడుతున్న మలయాళీ మహిళ అతుల్య, స్వయంగా చరిత్రలో ఒక భాగం.

విచారకరంగా చెప్పాలంటే, వికీపీడియా కూడా ఆమెను ఫోటోలు మరియు సరైన డాక్యుమెంటేషన్‌తో తగినంతగా గుర్తించలేదు.

ఆమె వంటి వారి గురించి ప్రపంచం తెలుసుకోవాలి. ముఖ్యంగా కేరళకు గర్వకారణమైన ఈ యువతి గురించి. ఆ గుర్తింపు మనతోనే ప్రారంభం కావాలి.

– కె. సత్యప్రసన్న
e:desk.deccan@gmail.com




# నల్లమలలో అరుదైన ప్రాణి 'ఇండియన్ మూన్ మోత్'గా గుర్తింపు

అరుదైన ఇండియన్ మూన్ మోత్ నల్లమలలో దర్శనమిచ్చింది. నల్లమలలోని అమ్రాబాద్ అభయారణ్యంలో ఇటీవల ఈ అరుదైన కీటకాన్ని గుర్తించినట్లు హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ కోఆర్డినేటర్ బాపురెడ్డి, ప్రతినిధి అఖిల్ తెలిపారు. సీతాకోక చిలుక కుటుంబానికి చెందిన ఇది ఓ పెద్ద పట్టు పురుగు. దీని జీవనచక్రం చివరి దశలో జతకట్టేందుకు, గుడ్లు పెట్టేందుకు 5 నుంచి 8 రోజులు మాత్రమే జీవిస్తుంది. ఇండియన్ మూన్ మోత్ ఉనికి అడవుల జీవవైవిధ్య సమృద్ధికి సూచిక అని బాపురెడ్డి వివరించారు.

ఆకుపచ్చని రంగులో విశాలమైన రెక్కలు, వాటి అంచుల్లో గులాబీ రంగు వెనుక భాగంలో పొడవాటి తోకలు, రెక్కలపై కండ్లను తలపించే వలయాలతో ఈ చిమ్మట ప్రకృతి సృష్టించిన అపురూప కళాఖండంలా ఇది కని పిస్తున్నది. ప్రపంచంలో అత్యంత అందమైన చిమ్మట జాతుల్లో 'ఇండియన్ మూన్ మత్' ఒకటిగా గుర్తింపు పొందింది. రాత్రివేళల్లో చురుకుగా సంచరించే ఈ జీవి కృత్రిమ వెలుతురుకు ఆకర్షితమవుతున్నది. ఆరోగ్యకరమైన అడవులు, సమృద్ధిగా జీవవైవిధ్యం ఉన్న ప్రాంతాల్లో మాత్రవే ఇవి కనిపిస్తాయి. గుడ్డు, గొంగళిపురుగు, కోశ దశలో అనేక వారాలు గడిపిన అనంతరం పూర్తిస్థాయి చిమ్మటగా బయటకు వచ్చే ఈ జీవి.. వయోజన దశలో కేవలం 5 నుంచి 8 రోజుల వరకు మాత్రమే జీవిస్తుంది. దీనికి నోరు పని చేయదు. గొంగళి పురుగు దశలో నిల్వచేసుకున్న శక్తితోనే జీవిస్తూ సంతానోత్పత్తి జరిపి తన జీవన చక్రాన్ని ముగిస్తుంది. నల్లమల అటవీప్రాంత ప్రత్యేకతను ఈ జీవి మరోసారి చాటి చెప్పింది.

– దక్కన్‌న్యూస్

m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL

## అష్టనాగులతో పూజలందుకుంటున్న

# కోలాదేవి ఖగరాజు

తల్లికోసం త్యాగం చేసిన మహామహులలో అగ్రగణుడుగా గరుడుడు గుర్తించబడుతాడు. తన తల్లి దాస్యవిముక్తి కొరకు దేవలతను నియంత్రించి అమృతాన్ని సంపాదించిన మహాబలశాలి. శ్రీ మహావిష్ణువుకు శరణాగతులు కావడం వలన ఆయన వాహనమయ్యాడు. ఇంతటి బలవంతుడు, వేగంగా ప్రయాణించువాడు. తీక్షణమైన చూపు కలవాడు, మేఘాలపైన విహరించువాడు శ్రీ మహావిష్ణువు వాహనమైన గరుడుడు నాగద్వేషి అయినప్పటికి ఎనిమిది రకాల నాగుల (అష్టనాగులు)ను సంహరించడు. వారిని తన ఆధీనములో వుంచుకొని నియంత్రిస్తాడు అని పురాణగాధలు తెలియజేస్తున్నాయి.

**ఎవ్వరు ఈ అష్టనాగులు?**

*"అనంతం వాసుకిం శేషం పద్మనాభంచ*
*కంబలం / తక్షకం కార్కాటకం శుభం మౌంజం చ*
*ఐరావతం తథా"*

ఎటువంటి సర్పదోషము మరియు సర్పకాటుకు గురి కాకూడదని ప్రతి రోజు ఉదయాన్నే ఈ మంత్రాన్ని చదువుతారు. తూర్పుదిశ యందు అనంతుడు అనే సర్పము, ఆగ్నేయ దిశకు వాసుకి, దక్షిణదిశకు తక్షకుడు, నైరుతి దిశకు కర్కోటకుడు, పడమర దిశకు పద్మడు, వాయువ్యం మహాపద్ముడు, ఉత్తరం శంఖపాలుడు మరియు ఈశాన్యదిశ యందు గుళికుడు అనే సర్పములు రక్షణగా వుంటారని హిందువుల నమ్మకం. ఈ ఎనిమిది రకాల విషసర్పాలు ఎనిమిది దిక్కులకు ప్రతినిధులుగా పేర్కొంటారు. ఈ ఎనిమిది రకాల విషనాగులను నియంత్రించి వారిని అభరణాలుగా ఉంచుకోవడం వలన సమస్త విషాలను తన నియంత్రణలో గరుడుడు వుంచుకున్నాడు అని అర్థమౌతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| వాయువ్యము | | ఉత్తరం | | ఈశాన్యము |
| | మహాపద్ముడు | శంఖపాలుడు | గుళికుడు | |
| పడమర | పద్ముడు | | అనంతుడు | తూర్పు |
| | కర్కోటకుడు | తక్షకుడు | వాసుకి | |
| నైరుతి | | దక్షిణము | | ఆగ్నేయము |



కోలాదేవి గ్రామంలోని పూజలందుకుంటున్న ఖగరాజు

**అష్టనాగులను గరుడుడు ఎందుకు సంహరించడు?**

నాగుల యందు స్వభావసిద్ధమైన వైరము కలిగినప్పటికీ లోకాధార శక్తులైన ఎనిమిది నాగుల మీద శత్రుత్వము లేక నియంత్రించు అధికారము కలిగియున్నాడు. ఎందుకు అలా వున్నాడో! తెలుసుకోవలిసిన అవశ్యకత ఎంతైనా వుంది.

1) తూర్పు దిక్కున పాలిస్తున్న అనంతుడు అనే సర్పము భూమిని మోస్తుందనే నమ్మకం కలిగిన వారు హిందువులు. అంతేకాదు అనంతుని మీద విష్ణువు శయనిస్తాడు అనే నమ్మకం..

2) అగ్నేయ దిక్కులో వున్న వాసుకి సముద్ర మథనంలో విష్ణువు కూర్మముకాగా, గరుడుడు తెచ్చిన మందర పర్వతం కవ్వముకాగా, వాసుకి తాడుగా మారి అమృతం వచ్చేందుకు దోహదకారి అయినది.

3 & 4) దక్షిణ మరియు నైరుతి దిక్కులో వున్న తక్షకుడు మరియు కర్కోటకుడు : సామాన్య నాగులైతే అదుపు తప్పిన శక్తికి

లోబడి వుంటారు. కాని తక్షకుడు మరియు కర్కోటకుడు నియంత్రించిన శక్తిని కలిగిన వారు మరియు ధర్మనిరతికి లోబడి వుంటారు. (పరీక్షిత్ కథ మరియు నలమహారాజు కథ).

5 & 6) పడమర మరియు వాయువ్య దిశలో వున్న పద్ముడు మరియు మహాపద్ముడు సృష్టి మరియు సంపదకు మూలమైన ధర్మబద్ధ శక్తిని రక్షించువారు.

7) ఉత్తర దిశలో వున్న శంఖపాదుడు దానశీలుడుగా గుర్తించబడ్డవాడు మరియు

8) ఉత్తర దిశలో వున్న గుళికుడు: శుద్ధి పరివర్తన కోసం వున్న శక్తిగా గుర్తించబడ్డవాడు.

పైన పేర్కొనబడిన అష్టనాగులు గొప్ప గుణాలు కలిగి వుండడం వలన గరుడుడు వారిని తన దేహం నందు ధరించి అలంకారములుగా మార్చుకున్నాడు. ఇటువంటి అష్టనాగ అలంకార ప్రాయుడైన గరుడుని పూజించిన సర్పదోష నివారణం, రాహుకేతు నివారణ దోషం తొలగునని హిందువుల నమ్మకం.


భీమసేనుని చేతిలో సౌగంధిక పుష్పం - హంపి

అష్టనాగులను అలంకరించుకొని భారతదేశంలో ఎక్కడ లేని విధముగా గర్భగుడిలో ఖగరాజు పూజలందుకుంటున్నాడు. రమారమి పది అడుగుల ఎత్తులో వున్న ఈ విగ్రహం ఒక భుజము మీద విల్లంబులు ధరించి శ్రీరాముడు మరియొక భుజము మీద సీతమ్మను కలిగివుండి ఉత్తర దిశవైపు పది అడుగుల ఎత్తు కలిగిన అంజనేయుడిని చూస్తున్న ఈ విగ్రహమును కోలార్ జిల్లాలోని కోలాదేవి గ్రామము యందు గమనించగలము.


మారుతి సౌగంధిక పుష్పములు -కోలాదేవి

**గరుత్మంతుని భుజముల మీద సీతారాములు దర్శనము ఒక అపురూపం:**

ప్రాంతీయ కథలననుసరించి, హరికథ, భాగవతుల కథల అనుసారం మారుతి, ద్వాపరయుగములో చాలామందికి గర్వ మనుస్తాడు. వారిలో ప్రధానంగా 1) ఖగరాజు 2) బలరాముడు మరియు సత్యభామ. ఈ సందర్భంగా కృష్ణునితో సైతం యుద్ధానికి మారుతి సంసిద్ధముకాగా గరుడుని మీద కృష్ణుడు మరియు రుక్మిణి రావడం జరిగింది. చిట్టచివరకు రాముని అవతారమే క్రిష్ణుడని, సీత అవతారమే రుక్మిణి అని మారుతి గ్రహించడం జరిగినది. ఆ సమయంలో గరుడుని మీద విల్లంభులు ధరించిన రాముడు సీత మహాదేవి రూపములలో దర్శనమిస్తారు. అటువంటి అద్భుతమైన పదిఅడుగుల విగ్రహం కర్ణాటక రాష్ట్రం నందలి కోలార్ జిల్లాలో వున్న కోలాదేవి గ్రామంలోని దేవాలయపు గర్భగుడి నందు గమనించవచ్చు.

ఇక్కడ గరుడుని విగ్రహమును గమనిస్తే శిరస్సు నందు ఒక సర్పము, కుడి భుజము నందు రెండు సర్పములు ఛాతి నందు రెండు సర్పములు మరియు ఎడమ భుజము నందు మూడు సర్పములను కలిగివుండి దక్షిణము వైపు ఆంజనేయుని చూస్తున్నట్లుగా వుండును. ఈ విధంగా గర్భగుడిలో అష్టనాగులతో వున్న గరుడుడు పూజలందుకోవడం చాలా అరుదు.

ఇక్కడ శిల్పము నందలి గరుడ నాగసంబంధమును గమనిస్తే 1) నాగుల మీద శత్రుత్వముకాక నియంత్రణ కలిగివుంటాడని తెలుస్తుంది. 2) నాగులను సంహరించక సమన్వయము కలిగి వుంటాడని అర్థమౌతుంది. 3) భక్తులకు నాగుల విషము పనిచేయక గరుడుడు ఔషధములాగ వ్యవహరిస్తాడని అర్థమౌతుంది. మరియు 4) భక్తులకు నాగుల వల్ల భయము లేక ధర్మ సంరక్షణలో వుంటాడని అవగతమౌతుంది. సర్పదోష నివారణ కోసం మరియు రాహువు కేతువుల దోష నివారణ కొరకు ఇక్కడ పూజలు జరుపుతారు.

దక్షిణ ద్వారం కలిగివుండి 9-10 అడుగుల మారుతి విగ్రహమును మరియొక గర్భగుడిలో గమనించవచ్చును. ఈ విగ్రహములను రామానుజాచార్యులు ప్రతిష్ఠించినారని చెబుతారు. ఎడమ వైపుకు అనగా తూర్పు దిశకు తలతిప్పికొనివుండును. ఆచార్య తత్వానికి చిహ్నంగా పిలకను సైతం మారుతి విగ్రహం నందు గమనించవచ్చును. ఇదే శిలలో శంఖచాక్రాదులు కూడా దర్శనమిస్తారు. కుడి చేతితో అభయ హస్తముతో వున్న మారుతి ఎడమ చేతిలో నాలుగు సౌగంధిక పుష్పములను కలిగివుండును. భారతదేశములో ఇది చాలా అరుదైన విగ్రహము. కర్ణాటక రాష్ట్రము నందలి హంపి క్షేత్రములో భీమసేనుని చేతిలో ఇదే శైలిలో సౌగంధిక పుష్పమును పట్టుకొని వున్న విగ్రహమును గమనించవచ్చును.

ఇంతగొప్ప కోలాదేవి గరుడ విగ్రహా విశిష్టతను తెలియజేయవలసిన అవసరం ఎంతైనా వున్నదని అందరు కోరుకుంటున్నారు.

- డా॥ జి.యస్.రామయ్య
INTACH సభ్యులు -
కర్నూలు జిల్లా చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 898 555 0007

## నేల జీవ ఆరోగ్యం

# పెను సంక్షోభంలో వ్యవసాయం

*సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (CSE) 'నేల జీవసంబంధ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం' అనే అంశంపై తన తాజా నివేదికను చర్చించడానికి ఒక వెబినార్‌ను నిర్వహించింది. ఈ వెబినార్‌లో, నివేదికలోని ముఖ్యాంశాలను చర్చించడానికి ప్రముఖ శాస్త్రవేత్తలు, విధాన నిపుణులు, పారిశ్రామిక ఆవిష్కర్తలతో కూడిన ఒక ప్యానెల్ సమావేశమైంది.*

*నిపుణుల ప్యానెల్‌లో ఐసీఏఆర్-నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చరల్లీ ఇంపార్టెంట్ మైక్రోఆర్గానిజమ్స్ డైరెక్టర్ అలోక్ కుమార్ శ్రీవాస్తవ, ఐసీఏఆర్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోని సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ డివిజన్ హెడ్ అండ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ దేబాశిష్ మండల్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామంజనేయులు జివి, బయోమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు మరియు సీఈఓ ప్రఫుల్ గాద్గే, సీఎస్ఈలోని సస్టైనబుల్ ఫుడ్ సిస్టమ్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్ అమిత్ ఖురానా, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ రాజేశ్వరి సిన్హా ఉన్నారు.*

భారత నేల క్షీణత ఒక పెను సంక్షోభంగా మారుతోందని, క్షీణిస్తున్న నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో నేల జీవసంబంధ అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు గుర్తించారు.

నేల ఆరోగ్యం క్షీణించడానికి దోహదపడే ముఖ్య కారకాలలో విచక్షణారహితంగా పురుగుమందులు, వ్యవసాయ రసాయనాల వాడకం, పంట అవశేషాలను కాల్చడం, ఒకే రకమైన పంటను పండించడం, అధిక దిగుబడినిచ్చే రకాలపై ఆధారపడటం, సేంద్రియ పదార్థాల పునరుత్పత్తి సరిగా జరగకపోవడం, యాంత్రీకరణ కారణంగా నేల గట్టిపడటం వంటివి ఉన్నాయి. దీనివల్ల, నేల సూక్ష్మ వాతావరణాన్ని, పోషకాల పునఃచక్రీయతను కాపాడటంలో సహాయపడే సహజ నేల జీవసముదాయంలో తీవ్రమైన అసమతుల్యత ఏర్పడింది. అందువల్ల, నేలపైన అలాగే మొక్కల మైక్రోబయోమ్‌పై ఒక నిర్దిష్టమైన ప్రతికూల ఒత్తిడి ఏర్పడుతుంది. అధికంగా ఎరువులు వాడటం వల్ల నైట్రేట్ కాలుష్యం మరియు నైట్రస్ ఆక్సైడ్ ఉద్గారాలు కూడా కలుగుతాయి.



నేలలోని సూక్ష్మజీవులు (బ్యాక్టీరియా, శిలీంధ్రాలు వంటివి) బంధించబడిన పోషకాలను కరిగించి, వాటిని మొక్కలకు అందుబాటులోకి తెచ్చి, గ్రహించడానికి అనువుగా మార్చే ముఖ్యమైన వాహకాలుగా పనిచేస్తాయి. ఆరోగ్యకరమైన నేల జీవశాస్త్రం లేకపోతే, ఎరువుల గ్రహణ సామర్థ్యం కూడా తక్కువగా ఉంటుంది. నత్రజని వినియోగ సామర్థ్యం కేవలం 30-40 శాతం కాగా, భాస్వరం సామర్థ్యం 15-20 శాతంగా ఉంటుంది. మెరుగైన నేల జీవ ఆరోగ్యం, మెరుగైన నేల భౌతిక ఆరోగ్యానికి మరియు మొత్తం నేల పనితీరుకు కూడా ముడిపడి ఉంటుంది.

### నేల నిర్వహణకు ముందు కొలత ముఖ్యం

సరైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం రూపంలో ఉపయోగ పడేటట్లయితే, నేల జీవసంబంధ పారామితులను పరీక్షించడం యొక్క ప్రాముఖ్యతను గుర్తించారు. ప్రస్తుతం, నేల పరీక్షా ప్రయోగశాలలు పోషకాలపై దృష్టి సారిస్తున్నాయి. నేల జీవసంబంధ విధులను కొలవడానికి తగిన సదుపాయాలను కలిగి లేవు.

నేల జీవసంబంధ ఆరోగ్య పర్యవేక్షణను జాతీయ స్థాయి పర్యవేక్షణ పథకాలలో భాగంగా ఏకీకృతం చేయడం సాధ్యమేనని విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఆచరణీయత, అందుబాటు ధరల దృష్ట్యా, డీహైడ్రోజినేస్, యూరియేస్ వంటి ఎంజైమ్‌లను (వీటి పరీక్షలకు ఒక్కో పరీక్షకు రూ. 100-200 వరకు ఖర్చు కావచ్చు) పర్యవేక్షణ కోసం ప్రత్యామ్నాయాలుగా సూచించారు.

సరళీకృత పద్ధతులు అందుబాటులో ఉంటే లేదా అభివృద్ధి చేయబడితే, ఫాస్ఫటేజ్‌లు, గ్లూకోసిడేజ్‌ల వంటి ఇతర ఎంజైమ్‌లు, సూక్ష్మజీవుల బయోమాస్ కార్బన్, మొత్తం జీవించి ఉన్న సూక్ష్మజీవుల

సంఖ్యలను కూడా అన్వేషించవచ్చు. పెద్ద ఎత్తున క్షేత్రస్థాయి పరీక్షల కోసం 16S rRNA మరియు మెటాజెనోమిక్ విధానాల వంటి ఉన్నత-స్థాయి మాలిక్యులర్ సాధనాలను ఉపయోగించడం యొక్క సాధ్యతకు సంబంధించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

పైన పేర్కొన్న వాటితో పాటు, రైతులు ఒక నిర్ణయం తీసుకోవడంలో సహాయపడటానికి వారి స్థాయిలో (సరళమైన, దృశ్యమానమైన, సులభంగా చేయగలిగే, అనుసరించదగిన) పరీక్షల ఆవశ్యకతను నొక్కి చెప్పారు. దీనికి అనుగుణంగా, పొలంలోనే, నిజ సమయంలో నేల జీవసంబంధమైన ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి పాయింట్-ఆఫ్-కేర్ టెస్టింగ్ ఒక సంభావ్య పరిష్కారం. అయినప్పటికీ, ఇటువంటి పొలం-ఆధారిత పరీక్షా నమూనాల ధ్రువీకరణ, కచ్చితత్వం, తక్కువ అవగాహన, రైతుల స్వీకరణ విషయంలో సవాళ్లు ఇంకా ఉన్నాయి.

నేల జీవసంబంధమైన ఆరోగ్యాన్ని పర్యవేక్షించే దిశగా మార్పు స్పష్టంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు కొలత పద్ధతుల అమలు వేగం మరియు స్థాయిపై దృష్టి సారించాలని నిపుణులు అంగీకరించారు.

### విస్తృతమైన సమగ్ర విధానం అవసరం

మెరుగైన నేల జీవ ఆరోగ్యం కోసం, సమాంతర ప్రయత్నాలు చేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే నేల, పంటల విధానం, వ్యవసాయ పద్ధతుల నుండి విడిగా సూక్ష్మజీవులను చూడలేము. ఇందులో దున్నడాన్ని తగ్గించడం, వరిని బురద చేయడాన్ని ఆపడం, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం మరియు పొలాల్లో నేలలోని సేంద్రియ పదార్థాన్ని మెరుగుపరచడం వంటి పద్ధతులు ఉంటాయి.



నేల జీవ సమాజం యొక్క మనుగడకు, పనితీరుకు అత్యవసరమైన సజీవ వేర్లను కాపాడటానికి, కవర్ క్రాప్స్, మల్చింగ్, అంతరపంటల వంటి వ్యవసాయ-పర్యావరణ పద్ధతులు కూడా సహాయపడతాయి. అందువల్ల, రైతులకు ఇటువంటి పరివర్తన కోసం జ్ఞానం, ఆర్థిక మద్దతుతో కూడిన ఒక ప్రణాళిక మరియు పర్యావరణ వ్యవస్థ అవసరం.

కేంద్రీకృత, ప్రయోగశాల ఆధారిత జీవ ఎరువుల నుండి స్థానికంగా స్వీకరించబడిన, వికేంద్రీకృత, ప్రాంతీయ నేల పరిస్థితులకు సరిపోయే ఉత్పత్తి వైపు మళ్లాల్సిన అవసరాన్ని కూడా ఈ చర్చలు పరిశీలించాయి. ఎందుకంటే భారతదేశంలోని అనేక రకాల నేలలు, పంటల విధానాలు విభిన్నమైన, వైవిధ్యభరితమైన సూక్ష్మజీవుల సముదాయానికి ఆశ్రయం కల్పిస్తాయి.

శాస్త్రీయ సమాజం భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేకమైన సూక్ష్మజీవులను గుర్తించడానికి, వేరు చేయడానికి, వాటి లక్షణాలను నిర్ధారించడానికి సమాంతరంగా కృషి చేస్తోంది. సింథటిక్ కమ్యూనిటీ ఆధారిత వ్యూహాల ద్వారా, ఒక నిర్దిష్ట పంటకు, నిర్దిష్ట పరిస్థితులలో పనిచేయగల సూక్ష్మజీవుల ఫార్ములేషన్లను (స్మార్ట్ బయో-ఫార్ములేషన్లు) అభివృద్ధి చేయడానికి కూడా పరిశోధన జరుగుతోంది.

### రైతులకు సరైన విధాన చట్రం మరియు మద్దతు

ప్రస్తుత విధానాల వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంపై పరిమిత ప్రభావం మాత్రమే ఉందని కూడా ప్రత్యేకంగా చెప్పారు. రసాయన రహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి కొన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి విధానాలు ఉన్నప్పటికీ, అవి క్షేత్రస్థాయిలో ముందుకు సాగుతున్నట్లు కనిపించడం లేదు. కేంద్రీకృత ప్రయోగశాల ఆధారిత పరీక్షలు మరియు డేటా సేకరణ వల్ల ఎరువుల వాడకం, పంటల సరళిలో మార్పు, ఎరువుల రాయితీ విధానాలు లేదా రైతుల నిర్ణయాలపై సానుకూల ప్రభావం చూపలేకపోయింది.

రైతులు మెరుగైన సుస్థిర వ్యవసాయ పద్ధతులకు మారడానికి ప్రభుత్వ మద్దతు అవసరం ఉంది. ఉదాహరణకు, ఐదేళ్లలో రసాయన ఎరువుల వాడకాన్ని 25-30 శాతం తగ్గించేందుకు రాష్ట్రాలకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించాలి. రాయితీలను పునరుద్దేశించడం, రసాయన వాడకంపై అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని, సేంద్రియ, సహజ వ్యవసాయానికి మారుతున్న రైతులకు ప్రోత్సాహకాలుగా మళ్లించడం వంటి అంశాలను పరిగణించవచ్చు. సేంద్రియ, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించే ప్రత్యామ్నాయ కార్యక్రమాలు, ప్రస్తుత వ్యక్తిగత విధానానికి బదులుగా ప్రాంతాల వారీ విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

### నేల జీవసంబంధ ఆరోగ్యం మానవ ఆరోగ్యం, రైతు జీవనోపాధితో ముడిపడి ఉంది.

నేల ఆరోగ్యం క్షీణించడం వల్ల జింక్, ఇనుము వంటి పోషకాలు లేని పంటలు పండుతాయని తేలింది. ఇది జనాభాలో పెరుగుతున్న సూక్ష్మపోషకాల లోపాలకు, అలాగే పిల్లలలో ఎదుగుదల లోపానికి, బక్కచిక్కిపోవడానికి కూడా దోహదపడుతోంది.

ఉత్పాదకతకు అతీతంగా, మెరుగైన నేల జీవసంబంధ ఆరోగ్యం పోషకాహార భద్రత, రసాయన రహిత ఆహార లభ్యతతో కూడా ముడిపడి ఉంటుందని నిపుణులు వాదించారు. మెరుగైన నేల జీవశాస్త్రం ద్వారా పోషకాలను గ్రహించే సామర్థ్యం పెరగడం వల్ల ఎరువుల అవసరం తగ్గుతుంది. తద్వారా రైతులకు మెరుగైన జీవనోపాధి లభించడంతో పాటు, అదే సమయంలో మెరుగైన, అధిక దిగుబడిని కూడా పొందవచ్చు.

-రాజేశ్వరి సిన్హా

(డౌన్ టు ఎర్త్ మ్యాగజైన్ నుండి)

# నమ్మకమైన తోడు... రేడియో

"నేను ఒంటరిని కాను. నాకు రేడియో తోడుంది"... ఒక ఇంటర్వ్యూలో సంచలనాత్మక హాలీవుడ్ నటీమణి మార్లిన్ మన్రో అన్న మాట ఇది. ఒక విలేకరి అడిగిన ప్రశ్నకి "ఇట్స్ నాట్ ట్రూ, ఐ హేడ్ నథింగ్ ఆన్... ఐ హేవ్ ది రేడియో ఆన్" అని అన్నారు చమత్కారంగా మార్లిన్ మన్రో.

నిజమే 'రేడియో' ఒక నమ్మకమైన తోడు. ఎల్లవేళలా మనని అంటిపెట్టుకుని మనకి ఉల్లాసాన్ని, వివేకాన్ని, జ్ఞానాన్ని అందించే ప్రియ నేస్తం రేడియో!

ప్రఖ్యాత రచయిత డా. నాగసూరి వేణుగోపాల్ "రేడియో ప్రసారాల పరిణామం – చారిత్రిక, సాంకేతిక, సృజనాత్మక నేపథ్యం" అన్న పుస్తకాన్ని ఇటీవల వెలువరించారు. ఇది రేడియో ప్రసారాల వెనుక వున్న చారిత్రిక, సాంకేతిక, సృజనాత్మక అంశాల్ని మనకి పరిచయం చేస్తుంది. రేడియో పట్ల ఒక అవగాహన పాఠకులలో కలిగించడానికి దోహదపడుతుంది.




రచయిత వేణుగోపాల్ భౌతికశాస్త్రంలో ఎం.ఎస్సీ, ఎంఫిల్ చేశారు. జర్నలిజంలో పి.హెచ్.డి. అలాగే ఆకాశవాణిలో కార్యక్రమ విభాగంలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసినవారు. రచయితకి వున్న ఈ నేపథ్యం ఈ గ్రంథ రచనలో బాగా ఉపకరించి వుంటుంది.

మనిషి తన ఆలోచనలను నోటి ద్వారా వ్యక్తం చేయడం పరిణామక్రమంలో గొప్ప విప్లవాత్మకమైన ఘటనగా భావించవచ్చు. అలా భాష పుట్టింది. తర్వాత లిపి ఏర్పడింది. శాసనాల్లోని అక్షరాలు చరిత్రకి ఆధారభూతాలైనాయి. తాళపత్రాలపైకి ఎక్కిన అక్షరాలు గ్రంథాలయి పరిమితంగానైనా మనుషుల్ని జ్ఞానవంతుల్ని చేశాయి. ఈ క్రమంలో అచ్చు యంత్రం రావడం గొప్ప ముందడుగు. ప్రింటింగ్ మొదలైన తర్వాత పుస్తకాలు, పత్రికలు జనానికి అందుబాటులోకి వచ్చాయి. ప్రజా బాహుళ్యానికి శాస్త్ర, సాహిత్య విషయాలను తెలుసుకోవడం సులువైంది. ఈ క్రమంలోనే రేడియో మాధ్యమం అవతరించడం ఒక గొప్ప చారిత్రిక ఘట్టంగా పరిగణించవచ్చు.

రేడియో వ్యవస్థ ఏర్పాటు వెనుక జరిగిన శాస్త్ర, సాంకేతిక మధనాన్ని ఈ పుస్తకం సంక్షిప్తంగాను, సరళంగాను మనకి అందిస్తుంది.

కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించి టెలిగ్రాఫ్, టెలిఫోన్ తొలుత సంచలనం రేపాయి. టెలిగ్రాఫ్‌లో ఆన్ – ఆఫ్ ప్రక్రియను మాత్రమే పంపగలిగితే, టెలిఫోన్‌లో మనిషి గొంతుకను కూడా దూరంలో వున్న వారికి చేరవేయడం సాధ్యమైంది. ఈ రెండూ తీగల సాయంతో పని చేసే సాధనాలు. తర్వాత వచ్చిన ఆవిష్కరణలు తీగలు లేకుండానే అంటే వైర్‌లెస్ రేడియోగా రూపొందింది. ఇదే క్రమంగా 'రేడియో'గా చలామణీ అయ్యింది.

జర్మనీ శాస్త్రవేత్త హెయిన్ రిచ్ హెర్ట్జ్ ప్రయోగాత్మకంగా విద్యుదయస్కాంత తరంగాలు ఉన్నాయని చేసిన పరిశోధనా ఫలితాలు మొత్తం ప్రపంచాన్ని ఆకర్షించాయి. ఈ పరిశోధనా ఫలితాలపై దృష్టి పెట్టిన వారిలో భారతీయ శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ కూడా ఒకరు. తన ప్రయోగాల ఫలితాలను బోస్ జర్నల్స్‌లో ప్రకటించారు. కానీ పేటెంట్ పొందాలనే ప్రయత్నం చేయలేదు. తన పరిశోధనా ఫలితాలు సర్వమానవాళికి చెందాలనే ఆదర్శం బోస్‌ది. అయితే ఔత్సాహికుడు, వాణిజ్య దృష్టి గల గూగ్లీ ఎల్మ్ మార్కోనీ రేడియో సంబంధించి ఫలితాన్ని సాధించడమే కాకుండా, పేటెంట్ కూడా పొందాడు. 1909 సం.లో మార్కోనీ నోబుల్ బహుమతిని పొందాడు. ఈ సందర్భంలో ఎడ్విన్ ఆర్మ్‌స్ట్రాంగ్ అన్న శాస్త్రవేత్త కృషి గురించి కూడా మనం చెప్పుకోవాలి. ఆయనే ఎఫ్.ఎమ్. ప్రసారాలకు సంబంధించి అద్భుతమైన ఫలితాలు సాధించిన శాస్త్రవేత్త. ఎఫ్.ఎమ్. కేంద్రాలు ప్రారంభం కావడంతో నాణ్యమైన, ఆటంక రహిత ప్రసారాలు సాధ్యమైనాయి.

ఈ పుస్తకంలో భారతదేశంలో రేడియో ప్రసారాల చరిత్రను, దానిలోని ముఖ్య ఘట్టాలను ఒక క్రమపద్ధతిలో పొందుపరిచారు రచయిత.

1921వ సంవత్సరం ఆగష్టులో టైమ్స్ ఆఫ్ ఇండియా, తంతి–తపాలా శాఖ సంయుక్తంగా బొంబాయిలో రేడియో ప్రసారాలు ప్రారంభించాయి. 1924 మే 16న మద్రాసు ప్రెసిడెన్సీలో రేడియో క్లబ్ ఏర్పడి జూలై 31 నుండి ప్రతిరోజూ కార్యక్రమాలను ప్రసారం చేసింది. 1926 మార్చిలో ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ఏర్పడి ప్రభుత్వంతో ఒక ఒప్పందం చేసుకుని ప్రసారాలు సాగించింది. తర్వాత ఆ కంపెనీ ఒప్పందం నుండి వైదొలగడంతో రేడియో ప్రసారాలు ప్రభుత్వ ప్రత్యక్ష అజమాయిషీ కిందకి వచ్చాయి. ఈ ప్రసారాల నిర్వహణ కోసం ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ ఏర్పాటయింది. ఈ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ ఆల్ ఇండియా రేడియోగా పేరు మార్చుకుని ప్రసారాలు కొనసాగించింది. అంటే 'ఆల్ ఇండియా రేడియో' ప్రయాణం మొదలై సరిగా ఈ ఏడాది జూన్ 8 నాటికి తొంభై ఏళ్లు అయ్యిందన్నమాట.

ఇక ఆల్ ఇండియా రేడియోని ఆకాశవాణిగా పిలవడం అందరికీ తెలిసిందే. స్వాతంత్ర్యానికి ముందు మైసూర్ సంస్థానం నిర్వహించే రేడియోకి 'ఆకాశవాణి' అని పిలిచేవారు. ఈ పేరును ఆల్ ఇండియా

రేడియో 1956వ సంవత్సరంలో స్వీకరించింది. ఇప్పుడు 'ఆకాశవాణి' అన్న పేరునే ఎక్కువగా వినియోగిస్తున్నారు.

గాంధీజీ రేడియోలో తొలిసారి ప్రసంగించడానికి ఢిల్లీ కేంద్రానికి వచ్చిన సువర్ణ ఘట్టాన్ని రచయిత విపులంగా ప్రస్తావించారు ఒక చోట.

ఇక తెలుగు రేడియో ప్రసారాల ప్రారంభ సన్నివేశాన్ని వివరంగా చెప్పిందీ రచన.

"నేనిప్పుడు చెన్నపట్నం నుంచి మాట్లాడుతున్నాను. మీరు ఎక్కడ నుంచి వినుచున్నారో నేను చెప్పజాలను. కాని అనేక స్థలముల యందు వినుచున్నారని తలచుచున్నాను.'' ఈ మాటలతో తెలుగు ప్రసారాలు చెన్నపట్నం నుండి శుభారంభం అయ్యాయి. అది 1938 జూన్ 16వ తేది రాత్రి ఎనిమిది గంటల సమయం. ప్రారంభ వాక్యాలు పలికినది ఆనాటి మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కుర్మా వెంకట రెడ్డి. అలా తెలుగు ప్రసారాలు మదరాసు నుండి ప్రారంభమయ్యాయి. ఆ రోజుల్లో మదరాసు కేంద్ర ప్రసారాల్లో తెలుగుకే ప్రాధాన్యం వుండేది.

1948 నవంబర్ 1న విజయవాడ కేంద్రం ప్రారంభమయ్యింది. ఉర్దూ కార్యక్రమాలకు ప్రాధాన్యం యిచ్చే నిజాం కాలంనాటి దక్కన్ రేడియో 1950 ఏప్రిల్ 1న ఆల్ ఇండియా రేడియో హైదరాబాద్‌గా అవతరించింది. 1963వ సం.లో కడప, విశాఖ కేంద్రాలు మొదలయ్యాయి. తర్వాతికాలంలో ఆదిలాబాద్, కొత్త గూడెం, అనంతపురం, కర్నూలు, నిజామాబాద్, మార్కాపురం ప్రాంతాల్లో ప్రాంతీయ రేడియో కేంద్రాలు వచ్చాయి.

స్వాతంత్ర్య పోరాటంలో రేడియో నిర్వహించిన పాత్రను ఒక అధ్యాయంలో విస్తృతంగా వివరించారు రచయిత. క్విట్ ఇండియా ఉద్యమ వేళ 1942వ సంవత్సరంలో రామ్ మనోహర్ లోహియా స్ఫూర్తితో 78 రోజుల పాటు ఒక రహస్య రేడియో నడిచింది. దీన్ని ఆనాటి పాలకులు కాంగ్రెస్ ఇల్లీగల్ రేడియో అన్నారు. ఉద్యమకారులు అజాద్ రేడియో అని పిలుచుకునేవారు. దీని ప్రసారాలు దేశభక్తులకు ఎంతో ప్రేరణ కలిగించేవి.

నిజాం నిరంకుశ పాలనను ప్రతిఘటిస్తూ భాగ్యనగర్ రేడియో ప్రసారాలు సాగాయి. దీని ప్రసారాలు బెజవాడ, చెన్నపట్టణం వరకు వినిపించేవి. ఈ రేడియో సాయంత్రం 7 గం. నుండి 8 గం. వరకు ఒక గంట పాటు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషుల్లో ప్రసారాలు చేసేది.

ఈ పుస్తక రచయిత అకాశవాణిలో మూడు దశాబ్దాలకు పైగా పనిజేసిన వ్యక్తి కావడంతో రేడియో కార్యక్రమాలను రూపొందించడం వెనుక అధికారుల, సిబ్బంది కృషిని సవివరంగా తెలియజేసారు. ఆకాశవాణి కార్యక్రమాలను సమాజంలో అన్ని వర్గాలకు ఉపయోగపడే విధంగా, ఆకట్టుకొనే విధంగా రూపొందించి ప్రసారం చేస్తారు.

**తెలుగు సమాజంపై సాంస్కృతికంగా ఎంతో ప్రభావం చూపిన రేడియో మాధ్యమంపై వచ్చిన పుస్తకాలు తక్కువే. ప్రధానంగా ఆకాశవాణిలో పని జేసినవారు తమ ఉద్యోగ అనుభవాల్ని, జ్ఞాపకాల్ని వివరిస్తూ రాసిన పుస్తకాలు కొన్ని కనిపిస్తాయి. ఆచంట జానకిరాం, బాలాంత్రపు రజనీకాంతరావు, గొల్లపూడి మారుతీరావు, శారదా శ్రీనివాసన్, డి. వెంకట్రామయ్య మొదలైనవారు రాసిన పుస్తకాలు ఈ కోవలోకి వస్తాయి. వేణుగోపాల్ పుస్తకం కొంచెం భిన్నమైంది.**

వ్యవసాయ విభాగం గురించి చెప్పుకుంటే ఈ విభాగం వ్యవసాయ శాస్త్ర పట్టభద్రులైన అధికారుల నిర్వహణలో వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకొని రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను ప్రసారం చేస్తూ వుంటుంది. యువవాణి విభాగం యువత ఆలోచనలకు ఆసక్తులకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందిస్తుంది. యువతీయువకులు మెచ్చే ప్రసంగాలు, చర్చలు, క్రీడా వార్తలు, సంగీతం మొదలైన అంశాలు ప్రసారం అవుతూ వుంటాయి. రేడియోలో వచ్చే నాటికలకు, నాటకాలకు శ్రోతలు చెవి కోసుకుంటారు. గతంలో ఆదివారం మధ్యాహ్నం వచ్చే గంట నాటకానికి సినిమాలకు వున్నంత క్రేజు వుండేది. ఇలా రేడియోలో వుండే అన్ని విభాగాలకు సంబంధించిన సమాచారం ఈ పుస్తకంలో పొందుపరిచారు రచయిత.

అలాగే రేడియో మాధ్యపు ప్రత్యేకత గురించి చెబుతూ రేడియో కథ లక్షణాలను ప్రస్తావించారు. కథలో చిన్న చిన్న వాక్యాలు ఉండాలి. మళ్లీ వినే అవకాశం వుండదు. కాబట్టి మరీ మలుపులు లేకుండా జాగ్రత్త పడాలి లాంటి సూచనలు రచయితలకు ఇచ్చారు నాగసూరి.


రేడియోకి సంబంధించిన సమాచారం ఒకే చోట దొరకాలనే ఉద్దేశ్యంతో రేడియోపై వివిధ రచయితలు గతంలో చేసిన రచనల నుండి మేలిమి భాగాలను ఈ పుస్తకాలో పొందుపరిచారు నాగసూరి. అలాంటి రచన ఆచంట జానకిరాం గారి 'కృష్ణశాస్త్రి శర్మిష్ట' పేర్కొనదగినది. అలాంటిదే దాశరథి రాసిన 'రేడియోలో గోపీచంద్' వ్యాసం ఆసక్తికరంగా చదివిస్తుంది.

తెలుగు సమాజంపై సాంస్కృతికంగా ఎంతో ప్రభావం చూపిన రేడియో మాధ్యమంపై వచ్చిన పుస్తకాలు తక్కువే. ప్రధానంగా ఆకాశవాణిలో పని జేసినవారు తమ ఉద్యోగ అనుభవాల్ని, జ్ఞాపకాల్ని వివరిస్తూ రాసిన పుస్తకాలు కొన్ని కనిపిస్తాయి. ఆచంట జానకిరాం, బాలాంత్రపు రజనీకాంతరావు, గొల్లపూడి మారుతీరావు, శారదా శ్రీనివాసన్, డి. వెంకట్రామయ్య మొదలైనవారు రాసిన పుస్తకాలు ఈ కోవలోకి వస్తాయి. వేణుగోపాల్ పుస్తకం కొంచెం భిన్నమైంది. రేడియో ఆవిర్భావం వెనుక వున్న శాస్త్ర కృషిని రేడియో ఒక వ్యవస్థగా ఏర్పడే క్రమంలోని చారిత్రిక దశలను, రేడియోలోని సృజనకోణాన్ని ఈ గ్రంథం సవివరంగా, సమర్థవంతంగా ఆవిష్కరించింది.

276 పేజీలున్న ఈ పుస్తకం ఒకరకంగా ఉభయ తారకంగా వుంది. అటు రేడియో సిసలైన లబ్దిదారులైన శ్రోతల్ని, పుస్తక పాఠకుల్ని సరిసమానంగా అలరిస్తుంది. ఉభయ రాష్ట్రాల్లోని ప్రముఖ పుస్తక షాపుల్లోను ఈ పుస్తకం లభిస్తుంది. వెల 135 రూ॥లు.

–ఎస్. హనుమంతరావు

m :8897815656




# "సుస్థిర భవిష్యత్తు కోసం యువత సాధికారత అత్యంత కీలకం"

## ఇంజనీర్ వేదకుమార్ మణికొండ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (FBH) తన 26వ వార్షికోత్సవాన్ని జూన్ 5న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) – తెలంగాణ స్టేట్ సెంటర్ సహకారంతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ డా. రమణ నాయక్ బానోతు, FIE, చైర్మన్, IEI తెలంగాణ స్టేట్ సెంటర్ అధ్యక్షత వహించగా, ఇంజనీర్ వేదకుమార్ మణికొండ, చైర్మన్, ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ మరియు ప్రొఫెసర్ మర్రి రమేష్, గౌరవ కార్యదర్శి, IEI ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) – తెలంగాణ స్టేట్ సెంటర్, అతిథులకు హృదయపూర్వక స్వాగతం పలికారు. అనంతరం గౌరవ కార్యదర్శి IEI సభా కార్యక్రమాలను సమర్థవంతంగా సమన్వయం చేస్తూ విజయవంతంగా నిర్వహించారు.



**ప్రొఫెసర్ డా. రమణ నాయక్ బానోతు** మాట్లాడుతూ... ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) మరియు ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ మధ్య ఏర్పడిన భాగస్వామ్యం పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, ప్రజా చైతన్య కార్యక్రమాలకు కొత్త దిశను చూపుతోందని పేర్కొన్నారు.

**ఇంజనీర్ వేదకుమార్ మణికొండ** మాట్లాడుతూ... అర్బన్ అండ్ రీజినల్ ప్లానర్, ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ 26 సంవత్సరాల సేవా ప్రస్థానాన్ని సమీక్షించారు. పర్యావరణ పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తున్న నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, పౌరసమాజం సమిష్టి కృషితో FBH ఆవిర్భవించిందని తెలిపారు. హైదరాబాద్ నగరం మరియు పరిసర ప్రాంతాలను పర్యావరణ కాలుష్యం నుంచి రక్షించడం, నగర సహజ, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడం ఫోరం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గత రెండున్నర దశాబ్దాలుగా వాయు, నీరు, నేల నాణ్యత పరిరక్షణ, అడవులు, చెరువులు, బహిరంగ ప్రదేశాల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, వారసత్వ కట్టడాల రక్షణ, పౌర జీవన నాణ్యత మెరుగుదల వంటి అనేక రంగాల్లో ఫోరం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న FBH, ఈసారి IEI తెలంగాణ స్టేట్ సెంటర్‌తో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించడం రెండు సంస్థల ఉమ్మడి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

"సుస్థిరమైన, పర్యావరణ హిత భవిష్యత్తు నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకం. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, జీవనోపయోగమైన హైదరాబాద్ నిర్మాణంలో యువత ముందుండి నాయకత్వం వహించాలి" అని ఇంజనీర్ వేదకుమార్ మణికొండ పిలుపునిచ్చారు.

**ప్రొఫెసర్ ఆర్. నర్సింహం** మాట్లాడుతూ.. పచ్చదనం, జలవనరుల పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాల నివారణలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



డా. **చక్రధర్** మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలిగించే కృత్రిమ, జీవక్షయం కాని పదార్థాల వినియోగాన్ని తగ్గించి, జీవ వైవిధ్య పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ప్రొఫెసర్ దేవేందర్ రెడ్డి** మాట్లాడుతూ.. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర నగరాల అభివృద్ధి పర్యావరణ పునరుద్ధరణ, సహజ వనరుల పరిరక్షణ, శాస్త్రీయ పట్టణ ప్రణాళికలతో ముడిపడి ఉండాలని సూచించారు.

**శ్రీ ఎం. హనుమంతరావు** మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ సంస్థలు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, పౌర బాధ్యతలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

కార్యక్రమంలో "FBH వార్షిక సంచిక 2025–2026" ఆవిష్కరించారు. సభకు విచ్చేసిన ప్రముఖులకు సంచిక ప్రతులను అందజేశారు. FBH వార్షిక (2025–2026)సంచికకు వ్యాసాలు అందించిన రచయితలను ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు ఆలపించిన పర్యావరణ పరిరక్షణ స్వాగత గీతం సభికులను ఆకట్టుకుంది.

శ్రీమతి సంఘమిత్రా మల్లిక్, జాయింట్ సెక్రటరీ, FBH, ఆలపించిన "హమారీ మాంగే పూరీ కరేన్...!" అనే హైదరాబాద్ ప్రత్యేక గీతం విశేష ఆదరణ పొందింది.

శ్రీమతి శోభా సింగ్, ప్రధాన కార్యదర్శి, FBH మరియు శ్రీ వెంకటేశ్వరరావు, కన్వీనర్, IEI కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించగా, ప్రొఫెసర్ మర్రి రమేష్, గౌరవ కార్యదర్శి, IEI తెలంగాణ స్టేట్ సెంటర్, వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఈ కార్యక్రమంలో శ్రీ టి. వివేక్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యవర్గ సభ్యుడు; శ్రీ చకిలం వేణుగోపాలరావు, మాజీ డిప్యూటీ డైరెక్టర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా; శ్రీ పి. నరహరి, పర్యావరణవేత్త; శ్రీ సుభాష్ రెడ్డి; శ్రీ ఎం. పాండురంగారావు, కన్వీనర్, ఇంటాక్ వరంగల్ చాప్టర్; ఆర్కిటెక్ట్ జె. గాయత్రి, ప్రిన్సిపాల్, జీదీ= ఆర్కిటెక్చర్ కాలేజ్ & కన్వీనర్, ఇంటాక్ రంగారెడ్డి జిల్లా చాప్టర్; శ్రీ కమతం మహేందర్ రెడ్డి, మాజీ డైరెక్టర్, జియాలజీ అండ్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్; శ్రీమతి ఫ్రాక్ ఖాదర్, సెక్రటరీ, సొసైటీ టు సేవ్ రాక్స్; డా. జై కిషన్, చైర్మన్, భవన్స్ న్యూ సైన్స్ కాలేజ్; శ్రీ జి.వి.ఎల్. విజయ్ కుమార్, భూగర్భ శాస్త్రవేత్త; శ్రీ వెంకటేశ్వరరావు, కన్వీనర్, IEI; బ్రదర్ వర్గీస్ MSI, సయ్యద్ ఖాలిద్, శ్రీమతి శ్రీలత, శ్రీ మురళి, అడ్వకేట్ మహ్మద్ అఫ్జల్, లయన్ ధనుంజయ, పురావస్తు పరిశోధకుడు బాబ్జీరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


– కట్టా ప్రభాకర్,
m : 8106721111
e: akumarkatta@gmail.com



VOL 14వ వసంతంలో

167 ISSUES నూట అరవై ఏడవ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



# పదమూడు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 జులై సంచికతో 167 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ. 400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక
వార్షిక చందా : రూ. 300/-

ఒక సంవత్సరం బైండింగ్ పుస్తకం : రూ. 400/-

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - June 2026
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026




Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar